


నిష్పక్షపాతం.. సత్యనిష్ఠ..
అంకితభావం..
ప్రజల మేలు కోసం చూపే తెగువ
పత్రికలకు అవశ్యం.



# ఆంధ్రపత్రిక

స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన ఏకైక దినపత్రిక - స్థాపితం 1914

విజయవాడ సంపుటి : 60 సంచిక : 291 • పేజీలు : 12 • శనివారం 13 జూలై 2024 • వెల : రూ. 5.00

Published from : Vijayawada| Visakhapatnam |Srikakulam | Rajahmundry|Kurnool|Guntur|Ongole| Nellore Tirupati


- ఎపిలో రోడ్లకు మహర్దశ
- తక్షణమే మరమ్మతులు చేయాలి
- రోడ్ల రిపేర్లకు సిఎం ఆదేశాలు
- కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా చెల్లించలేదు
- గుంతలు పూడ్చేందుకు తక్షణం రూ.300 కోట్లు అవసరం
- గత ప్రభుత్వం రోడ్ల స్థితిగతులను పట్టించు కోలేదు
- వాహనదారులు, ప్రజలు ఐదేళ్ల పాటు నరకం..
- రాష్ట్రంలో 7,087 కిలోమీటర్ల పరిధిలో తక్షణం పనులు చేపట్టాలి
- పరిస్థితిని మార్చేలా పనులు మొదలు కావాల
- అత్యవసర పనులకు వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించండి



# రోడ్లపై గుంతలు ఉండవద్దు

## - అధికారులతో సమీక్షించిన సిఎం చంద్రబాబు

**అమరావతి,జూలై 12 (ఆంధ్రపత్రిక):** రాష్ట్రంలో దెబ్బతిన్న రోడ్లను బాగుచేసే పక్రియ ప్రారంభించాలని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. రహదారులు భవనాల శాఖపై ఏపీ సీఎం చంద్రబాబు శుక్ర వారం సమీక్ష నిర్వహించారు. రోడ్ల నిర్మాణం, పరిస్థితిపై ఆరా తీశారు. జగన్ ప్రభుత్వంలో కనీసం గుం తలు కూడా పూడ్చ లేదని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా చెల్లించలేదని, గత ప్రభుత్వ తీరుతో ఇప్పుడెవరూ ముందుకురావడం లేదని అధికారులు వివరించారు. గుంతలు పూడ్చేందుకు తక్షణం రూ.300 కోట్లు అవసరమని అధికారులు తెలిపారు. అత్యవసర పనులకు వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. గత ప్రభుత్వం రోడ్ల స్థితిగతులను పట్టించు కోలేదని, వాహనదారులు, ప్రజలు ఐదేళ్ల పాటు నరకం చూశారని అన్నారు. ఈ పరిస్థితిని మార్చేలా మిగతా 7లో

# ప్లాస్టిక్‌ను తరిమేస్తేనే మనుగడ

- చెత్తతో సంపదను సృష్టిద్దాం..
- పంచాయితీల్లో చెత్తతో అనేక ఉపయోగాలి
- నీటి కాలుష్యాన్ని అరికట్టాలన్నదే సంకల్పం
- పిఠాపురం నుంచే ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తాం
- అధికారులతో సమీక్షలో డిప్యూటి సిఎం పవన్



**అమరావతి,జూలై 12 (ఆంధ్రపత్రిక):** చెత్త నుంచి కూడా సంపద సృష్టించి ఆదాయం పెంచుకునేలా మార్గాలు అన్వేషించా లని డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ సూచించారు. ఇదే లక్ష్యంతో సాలిడ్ అండ్ లిక్విడ్ రిసోర్స్ మేనేజ్మెంట్ ప్రాజెక్ట్ చేపట్టినట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. తాడేపల్లిలోని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయంలో గురువారం ఆ శాఖపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. తొలిసారి కార్యాలయానికి వచ్చిన ఆయనకు అధికారులు మిగతా 7లో

# రహదారి అడ్డుకట్టలను తొలగించండి

## - హరియాణా ప్రభుత్వానికి సుప్రీం ఆదేశం



**న్యూఢిల్లీ,జూలై 12 :** హరియాణాలోని అంబాలా సమీపంలో శంభూ సరిహద్దు వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన అడ్డుకట్టల్ని తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. ఒక హైవేను అడ్డుకునేందుకు రాష్ట్రానికి ఏ అధికారం ఉంది మిగతా 7లో

# సుప్రీంకోర్టులో కేజీవ్రాల్‌కు ఊరట

## - ఢిల్లీ లిక్కర్ కేసులో మధ్యంతర బెయిల్ మంజూరు



**న్యూఢిల్లీ,జూలై 12 :** సుప్రీంకోర్టులో కేజ్రీవాల్‌కు ఊరట లభించింది. ఆయనకు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేస్తూ తీర్పును వెలువరించింది. ఢిల్లీ లిక్కర్ ఈడీ మనీలాండరింగ్ కేసులో ఆయనకు ధర్మాసనం మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అయితే, బెయిల్ కేసులో

# ఎమర్జెన్సీపై కేంద్రం కీలక నిర్ణయం

- జూన్ 25ను రాజ్యాంగ హత్యా దివస్‌గా ప్రకటన
- ఎక్స్ వేదికగా హోంమంత్రి అమిత్ షా ప్రకటన



**న్యూఢిల్లీ,జూలై 12 :** కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దాదాపు 50ఏళ్ల క్రితం దేశంలో అత్యయిక స్థితిని విధించిన మిగతా 7లో



**అమరావతి,జూలై 12 (ఆంధ్రపత్రిక):** ఆంధ్రప్రదేశ్‌లో ఈనెల 23 నుంచి 'పొలం పిలుస్తోంది' అనే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని ఏపీ వ్యవసాయశాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు తెలిపారు. శుక్ర వారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో వ్యవసాయ మంత్రిగాబాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా 'పొలం పిలుస్తోంది ' కార్యక్రమం అమలు దస్త్రంపై తొలి సంతకం చేశారు. ప్రతి మంగళవారం, బుధవారం వ్యవసాయ అధికారులు రైతుల వద్దకు వెళ్లి నూతన పద్ధతులు, ఆధునిక మిగతా 7లో

# ఈనెల 23 నుంచి 'పొలం పిలుస్తోంది'

- వారానికి రెండురోజులు కార్యక్రమం..
- బాధ్యతలు స్వీకరించిన మంత్రి అచ్చెన్నాయుడు
- వైసీపీ హయాంలో రైతాంగం అనేక ఇబ్బందులు

# బాధ్యతలు హైడ్రాకు ఇవ్వండి



- నాలాలు,చెరువులు,ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై కఠిన చర్యలు
- అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశాలు

7లో

# సమాచార,పౌర సంబంధాల శాఖ డైరెక్టర్‌గా హిమాన్షు శుక్లా

- బాధ్యతలు స్వీకరించిన హిమాన్షు శుక్లా
- హిమాన్షు శుక్లాకు ఘనస్వాగతం పలికిన ఐ అండ్ పీఆర్ అధికారులు
- పుష్పగుచ్ఛాలతో అభినందలు తెలిపిన ఉద్యోగులు, సిబ్బంది
- గతంలో డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు
- సమర్థవంతమైన అధికారిగా పేరు తెచ్చుకున్న హిమాన్షు శుక్లా



**విజయవాడ, జూలై 12 (ఆంధ్రపత్రిక):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ గా 2013 బ్యాచ్ కు చెందిన ఐఏఎస్ అధికారి హిమాన్షు శుక్లా శుక్రవారం బాధ్యతలు మిగతా 7లో

# నేపాల్‌లో ఘోర ప్రమాదం



## - రెండు బస్సులపై విరిగిపడ్డ కొండచరియలు

## - 65 మంది నదిలో పడి కొట్టుకు పోయినట్లు సమాచారం

**ఖాట్మండ్,జూలై 12 :** నేపాల్‌లో శుక్రవారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం చోటుచేసుకొంది. నారాయణఘాట్-ముగ్లింగ్ జాతీయ రహదారిపై తెల్లవారుజామున మిగతా 7లో

# అనంతపురంలో ఎయిర్‌పోర్టు?



- భూములిస్తే అనంతలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు..
- ఇందు కోసం 1,200 ఎకరాలు అవసరమవుతాయి..
- సమీక్షలో వెల్లడించిన మంత్రి రామ్మోహన్ నాయుడు

7లో

# మాజీ సీఎం జగన్‌పై కేసు నమోదు

- సీఐడీ డీజీ సునీల్‌కుమార్,జగన్‌లపై ఫిర్యాదు
- రఘురామపై కస్టోడియల్ టార్చర్..
- హత్యాయత్నం చేసినట్లు పేర్కొన్న ఎమ్మెల్యే
- ఆనాడు ఎంపిగా ఉన్నప్పుడు వేధింపులు
- రఘురామ ఫిర్యాదుపై గుంటూరులో కేసు నమోదు





**అమరావతి,జూలై 12 (ఆంధ్రపత్రిక):** మాజీ సీఎం జగన్, ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ సహా పలువురిపై కేసు నమోదైంది. తెదేపా ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ఫిర్యాదు మేరకు గుంటూరులోని నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వైకాపా ప్రభుత్వ మిగతా 7లో

# షర్మిల కీలక వ్యాఖ్యలు

## - ఉచిత బస్సు ప్రయాణానికి ఎందుకింత ఆలస్యం..

## - ప్రభుత్వానికి షర్మిల సూటి ప్రశ్న



**విజయవాడ, జూలై 12 (ఆంధ్రపత్రిక):** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చి నెల పూర్తైన సందర్భంగా ఏపీసీసీ చీఫ్ షర్మిలరెడ్డి మాట్లాడుతూ.. మిగతా 7లో

# ఎమ్మెల్యేలకు అవగాహన అవసరం

- కొత్త ఎమ్మెల్యేలకు అసెంబ్లీ వ్యవహారాల్లో పరిజ్ఞానం..
- అవగాహన అవసరమన్న స్పీకర్ అయ్యన్న పాత్రుడు
- వెంకయ్య లాంటి వారి సలహాలు అవసరం..



**విశాఖ, జూలై 12 (ఆంధ్రపత్రిక):** కొత్తగా 88 మంది ఎమ్మెల్యేలు అసెంబ్లీలో అడుగుపెట్టారని ఏపీ శాసనసభ స్పీకర్ అయ్య న్న పాత్రుడు తెలిపారు. అసెంబ్లీ వ్యయహారాలపై వారికి తగిన పరిజ్ఞానం అవరమని అన్నారు. కొత్త ఎమ్మెల్యేలు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రసంగాలు వింటే చాలు రాజకీయాల్లో ఎదుగుతారని చెప్పారు. శుక్రవారం రుషికొండ మిగతా 7లో

ఒరులేయని యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథముల కెల్లన్

ఆంధ్రపత్రిక

వ్యవస్థాపకులు: దేశోద్ధారక విశ్వదాత శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

# కాలుష్యం - మధుమేహం

మధుమేహం (డయాబెటెస్) ప్రపంచ మానవాళిని నిర్వీర్యం చేస్తున్న వాటిల్లో ప్రధానమైంది. ఈ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా ఉన్న దేశాల లో భారత్ కూడా ప్రధానమైంది. మనది అధిక జనాభా కలిగిన దేశం కూడా. ఈ వ్యాధి ప్రబలడానికి ఎప్పటి నుంచో అనేక కారణాలు చెబుతున్నారు. వాటితో పాటు తాజా అధ్యయనాల్లో కాలుష్యం కూడా ప్రధాన కారణంగా నిపుణులు గుర్తిం చారు. ప్రతి సమస్యకు ఒక పరిష్కారం ఉన్నట్లే మధుమేహ నియంత్రణకు మన ముందు ఎన్నో మార్గాలు ఉన్నాయి. వాటిని నిబద్ధతగా అమలు చేస్తే ఇటు వంటి రోగాలను ఆమడదూరం పారదోలవచ్చని శాస్త్రవేత్తలు భరోసా ఇస్తున్నా రు. ఆ దిశగా ముందుకు సాగడమే మన ముందున్న బృహత్తర బాధ్యత. ఇది సమిష్టి సంకల్పం కావాలి. మధుమేహం రావడంలో జీవనశైలి, జీన్స్ వంటి వాటిని ప్రధానంగా చెబుతా ఉంటా రు. ఊబకాయం, అధికరక్తపోటు కూడా మరిన్ని కారణాలుగా తెలిసిందే. వీటన్నిటిని మించి అనేక ప్రాంతాలలో అనేక విధాలుగా ప్రబలుతున్న కాలుష్యం నిశ్శబ్ద విస్ఫోటనం సృష్టిస్తోంది. ఒకప్పుడు పట్టణవాసులకే పరిమితమైన మధుమేహం ముప్పు ఇప్పుడు పల్లెల్లోనూ ప్రము ఖంగా విస్తరిస్తోంది. పల్లెవాసుల జీవనశైలి పట్టణజీవులకు పూర్తి భిన్నం. సరే ఇప్పుడు మారిన వాతావరణం, అందివచ్చిన సదుపాయాలు, ఆధునికత పల్లెసీ మలను కూడా పాడుచేస్తున్నాయి. సన్నగా ఉండ డానికి, లావుగా ఉండడానికి, కొవ్వుకు, మధుమేహంకు సంబంధంలేదని అధ్యయ నాలు, పరిశీలనలు చెబుతున్నాయి. శారీరకంగా ఎక్కువ శ్రమ చేసే రైతులు, కూలీలు, శ్రామికులు కూడా దీనిబారిన పడుతున్నారు. "అమ్మ ప్రేమ తప్ప అంతా కాలుష్యం" అని ఆ మధ్య ఓ సినిమాలో డైలాగు కూడా వచ్చింది. అట్లే సర్వం కాలుష్యమయమై పోయింది. గాలి, నీరు, భూమి అంతటా అదే సమస్య. శ్వాస, నీరు, ఆహారం ద్వారా శరీరంలోకి చేరుకొనే విషతుల్యాలన్నీ క్లోమగ్రంథి నుంచి నేరుగా ఇన్సులిన్ తయారీని అడ్డుకోవచ్చు. రోగనిరోధక శక్తిని దెబ్బతీయవచ్చు. క్లోమగ్రంథిలో ఇన్సులిన్‌ను తయారుచేసే కణాలను పాడుచేయవచ్చు. రసా యనక చర్యల ప్రభావంతో పిండి పదార్థాల జీవక్రియ కూడా అస్తవ్యస్త మవ్వడానికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. శరీరంలో మిగిలిపోయే లోహ రేణువులు, శ్వాస ద్వారా ఊపిరితిత్తుల్లోకి చేరుకొనే నుసి ఏదో రూపంలో మధుమేహం రావడానికి దోహదం చేస్తాయి. వాయు కాలుష్యం ద్వారా ఊపిరితిత్తులు దెబ్బతింటాయి. గుండె జబ్బులు ప్రబలుతాయి. మధుమేహం కూడా సోకుతుంది. మధుమేహానికి వాయు కాలుష్యం ప్రధాన కారకంగా నిలుస్తుందని నిపుణులు చెబుతున్నారు. కాలుష్య ప్రాంతాలలో మాస్కులు ధరి స్తే దీనిని చాలా మేరకు అడ్డుకొనవచ్చు. గణాంకాలను పరిశీలిస్తే మన దేశం లో మధుమేహం కారణంగా మరణించేవారిలో వాయుకాలుష్యం ద్వారా ప్రా ణాలు కోల్పోయేవారు సుమారు 10 శాతం మంది ఉంటారని తెలుస్తోం ది. పెట్రోలు, డీజిల్, గ్యాస్ వంటివి, పరిశ్రమల ద్వారా వచ్చే పొగ, వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో కాల్చడం, వంట కోసం వెచ్చించే కలప, బొగ్గు, పిడకలు, గోబర్ గ్యాస్ వంటివన్నీ కాలుష్యకారకలే. వీటిని తగ్గించుకొనే ప్రయత్నం చేయాలి. క్రిమి సంహార మందులు, ప్లాస్టిక్, లోహాలు మొదలైనవన్నీ ప్రమాదకరమైనవే. కాలుష్య రహిత ఆహారం తీసుకుంటే అది సంజీవనిలా ఉప యోగపడుతుంది. ఇందులోనూ శాకాహారాన్ని ఎక్కువగా తీసుకోవడం మంచి దని నిపుణులు సూచిస్తున్నారు. అది కూడా ప్రాచీనమైన సంప్రదాయ పద్ధతు లలో వంటచేస్తే ఎంతో మంచిదని అంటున్నారు. పండించే పంట, క్షేత్రం అతి కీలకం. వీటన్నిటిని పాటించగలిగితే మధుమేహాన్ని ఆశించినమేరకు జయిం చవచ్చని భావించవచ్చు. అంతా మనిషి చేతిలోనే ఉంది.

# ప్లాస్టిక్ వద్దు పేపర్ బ్యాగు ముద్దు



సుస్థిరాభివృద్ధి లక్ష్య సాధనకు కాగితపు సంచులు వినియోగిద్దాం. ప్రకృతి పర్యావరణ పరిరక్షణకు పాటు పడుదాం. జన జీవనం సమస్తం ప్లాస్టిక్ పీడన మయం పల్లె నుండి పట్నం వరకు పేదవాడి నుండి ధనికుని వరకు కార్మికుని నుండి కర్షకుని వరకు సౌకర్యంపేరున ప్లాస్టిక్ కవర్ల వినియోగం జీవన శైలి అయ్యింది మానవ స్వార్థం పడగ విప్పింది సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లతో భూకాలుష్యం పర్యావరణ కాలుష్యం జల కాలుష్యం పెరిగి జల చరాలు మృత్యువాత పడుతున్నాయి ప్లాస్టిక్ వినియోగం అణ్వాయుధాల కంటే ప్రమాదం కరోనా వైరస్ కంటే భయంకరం ప్రజారోగ్యం ప్రమాదంలో పడింది వింత వ్యాధులు ప్రభ వైద్య ఆరోగ్య రంగానికి సవాలుగా మారింది. సముద్ర జీవులు అంతరిస్తున్నాయి కలుషిత కారకాలను నిషేదించాలి. ప్లాస్టిక్ బ్యాగ్ వద్దు. గోనె సంచే ముద్దు పేపర్ బ్యాగ్ వాడుధాం భూమి ఆరోగ్యాన్ని రక్షిద్దాం. పర్యావరణాన్ని రక్షిధ్ధాం క్లాత్ బ్యాగ్ వాడుధాం కాలుష్యాన్ని, అరికడదాం పేపర్ బ్యాగు వాడుదాం. ప్రకృతి సహజ వనరులను కాపాడుదాం. కుండ ఆరోగ్యానికి ఆయువుపట్టు మట్టి పాత్రలు వాడుధాం. ప్రజారోగ్యాన్ని సంరక్షిద్దాం. పర్యావరణ హిత పద్ధతులు పాటిద్దాం. పునరుత్పాదక శక్తి వనరులను వాడుదాం బయో టెక్నాలజీ ఎనర్జీ పవన విద్యుత్ శిలాజ ఇంధనాలు ప్రత్యామ్నాయ శక్తి వనరుల సద్వినియోగంతో కాలుష్య రహిత పరిశ్రమలు పచ్చదనం పరిశుభ్రత ప్రకృతి సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రకృతిని భవిష్యత్ తరాలకు కానుకగా ఇద్దాం గో గ్రీన్ నో ప్లాస్టిక్ జీవన విధానం కావాలి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లనిర్మూలనకు ప్రతిజ్ఞ చేద్దాంఆరోగ్య భారత్ ను ఆవిష్కరిధ్దాం.

# పలు పదవులు నిర్వహించిన జస్టిస్ కటికితల రామస్వామి

"కన్నతల్లిని, జన్మనిచ్చిన ఊరును మరవకూడదని" మనకో సామెత. అవకాశాలు అంది వచ్చి, ఉన్నతులుగా పెరిగినా జన్మించిన గ్రామంలో గుడిని నిర్మించటం, బడుగు–బలహీన వర్గాల పిల్లలు చదువుకోటానికి బడిని ఏర్పాటుచేయటం గ్రామంలో మంచినీటి సదుపాయం లేక మహిళలు పడుతున్న అవస్థలు తీర్చటం కోసం మంచినీటి వసతులు కల్పించటం, గ్రామ ప్రజలకు వైద్య సదుపాయం అందించటం కోసం ప్రాథమిక వైద్యశాల ఏర్పాటు చేయటం లాంటివన్నీ పుట్టి పెరిగిన ఊరు ఋణం తీర్చుకునే జాబితాలోకే వస్తాయి. అలాంటి వారిలో జస్టిస్ కటికితల రామస్వామి ఒకరు. కటికితల రామస్వామి 1932 జూలై 13న జన్మించారు. తల్లి మంగమ్మ, తండ్రి చిట్టయ్య. పశ్చిమగోదావరి జిల్లా. మార్టేరుకు సమీపంలోని భట్లమగటూరు గ్రామంలో జన్మించారు. అప్పటికి పల్లెటూళ్ళలో విద్య, వైద్య సదుపాయాలుం డేవి కాదన్న విషయం ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ప్రాథమిక విద్య దశలోనే రామస్వామి ఇబ్బందులు పడ్డారు. భవిష్యత్లో తనకు అవకాశం కలిసి వస్తే, జన్మనిచ్చిన గ్రామ ప్రజల అవసరాలన్నీ తీర్చాలని బాల్యంలోనే నిర్ణయించుకున్నారు రామస్వామి. ప్రాథమిక విద్య అనంతరం మార్టేరులోని హైస్కూలులో పదవతరగతి చదివారు. భీమవరం కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. ఆంధ్ర విశ్వ విద్యాలయంలో (విశాఖపట్నం) నుంచి యం.ఎ. డిగ్రీ అందుకు న్నారు. అటు తర్వాత "లా" పట్టా కూడా అందుకున్నారు. 1956లో హైదరాబాదుకు వచ్చి, న్యాయవాద వృత్తి చేపట్టారు. అప్పటికి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటై కొద్దినెలలు మాత్రమే. ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు కోసం ఆంధ్రనాయకులు పలు పోరాటాలు జరపటంతో పాటు, కొందరు మహనీయులు ప్రాణాలు కూడా అర్పించారు. హైదరాబా దు స్థానికుల్లో కొందరికి ఇది మింగుడుపడని విషయం. అలాంటి క్లిష్ట వాతావరణంలో రామస్వామి హైదరాబాదులో ప్రాక్టీసు ప్రారంభించటం "కత్తిమీద సాము" లాంటిదని వారి అనుయా



యులు అభిప్రాయపడేవారు. న్యాయం, ధర్మం, చట్టం, నిజాయితీ విషయాల్లో నిక్కచ్చిగా, నిర్మొహమాటంగా ముందుకు సాగే రామ స్వామికి హైదరాబాదులోని క్లిష్ట పరిస్థితులు అడ్డంకి కాలేదు. 196 2 నాటికి సివిల్, క్రిమినల్ లాయరుగా మంచి గుర్తింపు పొందారు. తన వద్దకు వచ్చిన క్లయింటుల కేసులను గుడ్డిగా స్వీకరించటం వారి అభిమతం కాదు. కేసులు పూర్వాపరాలు క్షుణ్ణంగా పరిశీలించటం, న్యాయబద్ధమైనవని భావించిన వాటినే స్వీకరించి, క్లయింటులకు న్యాయం చేసేవారు. 1970లో రాష్ట్ర ప్రభుత్వ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియమితులయ్యారు. 1974 నుండి ప్రభుత్వ ప్లీడరుగా పదోన్నతి పొందారు. 1980–82 మధ్యకాలంలో ప్రభుత్వ న్యాయవాదిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే, రాష్ట్ర విద్యుచ్ఛక్తి బోర్డుకు సీనియర్ స్టాండింగ్ కౌన్సిలర్గా బాధ్యతలు నిర్వర్తించారు. 1982 సెప్టెంబరులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా రామస్వామిని నియమిస్తూ, భారత రాష్ట్రపతి ఉత్తర్వులిచ్చారు. 1982 నుంచి 1989 వరకు హైకోర్టు జడ్జిగా కొనసాగారు. అనంతరం పదోన్నతి పొంది, 1989లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 1997లో వరకు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా కొనసాగి, పదవీ విరమణ చేశారు. 1998 నుంచి 2002 వరకు జాతీయ మానవహక్కుల కమీషన్ సభ్యుడిగా పనిచేశారు. న్యాయవాదిగా, న్యాయమూర్తిగా హైదరాబాదులో బాధ్యతలు నిర్వర్తించినంత కాలం రామస్వామి ఇందిరా పార్కుకు వెళ్ళి, వాకింగ్ చేసి, పలువుర్ని ఆశ్చర్యపరచేవా రట. సాధారణ వ్యక్తిగా వ్యవహరిస్తూ, అక్కడికి వచ్చే వాకర్సుతో కలిసి మెలిసి తిరిగేవారట. ఆ రోజుల్లో హైదరాబాదులో నిర్వహించబడే సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాల్లో తరుచుగా పాల్గొనటం వారికి అలవాటయింది. పదవీ విరమణ అనంతరం సమాజసేవ కార్యక్రమాల పట్ల దృష్టి కేంద్రీకరించారు. జ్యోత్స్న ఛారిటబుల్ పేరున ఒక ట్రస్టు ఏర్పాటు చేశారు. న్యాయశాస్త్రం చదివే విద్యార్థులతో పాటు, న్యాయవాదులుగా కొనసాగుతూ ఆర్థిక ఇబ్బందుల నెదుర్కొంటున్న వారికి కూడా నెలవారీగా ఆర్థిక సహాయం అందించటం ఈ ట్రస్టు ప్రధానోద్దేశ్యం. సుప్రీం కోర్టు న్యాయమూర్తి లాంటి ఉన్నత స్థాయికి పెరిగినా తను పెరిగిన భట్ల మగటూరు గ్రామాన్ని మర్చిపోకుండా, గుడి, బడి, మంచినీటి సౌకర్యం, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం లాంటివి ఏర్పాటుచేశారు. "రివెంట్ సెస్ జర్నీ, లాంజ్ ఆక్విజేషన్" లాంటి పుస్తకాలను కూడా ఆయన రాశారు. పదవీ విరమణ అనంతరం రామస్వామి చిన్న కుమార్తె జయ ఇంటిలో హైదరాబాదులో ఉండేవారు. ఉదయం ఇంటి వద్దనే వాకింగ్ చేస్తూ, పడిపోయారు. 2019 మార్చి 6వ తేదీన రామస్వామి నిద్రలోనే కన్నుమూశారు.

**దాసరి ఆళ్వారస్వామి**

# విద్యా హక్కు పరి రక్షణ అందరి బాధ్యత

విద్యను పొందడం మాత్రమే హక్కు కాదు, సరైన ఉపాధ్యాయుడి వద్ద విద్యను అభ్యసించడం కూడా హక్కే. కాలం ఎంతగా మారినా మన సమాజం ఉత్తమ ఉపాధ్యాయులను అధికంగా తయారు చేయలేక పోతుందనేది సత్యం. సాధారణ ఉపాధ్యాయుడు పాఠాల్ని బోధిస్తాడు. మంచి ఉపాధ్యాయుడు వాటిని వివరిస్తాడు. ఉత్తమ ఉపాధ్యాయుడు విశదీకరిస్తాడు. గొప్ప ఉపాధ్యాయుడు స్ఫూర్తిని అందిస్తాడు. గురువుల బోధనతోనే విద్యార్థులు ప్రపంచాన్ని తెలుసు కుంటారు, ఉన్నత వ్యక్తులుగా ఎదుగుతారు. ప్రపంచంలో సుమారు 80కోట్ల మంది నిరక్షరాస్యులు ఉండగా అందులో 23.8 కోట్ల మంది మనదేశం లోనే ఉన్నట్లు వెల్లడైంది. ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది ప్రసిద్ధ గురువులు ఉన్నారు. న్యూటన్, పైథాగరస్, సర్వేపల్లి రాధాకృష్ణన్ మొదలైన వారు ఆదర్శంగా నిలిచారు. విశ్వా మిత్రుడు, సాందీపుడు, పరశు రాముడు, ఆది శంకరాచార్యులు, ద్రోణా చార్యులు, పరమహంస మొదలైన వారంతా పేరొందిన గురువులు. విద్య అనే ఆస్తిని సమానంగా పంచగల శక్తి ఒక ఉపాధ్యాయుడికే ఉంది. ప్రజాదరణ, అపారమైన గౌరవం ఉన్న కారణంగానే ఎంతోమంది ఉపాధ్యాయులు నాయకులయ్యారు. వీరిలో ముఖ్యంగా చెప్పుకోవాల్సిన వారు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్. ఒక అధ్యాపకుడు భారత దేశానికి రాష్ట్రపతిగా పనిచేసిన ఘనత ఆయనకే చెల్లింది. ఆయన పుట్టిన రోజును మన దేశంలో ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపు కుంటాము. ప్రఖ్యాత శాస్త్రవేత్త అబ్దుల్ కలాం రాష్టపతిగా పదవీకాలం ముగియ గానే చెన్నైలోని అన్నా విశ్వ విద్యాలయంలో అధ్యాపకుడిగా చేరారు. బోధన చేస్తూనే ఆయన తుదిశ్వాస విడిచారు. యావత్ ప్రపంచానికి ఆయన గొప్ప సందేశాన్ని అందించారు. జ్ఞాన సముపార్జన గురువు బోధన వలనే సంపూర్ణంగా సిద్ధిస్తుంది. 'గు'శబ్దంధకారే స్యాత్/ 'రు'శబ్దంతి నిరోధతః, అంధకార నిరోధితం/ గురురీత్య బిదీయతే... అనే ఆర్యుల మాటలను పరికించి చూస్తే 'అజ్ఞానమనే అంధకారాన్ని పారద్రోలి జ్ఞానమనే కాంతులను వెలిగించే వారినే నిజమైన గురువులుగా భావించవచ్చు. నీతివంతమైన జీవనానికి అలవాటుపడే విద్యార్థులను ఉపాధ్యాయులు తీర్చిదిద్ద గలగాలి. సమాజాలు మారొచ్చు, సిద్ధాంతాలు మారొచ్చు. కానీ విద్యార్థి, ఉపాధ్యాయుల మధ్య సంబంధం శాశ్వతమైనది. ఈ విషయాన్ని యువ ఉపాధ్యాయులు గుర్తుంచు కోవాలి. విద్యార్థుల భవిష్యత్‌పైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. సమాచారం అందివ్వడంతోనే ఉపాధ్యాయుడి పాత్ర ముగియదని నిజానికి ఉపాధ్యాయుడు



రకరకాల నైపుణ్యాల్ని విద్యార్థులకు అందించ వలసి ఉంటుందని కొఠారి కమిషన్ పేర్కొంది. జాతి నిర్మాణంలో తల్లిదండ్రుల తర్వాత కీలకపాత్ర పోషించేది గురువే అవుతాడు. అనేక మంది గురువులు విద్యార్థుల మదిలో ప్రముఖ స్థానాన్ని ఏర్పరుచు కున్నారు. ఇందుకు ఉదాహరణ లుగా శ్రీరాముడు- విశ్వామిత్రుడు, శ్రీకృష్ణుడు- సాందీపుడు, శివాజీ- సమర్థ రామదాసు, వివేకానంద- రామకృష్ణ పరమ హంసలను పేర్కొనవచ్చు. మాతృదేవోభవ- పితృదేవోభవ- ఆచార్య దేవోభవ అన్నారు పెద్దలు. తల్లిదండ్రుల తరువాతి స్థానం గురువుదే అని స్పష్టం చేశారు. ఉపాధ్యాయ వృత్తిలో అడుగు పెట్టేవారు తమ వృత్తిని ప్రేమించే లక్షణం కలిగి ఉండాలి. తాము భావి పౌరులను తీర్చిదిద్దు తున్నామనే భావన ఉండాలి. విద్యార్థి ఎగిరే గాలిపటం అయితే దానికి ఆధారమైన దారం గురువు. ఉపాధ్యాయులు తమ మేధో సంపత్తిని పెంపొందించు కోవాలి. తమ జీవిత కాలంలో కనీసం నాలుగు తరాల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందనే విషయాన్ని గమనించాలి. వృత్తి నైపుణ్యాల పెంపు, కంప్యూటర్ వినియోగం, డిజిటల్ లిటరసీ కార్యక్రమాలను నిర్వహించాలి. బాలబాలికల్లో విద్యా ప్రమాణాలు మెరుగు పరిచేందుకు కృషిచేయాలి. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 'మార్చలేని గతాన్ని గురించి ఆలోచించవద్దు.. చేతిలోఉన్న భవిష్యత్తు కోసం శ్రమించు' అనేవారు.

ఉపాధ్యాయుడు తన బోధనా పద్ధతుల్ని పునః సమీక్షించుకొని తదనుగుణంగా విద్యార్థులను నవ సమాజానికి అందించాలి. ఒకప్పుడు గుమాస్తాలను తయారుచేసే విధంగా విద్యాలక్ష్యం వుండేది. నేడు సామాజిక ప్రాధాన్యతలు మారి పోయాయి. దేశానికి పరిశోధకులు కావాలి. వ్యక్తుల స్వభావాన్ని, సామర్థ్యాన్ని, వారి భవిష్యత్తును తీర్చిదిద్దే పవిత్రమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని ప్రవచించిన అబ్దుల్ కలాం పలుకులకు సార్థకత చేకూర్చాలి. నేటి యువ ఉపాధ్యాయులు అందుకు కంకణ బద్ధులై వృత్తిని నిబద్ధతతో నిర్వర్తించాలి. కోవిడ్ 19 మహమ్మారి ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా విద్యావ్యవస్థలు ఎదుర్కొంటున్న సవాళ్లకు ఊతమిస్తున్నది. ఇప్పుడు గతంలో కంటే, విద్యా హక్కును పరిరక్షించడానికి ప్రతి ఒక్కరూ ఉపాధ్యాయులతో కలిసి పనిచేయాలి. ఉపాధ్యాయ లోకం వెనక బడుతున్న విద్యార్థులకు మద్దతు ఇవ్వడానికి, అభ్యాస అంతరాలను తగ్గించేలా ఉపాధ్యాయుల కృషి పరంగా ఇది చాలా కీలక సమయం. విద్య యొక్క భవిష్యత్తును మరియు బోధనా వృత్తిని రూపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా ముఖ్యం.

**సంగన భట్ల రామ కిష్టయ్య**

# వీధి కుక్కల నియంత్రణకు నిపుణుల కమిటీ ఏర్పాటు

వీధి కుక్కల నియంత్రణకు వారంలోగా నిపుణుల కమిటీ ఏర్పాటు కావాలని రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు జారీ చేయడం హర్షనీయం. హైదరాబాదులో వీధి కుక్కల దాడుల్లో పిల్లలు మృత్యువాత పడుతున్నారని వీధి కుక్కల నియంత్రణకు జి'హెచ్'ఎం'సి వారంలోగా నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని జి'హెచ్'ఎం'సి'కి హైకోర్టు ఆదేశాలు జారీ చేయడం తక్షణమే స్వాగతించదగిన చర్యఅని తెలంగాణ ఎకనామిక్ ఫోరం 'సామాజిక ఆర్థిక అధ్యయనం వేదిక రాష్ట్ర అధ్యక్షులు నేదునూరి కనకయ్య ఒక ప్రకటనలో హర్షంవ్యక్తం చేశారు. నేడు తెలంగాణ ఎకానమిక్ ఫోరం రాష్ట్ర కార్యాలయంలో హైదరాబాద్లో వీధి "కుక్కల బెడద నివారణబి సమస్యలు పరిష్కారాలుబి ఎదురౌతున్న సవాళ్ళుబి" అంశంపై జరిగిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడుతూ వీధి కుక్కల నియంత్రణ కోసం ఏమి చేశారు? అన్న విషయంపై గణాంకాలు ముఖ్యం కాదని భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ఏమి చర్యలు తీసుకుంటు న్నారనేది ముఖ్యమైన అవసరమని హైకోర్టు జి ' హెచ్ 'ఎం సి' అధికారులను తీవ్రంగా హెచ్చరించడం పట్ల జి'హెచ్'ఎం'సి' అధికారులు అప్రమత్తం కావాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రతి కార్పోరే టర్ ఆధ్వర్యంలో తమ డివిజన్ పరిధిలోగల రెసిడెన్షియల్ అసోసి యేషన్స్ అధ్యక్ష 'కార్యదర్శులతో పాటు వెటర్నరీ వైద్యాధికారుల సిబ్బందిని కమిటీ సభ్యులుగా చేర్చి. ప్రతి 3 నెలలకు ఒక సారి కమిటీ సమావేశమై వీధి కుక్కల బెడద నివారణపై సమీక్ష సమావేశం నిర్వహించాలి .వీధి కుక్కల బెడద నివారణలో పౌర సమాజాన్ని ' స్వచ్ఛంధ సంస్థలను' భాగస్వాములను చేయాలని తెలంగాణ ఎకనామిక్ ఫోరం' సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షులు' నేదునూరి కనకయ్య సూచించారు. తెలంగాణ ఎకనామిక్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సి'హెచ్ 'శ్రీనివాస్ మాట్లాడుతూ జి'హెచ్'ఎం'సి అధికారులు సిబ్బంది వీధి కుక్కల దాడుల పట్ల ఉదాసీనంగా వ్యవహరించడం సరైంది కాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. సామాజిక అధ్యయన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు' సుధాకర్ మాట్లాడుతూ రెసిడెన్షియల్ అసోసియేషన్స్ జి'హెచ్'ఎం'సి అధికారులకు కంప్లైంట్ ఇచ్చినప్పటికి నిమ్మకు నీరు



ఎత్తినట్టునిర్లక్ష్యంగాప్రవర్తించడంవల్ల వీధి కుక్కల స్వైర విహారం పప్రతిహతంగా కొనసాగుతుంది. పిల్లలు మహిళలు' వృద్ధులు కాలనీలో మురికివాడలో వీధి కుక్కల బెడద ఎక్కువైంది. వీధి కుక్కల బెడదను నివారించడానికి మానవీయ కోణంలో పరిష్కారాలు చేపట్టాలని వారంలోగా కమిటీ ఏర్పాటు చేయాలని హై కోర్ట్ ఆదే శాలు జారీ చేయడం అభినందనీయం అని అన్నారు. కుక్కల బెడద నియంత్రణకు చర్యలు చేపట్టడం లేదు వ్యాక్సినేషన్ చేయడం లేదు .ఆహారం లేక అది మనుషులపై దాడి చేస్తున్నాయని ఒక పౌరుడు ప్రజాప్రయోజనం దాఖలు చేశారు . కేసును విచారించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాదే 'జస్టిస్ అనిల్ కుమార్తో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది .తరచూ ఈ సంఘటనలు ఎక్కడ జరుగుతున్నాయో ఆ ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించింది. జిల్లాల్లో కూడా కలెక్టర్లకు కుక్కల బెడద నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించింది.

**తీర్మానం**

పిల్లలు చనిపోతున్న విషయాన్ని సీరియస్ గా తీసుకోకుండా జి'హెచ్'ఎం'సి అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం నిర్లక్ష్యం గా వ్యవహరించడం సరైనది కాదని' ప్రతి రెసిడెన్షియల్ అసోసియేషన్ సభ్యులతో కుక్కల బెడద నివారణ పై అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలను కుక్కల దాడుల నుంచి రక్షించే చర్యలు చేపట్టాలని' జి'హెచ్'ఎం.సి పరిధిలో వెటర్నరీ అధికారులను నియమించి కుక్కల బెడదను సత్వరమే నివారించడానికి మౌలిక సదుపాయాలను కలిపించి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికపై చర్యలు చేపట్టాలని ఒక తీర్మానం ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చెయనైనది. ఈ సమావేశంలో తెలంగాణ ఉంచుకోవడం సామాజిక ఆర్థిక అధ్యయనం నాలు సభ్యులు కే 'మహేష్' శ్రీధర్' కృష్ణ సరోజ' శ్రీకాంత్' అనిల్ ఆర్ ' రాజు ' మనోహర్ 'స్వామి ' జానకి' రమేష్ తదితరులు పాల్గొన్నారు

**నేదునూరి కనకయ్య**

# పాఠశాల విద్య- ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యత..!

## మధ్యాహ్న భోజనం పథకం పటిష్టంగా అమలుపరచాలి : జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



**మచిలీపట్నం జూలై 12 (ఆంధ్రపత్రిక) :** పాఠశాల విద్య ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యత అంశమని, విద్యార్థులకు సంబంధించిన పథకాలను సక్రమంగా అమలు చేయడంలో తగిన విధంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ విద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన నగరంలోని తన బంగ్లా నుంచి జిల్లాలోని మండల విద్యాధికారులు (ఎంఈఓ), ఇతర విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు, స్టూడెంట్ కిట్స్ పంపిణీతో పాటు వాటి సమస్యలపై చర్చించి పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని, ముఖ్యంగా గుడ్డు, చిక్కీ, రాగి జావా సక్రమంగా అందించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించాలని, పాఠశాలల్లో అందిస్తున్న పోషకాహారం తీసుకోకపోవడం వల్ల భవిష్యత్తులో విద్యార్థులకు రక్తహీనత(అనీమియా)తో పాటు ఇతర పోషకాహార లోప సమస్యలు తలెత్తుతాయని వివరించాలన్నారు. పాఠశాలలోని విద్యార్థుల హాజరు శాతం ప్రకారం భోజనం సిద్ధం చేయాలన్నారు. వంట చేసే ప్రదేశం శుభ్రంగా ఉండాలని, విద్యార్థులు భోజనం చేసిన తర్వాత కూడా శుభ్రం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనం పథకం నిర్వహణపై అధికారులు తరచుగా పాఠశాలలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, ఆ సమయంలో గుర్తించిన రిమార్కులను తనకు సమర్పించాలన్నారు. తాను కూడా తరుచూ కొన్ని పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేస్తానన్నారు. పెనమలూరులోని ప్రభుత్వ పాఠశాలలో వంట చేసేందుకు షెడ్ లేదని మండల విద్యాధికారి కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, అక్కడ ఇంజనీరింగ్ అధికారులు పర్యటించి షెడ్ నిర్మాణం చేపట్టాలని, అందుకు అయ్యే నిధులను సమకూరుస్తామన్నారు. విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్ పంపిణీ వివరాలపై కలెక్టర్ ఆరా తీశారు. విద్యార్థులకు పంపిణీ చేసిన షూస్ సైజ్ లు సరిపోలడం లేదని, మార్చ్ ఏప్రిల్ నెలలో వారి నుంచి తీసుకున్న కొలతలకు పాఠశాలలు పున ప్రారంభం అయ్యేనాటికి వారి ఎదుగుదల కారణంగా సైజుల్లో వ్యత్యాసాలు వస్తున్నట్లు అధికారులు వివరించారు. సైజుల్లో వ్యత్యాసాలు ఉన్న షూస్ లను మిగతా పాఠశాలల్లోని సైజులను పరస్పరం మార్పిడి చేసుకోవాలని, తద్వారా చాలా వరకు సమస్య పరిష్కారం అవుతుందని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా విద్యాశాఖ అధికారిణి తాహెర సుల్తానా, విద్యాశాఖ ఏడి అజీజ్, సెక్షన్ సూపరింటెండెంట్ పవన్, ఎంఈఓ లు పాల్గొన్నారు.

### మధ్యాహ్న భోజనం మెనూ

## అమల్లో ప్రత్యేక శ్రద్ధ

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి





**పాలకోడేరు: జూలై 12, (ఆంధ్రపత్రిక) :** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యా బోధనతో పాటు నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచిం చారు. పాలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకస్మికంగా తనిఖీ చేసారు. మధ్యాహ్నం భోజనంను స్వయంగా రుచి చూసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ 10వ తరగతి 100 శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. సబ్జెక్టు బాగా నేర్చుకుంటే భవిష్యత్తులో మంచి ఉపయోగం ఉంటుందని విద్యార్థులకు ఆమె సూచించారు. మధ్యాహ్నం భోజనం పథకం మెనూ బోర్డులను పరిశీలించి మెనూ ప్రకారం భోజనాలు విద్యార్థులకు అందించాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలం సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నందున పిల్లలు ఆరోగ్య అలవాట్లను పాటించాలని సూచించారు. భోజనం ముందు తరువాత చేతులను శుభ్రపరుచు కోవాలని తెలిపారు. మెనూ ప్రకారం వంటలు తయారు చేసారా లేదా అని పరిశీలించడమే కాకుండా వడ్డించిన పదార్థాలను నిశితంగా పరిశీలించారు. విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేసారు. రోజువారీ తయారు చేసే వంటలు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు అందరూ పాఠశాలలో తప్పక మధ్యాహ్న భోజనం చేయాలని తెలిపారు. గుడ్డు, చిక్క, రాగి జావ తప్పకుండా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పరిశుభ్రమైన నీటితో వంటలు చేయాలని, త్రాగునీరు కలుషితం కాకుండా చూడాలని ఆదేశించారు. వర్షాకాలం కనుక వంట దగ్గర, వడ్డించే దగ్గర, బోజనం చేయు ప్రదేశం పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ప్రధానోపాధ్యాయుడు పి.మహేశ్ బాబును ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. జిల్లా కలెక్టర్ పాఠశాలను సందర్శించిన సందర్భంలో విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణ, మధ్యాహ్న భోజన జిల్లా కో ఆర్డినేటర్లు కె.కృష్ణారావు, జి.చిన్నియ్య, మండల విద్యాశాఖ అధికారి పి.నాగరాజు, ఉప విద్యాశాఖాధికారి ఎన్. శ్రీనివాస్. బీమవరం ఎంఈఓ 2, సీఆర్పీలు అన్నపూర్ణ, వెంకటేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

## 'దిల్ సే కరో బాత్, భగవాన్ కే సాథ్'

## కాంపైన్‌ను ప్రారంభించిన ఐటిసి మంగల్ దీప్




**రాజమండ్రి జూలై 12, (ఆంధ్రపత్రిక) :** భారతదేశపు ప్రీమియర్ అగర్ బత్తి బ్రాండ్ ఐ టి సి మంగల్దీప్ తమ కొత్త, 'దిల్ సే కరో బాత్, భగవాన్ కే సాథ్' (మనస్ఫూర్తిగా భగవంతునితో మాట్లాడండి) ను అనగా 'భగవంతుడ్ని మీకు సన్నిహితమైన వ్యక్తిగా చేయండి' అని అర్థం ఇచ్చే తమ కాంపైన్ ను ప్రకటించింది. ఈ విలక్షణమైన కాంపైన్ భగవంతునితో తమకు గల దైవిక సంబంధాన్ని సంబరం చేస్తుందని కాంపైన్ విడుదల గురించి ఐటీసీ మ్యాచెస్ – అగరబత్తి బిజినెస్ (ఎంఏబీ) చీఫ్ ఎగ్జిక్యూటివ్ గౌరవ్ తయాల్ అన్నారు, ఇది మనస్ఫూర్తిగా సంభాషణలు చేసే ఇద్దరు సన్నిహిత వ్యక్తుల మధ్య ఉన్న సంబంధంలాగా మనుష్యులు భగవంతునికి మధ్య సంబంధాన్ని ఉదాహరిస్తుందన్నారు. ఈ కాంపైన్ తో, బ్రాండ్ కొత్త స్థానం అనుసరిస్తుందనీ, దీనిలో విభిన్నమైన జీవితాలు, సంస్కారాలు, నమ్మకాలు, ఆధ్యాత్మికత, భక్తిని వ్యక్తీకరించే మార్గాలు ఉంటాయన్నారు. ఈ కాంపైన్ ను లక్ష్యభరితమైన ప్రేక్షకుల వద్దకు తీసుకువెళ్ల డానికి, ఓగిల్వి ఇండియా ద్వారా చిత్రీకరించబడిన కొత్త యాడ్ ను ఐ టి సి మంగల్దీప్ విడుదల చేసిందన్నారు. ఈ కాంపైన్ గురించి ఓగిల్వి ఇండియాలో గ్రూప్ క్రియేటివ్ డైరెక్టర్ రాజేష్ మణి మాట్లాడుతూ తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, అరుణాచల్ ప్రదేశ్, కేరళ రాష్ట్రాల్లో 10 జులైన నుండి ప్రసారమయ్యే ఫ్లాగ్ షిప్ టీవీసీ (యాడ్) విడుదల చేసిందన్నారు. ఈ కొత్త స్థానం గురించి ప్రచారం చేయడానికి సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్ కార్యకలాపాలను ఏర్పాటు చేశామని చెప్పారు.

## మల్లవల్లి రైతులకు నష్టపరిహారం అందజేయ్యాలి



**నూజివీడు జూలై 12, (ఆంధ్రపత్రిక) :** గన్నవరం నియోజకవర్గం మల్లవల్లి పారిశ్రామికవాడ రైతులకు పెండింగ్లో ఉన్న నష్టపరిహారం అందించాలని కోరుతూ గురువారం మచిలీపట్నం కలెక్టర్ కార్యాలయంలో ఎంపీ వల్లభనేని బాలశౌరిని, కృష్ణా జిల్లా కలెక్టర్ రాజబాబుని కలిసి జనసేన నాయకులు, మల్లవల్లి రైతులు వినతిపత్రం అందజే యడం జరిగింది. గత రెండు రోజులుగా సరిహద్దులు ఏర్పాటు చేసే పేరుతో మల్లవల్లి భూముల్లో ఆర్ఎ స్ నెంబర్ 11 లో రెవెన్యూ అధికారులు, ఏపీఐఐసీ అధికారులు కొలతలు కొలుస్తూ మీకు నష్టపరిహారం అంతా ఇచ్చేసాము,ఇంకేమి ఇచ్చేది లేదు అని రైతులను రెచ్చగొట్టే విధంగా మాట్లాడటం జరిగింది. ఈ విషయాన్ని ఎంపీకి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారం ఇప్పించవలసిందిగా రైతులు విన్నవించారు. కలెక్టర్ తో ఈ సమస్య ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టిలో ఉన్నందున వాళ్ల సమస్య పరిష్కారం అయ్యేవరకు అక్కడ ఇటువంటి చర్యలు తీసుకోవద్దని చెప్పడం జరిగింది. కలెక్టర్ గారు కూడా సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి మరియు శివరామకృష్ణ గారు, విజయవాడ రూరల్ మండలం అధ్యక్షులు పోదిలి దుర్గారావు, మల్లవల్లి రైతులు దోనవల్లి వెంకట్రావు, మురళి ముక్కు శేఖర్, మనోహర్ రామకృష్ణ పాల్గొన్నారు

## తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తలు



**ఎ.కొండూరు జూలై 12 (ఆంధ్రపత్రిక) :** ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరుకు చెందిన ఆశా కార్యకర్త తోట రాధా (42) జ్వరంతో మృతి చెందటానికి కారణం వైద్యాధికారి, ఏఎన్ఎంల నిర్లక్ష్యమే కారణమని, వారు సెలవు మంజూరు చేయకపోవడం వల్లే రాధా మృతి చెందిందని, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆశా కార్యకర్తలు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైద్యాధికారులు, ఆశా కార్యకర్తల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని జ్వరాలతో ఉన్న ఆశాలకు సైతం సెలవులు మంజూరు చేయకుండా వేధింపులకు గురి చేస్తున్నారని, అందువల్ల జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఆశా వర్కర్ల విధుల బహిష్కరణ కార్యక్రమంలో భాగంగా ఎ.కొండూరు మండలంలో కూడాఆశాలు విధులు బహిష్కరించినట్లు తెలిపారు. రాధా కుటుంబానికి10 లక్షల ఎక్స్గ్రేషియా చెల్లించాలని, ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, రాధా మృతికి కారకులైన డాక్టర్ ఏఎన్ఎం ల పై చర్యలు తీసుకోవాలని, అనారోగ్యానికి గురైన ఆశాలకు సెలవులు మంజూరు చేయాలని తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్ ఐ దివ్య ప్రసాద్ కువినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలోఆశా కార్యకర్తలు వెంకట రమణ, భారతి,శారద,వెంకట నరసమ్మ,మాధవి,శ్యామల,శాంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

### గత ప్రభుత్వంలో వెంకటాపురం ఎస్సీ స్మశాన వాటిక నిమిత్తం మంజూరు అయిన నిధులు

### 11 లక్షల రూపాయలు

## ఉన్నట్టా లేనట్టా..?



**కలిదిండి జూలై 12 (ఆంధ్రపత్రిక) :** ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం కలిదిండి మండలం వెంకటాపురం గ్రామంలో వెంకటాపురం గ్రామపంచాయతీకి మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి, ప్రజా పరిషత్ కలిదిండి వారి ఉత్తర్వులు1/2020-21ది:8/4/2022 ద్వారా మండల పరిషత్ సాధారణ నిధులు నుండి ఖర్చు చేయుటకు గాను, మండల పరిషత్తు వారు పరిపాలన ఆమోదం మరియు టెక్నికల్ శాంక్షన్ ఇచ్చినందుకు పంచాయతీ వారు వెంకటాపురం హరిజనవాడ ఎస్సీ కాలనీ స్మశాన వాటికలో మట్టి పూడిక మరియు స్మశానం చుట్టూ ఫెన్సింగ్ వేయుటకు 11 లక్షల రూపాయలు గత ప్రభుత్వంలో వర్క్ కమిటీ వేసి పంచాయతీ తీర్మానం నంబర్ 60 గా ఇవ్వడం జరిగినది. కానీ గత ప్రభుత్వంలో ఏదో తూతు మంత్రంగా స్మశానం పక్కన ఉన్న కొద్ది మట్టిని ట్రాక్టర్ ద్వారా తరలించిపూడిక చేయడం జరిగిందని, ఆ పూడిక పనులు కూడా పూర్తిగా జరగలేదని, స్థానిక కాలనీవాసులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనప్పటికీ గత ప్రభుత్వంలో మంజూరు కాబడిన నిధులు 11 లక్షల రూపాయలు ఉన్నట్టా లేనట్టా కాలనీ వాసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తూతు మంత్రం గా స్మశాన వాటిక పక్కన ఉన్న కొద్దిపాటిని మట్టిని ట్రాక్టర్ తో తరలించి చేతులు దులుపుకున్నారని, అది కూడా పూర్తిస్థాయిలో జరగలేదని, స్మశానం వాటికలో చుట్టూ ఎక్కడా కూడా ఫెన్సింగ్ వేయలేదని స్థానిక కాలనీవాసులు వాపోతున్నారు. స్మశాన వాటిక నిధులు 11 లక్షల రూపాయలు ఏమాత్రం అభివృద్ధి కొరకు ఖర్చు పెట్టలేదని, ఆ 11 లక్ష రూపాయలు డబ్బులు ఉన్నట్టా లేనట్టు అని, సమగ్ర విచారణ జరపాలని, అలాగే మట్టి తోలకంపై ఎక్కడినుండి మట్టి తరలించారు, ఎన్ని ట్రాక్టర్ల ద్వారా ఎన్ని ట్రిప్పులకి, యం బుక్ రికార్డు ఎంత జరిగింది, అనేది క్వాలిటీ కంట్రోల్ అండ్ విజిలెన్స్ తనిఖీ ద్వారా విచారణ చేపట్టాలని, అలాగే ఎంత డబ్బు ఖర్చు పెట్టారో ని గ్గ తేల్చాలని నిధులు మంజూరు కాబడిన పూర్తిస్థాయిలో అభివృద్ధి జరగపోవడం ఏమిటనే ప్రశ్నార్థంగా మారినది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి జిల్లా మండల గ్రామ పంచాయతీ అధికారులు విచారణ జరపాలని స్థానికులు వాపోతున్నారు. దీనిపై ఉన్న అధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి.

## ట్రిపుల్ ఐటీకి ఇరువురు విద్యార్థులు ఎంపిక





**నూజివీడు జూలై 12: (ఆంధ్రపత్రిక):** అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇద్దరు విద్యార్థునులకు ట్రిపుల్ సీట్లు సాధించడం జరిగినది అని పాఠశాల ఇన్ ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు పి.రవీంద్ర తెలిపారు. గురువారం ప్రకటించిన ఫలితాలలో ఆముదాల అను నూజివీడు ట్రిపుల్ ఐ టీ కి ,తల్లిబోయిన కావ్య శ్రీ ఒంగోలు ట్రిపుల్ లో సీట్లు సాధించడం జరిగినది. ఇద్దరు విద్యార్థినులు 570 మార్కులు సాధించడం జరిగినది. ఈ సీట్లు సాధించడంపట్ల ఉపాధ్యాయినీ ఉపాధ్యా యులు ఆనందం వ్యక్తం చేయటం జరిగినది. ఈ సంవత్సరముకూడా ఎక్కువ సీట్లు సాధించడానికి కృషి చేస్తామని ఉపాధ్యాయులు లక్ష్మి, మల్లేశ్వరి, విఠల్ బాబు, కోటేశ్వరమ్మ , మనోహరం, రంగారావు, మోహన్ రావు, సాకారవి, బాలు, సౌజన్య ,కృష్ణవేణి తెలిపారు.

### పోలీసులకు పట్టుబడ్డ

## పిడిఎస్ రైస్ లారీలు

55 టన్నుల పిడిఎస్ రైస్ పట్టివేత
పోలీసుల అదుపులో లారీలు
తిరువూరు నియోజకవర్గంలో కాసులు
కురిపిస్తున్న రేషన్ అక్రమ దందా వ్యాపారం
పది రోజుల్లోనే భారీగా దొరికిన రేషన్
మొన్న తిరువూరు నిన్న ఎ.కొండూరు
యదేచ్ఛగా అక్రమ దందా



**ఎ.కొండూరు జూలై 12 (ఆంధ్రపత్రిక) :** పేదలకందాల్సిన రేషన్ బియ్యం అక్రమ వ్యాపారులకు కాసులు కురిపిస్తున్నాయి. తిరువూరు నియోజకవర్గంలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా దర్జాగ నడుస్తోంది. రేషన్ షాపులకు తరలించే పిడిఎస్ రైస్ ను కొందరు అక్రమార్కులు లారీలపై బయట మార్కెట్ కు తరలిస్తూ లక్షలాది రూపాయలు అక్రమంగా సంపాదిస్తున్నారు. రేషన్ షాపుల ద్వారా ఎండీయూ వ్యాన్లలో పేదలకు పంపిణీ చేసే సబ్సిడీ రేషన్ బియ్యాన్ని కొందరు అక్రమార్కులు మామిడి తోటలో గుట్టుచప్పుడు కాకుండా నిలువ ఉంచి లారీల ద్వారా కాకినాడ పోర్టుకు అక్రమంగా తరలిస్తున్నారు. ఈ క్రమంలోనే గురువారం రాత్రి కొందరు అక్రమార్కులు మూడు లారీల్లో సుమారు 55 టన్నుల పిడిఎస్ రైసును అక్రమంగా తరలిస్తుండగా ఎ.కొండూరు పోలీసులు చాకచక్యంగా మెరుపు దాడి జరిపి లారీలను పట్టుకున్నారు. ఎ.కొండూరు మ్యాంగో మార్కెట్ యార్డ్ వద్ద 30 టన్నుల పిడిఎస్ లారీని, స్పిన్నింగ్ మిల్ వద్ద 25 టన్నుల పిడిఎస్ రైస్ లారీని అదుపులోకి తీసుకొని ఎ.కొండూరు పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు ఎస్సై చల్లా కృష్ణా తెలిపారు. తిరువూరు సిఐ అబ్దుల్ నబీ పర్యవేక్షణలో ఎస్సై చల్లా కృష్ణా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తిరువూరు పిడిఎస్ డిటి శ్వేత శుక్రవారం ఉదయం ఎ.కొండూరు సందర్శించి అక్రమ పిడిఎస్ రైస్ లారీలను పరిశీలించి, రేషన్ బియ్యమేనని నిర్ధారణ చేశారు. అక్రమార్కులపై 6ఎ కింద కేసు నమోదు చేసి లారీలను సీజ్ చేసినట్లు డిటి శ్వేత తెలిపారు. అక్రమ రవాణా అడ్డుకట్ట వేసేందుకు పోలీసు అధికారులు అనేక చర్యలు తీసుకుంటున్నప్పటికీ రేషన్ మాఫియా అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా ఎన్ని సంస్కరణలు తెచ్చినా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించినా ఫలితం లేకుండాపోతోందని మండల ప్రాంత ప్రజలు వాపోతున్నారు. సరైన నిఘా లేకపోవడం, సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం వల్లే ఈ అక్రమ దందా దర్జాగా సాగుతోందనేది ఆరోపణలు వినవస్తున్నాయి. పట్టణాల్లో, గ్రామాల్లో రేషన్ బియ్యం సేకరించడానికి ఏజెంట్లను నియమించుకొని రూ.15 కి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. సేకరించిన రేషన్ బియ్యాన్ని రాత్రి వేళ్లలో అక్రమ రవాణా ఇబ్బందిగా ఉండటం తో తెల్లవారుజామున పోలీసులు నిద్రకు ఉపక్రమించే సమయంలో దర్జాగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారు. తెల్లవారు జామున 3 గంటల నుంచి ఉదయం వరకు అక్రమ రవాణా కొనసాగుతుందని ఆయా గ్రామాల ప్రజలు బహిరంగానే చర్చించుకోవడం విశేషం. అక్రమ రవాణాకు అడ్డు అదుపు లేకపోవడంతో అక్రమార్కుల వ్యాపారం మూడు పూలు ఆరుకాయలుగా విరాజిల్లుతోంది. అంతేకాకుండా రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న దళారులను, వ్యాపారులను అదుపులోకి తీసుకుని జరిమానాలతోనే సరిపెడుతున్నారే తప్పా కఠిన చర్యలు తీసుకోవడం లేదు. కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరు పర్చినా బెయిల్‌పై వచ్చి తిరిగి అదే అక్రమ వ్యాపారాన్ని సాగించడంతో రేషన్ బియ్యం అక్రమ దందా ఆగడం లేదని సంబంధిత శాఖాధికారులు వాపోతున్నారు.

### ఆశా వర్కర్ రాధమ్మ కుటుంబాన్ని

## ప్రభుత్వం ఆదుకోవాలి

### సిఐటియు మైలవరం మండల కార్యదర్శి సిహెచ్ సుధాకర్



**మైలవరం, జూలై 12: (ఆంధ్రపత్రిక):** ఏ కొండూరు మండలం ఏ కొండూరు పీఎస్సీ అధికారుల నిర్లక్ష్యంతో మృతి చెందిన ఆశ వర్కర్ తోట రాధమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ శుక్రవారం ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ విధులు బహిష్కరణ కార్యక్రమానికి పిలుపునిచ్చింది. అందులో భాగంగా మైలవరం మండలం చంద్రాల పిహెచ్సి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ వైద్యశాఖ అధికారులు ఆశ వర్కర్స్ వెట్టి చాకిరి చేయించుకుంటూ తీవ్రమైన ఒత్తిడికి గురి చేస్తున్నారని వర్కో సంబంధం లేని పనులు కూడా చేపిస్తూ ఇబ్బందులు పెడుతున్నారని, కనీసం జ్వరంతో అనేక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆశ వర్కర్స్ కు సెలవు ఇచ్చే పరిస్థితి కూడా లేకపోవడం దుర్మార్గం అని ఇటువంటి దుర్మార్గపు చర్యల వల్లే ఈ రోజున రాధమ్మ కుటుంబం రోడ్డు మీద పడిపోయిన పరిస్థితి వచ్చిందని, ఇలా అనేకమంది ఆశ వర్కర్స్ ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి తోట రాదమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని రాధమ్మ మరణానికి కారణమైన అధికారులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని, రాధమ్మ కుటుంబానికి 10 లక్షలు ఎక్స్గ్రేషియో ప్రకటించాలని, అనారోగ్యంతో ఉన్న ఆశ వర్కర్లకు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ప్రత్తిపాటి జ్యోతి, మండల నాయకులు జయలక్ష్మి, జయ, సంతోషం, నాగమణి, రాణి, తెరెజమ్మ, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రపత్రిక
జిల్లాలకు విలేఖరులు కావలెను
స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన
ఏకైక దినపత్రిక - స్థాపితం - 1914
గుంటూరు, బాపట్ల, ఒంగోలు జిల్లాలోని
నియోజకవర్గాలకు
మరియు మండలాల వారిగా
విలేఖర్లు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు
9849998069, 8639287624

## ఆశా వర్కర్ రాధా మృతితో

# ఉలిక్కిపడ్డ ఎ.కొండూరు

మంచం పట్టిన పల్లెలు

విష జ్వరాలతో వణుకుతున్న

కొండూరు గోపాలపురం గ్రామాలు

పట్టించుకోని వైద్యాధికారులు






**ఎ.కొండూరు జూలై 12 (ఆంధ్రపత్రిక) :** విష జ్వరంతో మృతి చెందిన పాత కొండూరుకు చెందిన వెంపాటి లక్ష్మణ మృతి చెంది 15 రోజులు గడవకముందే బుధవారం ఎ.కొండూరు అంబేద్కర్ నగర్ కు చెందిన ఆశా కార్యకర్త తోట రాధా(42) జ్వరంతో మృత్యువాత పడటం వల్ల ఎ.కొండూరు వాసులు ఉలిక్కిపడ్డారు. మరణించిన వీరిరువురు పట్టుమని పది రోజులు కూడా మంచాలు పట్టిన దాఖలాలు లేవు. దీంతో విష జ్వరాలతో వణికి పోతున్న పాత కొండూరు, ఎ.కొండూరు అంబేద్కర్ నగర్,గోపాలపురం గ్రామాలకు చెందిన ప్రజలు వణికి పోతున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని వీరి పరిస్థితి కడుదయనీయంగా మారింది. ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం చేయించుకోవడం వీరికి తలకు మించిన భారంగా మారింది. ఎలాంటి ఆస్తి పాస్తులు లేని వీరు కేవలం కూలి పనులపైనే ఆధారపడి జీవిస్తుంటారు. ఇప్పుడు వస్తున్న విష జ్వరాలు ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి వస్తుండటంతో ఆర్థిక స్తోమత సరిగా లేని వీరి పరిస్థితి కడు దయనీయంగా మారింది. వీరు గత్యంతరం లేని పరిస్థితులలో ఆర్ఎంపీ డాక్టర్ల వద్ద వైద్యం చేయించుకుంటూ తమ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నట్లు చెప్పవచ్చు. కాస్తో కూస్తో ఆర్థిక స్తోమత కలిగి ఉన్న వారు మాత్రం తిరువూరు, మైలవరం విజయవాడ లాంటి,కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లి ఖరీదైన వైద్యం చేయించుకుంటున్నారు. ఒక్కొక్క ఇంట్లో ఎంతమంది కుటుంబ సభ్యులు ఉంటే అంతమందికి విష జ్వరాలు పట్టి పీడిస్తున్నట్లు తెలుస్తుంది. వర్షాకాలం ప్రారంభమై అడపాదడపా వర్షాలు కురుస్తుండటం వల్ల దోమల బెడద ఎక్కువై దోమ కాటు వల్లే ఈ విష జ్వరాలు సోకుతున్నట్లు బాధితులు తెలిపి వాపోయారు. గ్రామాలలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంవల్ల మురుగునీరు ఎక్కడికక్కడే నిల్వ ఉండి దోమలు విజృంభించటం వల్ల జ్వర పీడితులు ఎక్కువవుతున్నారు. కొందరు తిరువూరు, మైలవరం ప్రైవేటు ఆసుపత్రులలో వైద్యం చేయించుకున్నా జ్వరాలు తగుముఖం పట్టకపోవడంతో, విజయవాడ కార్పొరేట్ ఆసుపత్రులకు పరుగులు తీస్తూ వేలకు వేలు ఖర్చు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. గ్రామాలలో జ్వర పీడితులు నానాటికి ఎక్కువ అవుతున్నా స్థానిక వైద్యాధికారులు మాత్రం జ్వరాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వినవస్తున్నాయి. నామమాత్రంగా కొన్ని గ్రామాలలోజ్వర పీడితుల సర్వే పేరుతో వైద్యాధికారులు కాలయాపన చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు. వర్షాకాలం ప్రారంభమై రెండో నెల గడుస్తున్నా కనీసం ఇప్పటివరకు గ్రామాలలోవైద్యాధికారులు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయటం గాని,దోమల మందు ను పిచికారి చేయించ లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిని బట్టి వైద్యాధికారుల నిర్లక్ష్యాన్ని అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా జిల్లా వైద్యాధికారులు స్పందించి ఎ కొండూరు మండలంలోని గ్రామాల్లో, గిరిజన తండాలలో, దళిత వాడల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయించి, దోమల మందును పిచికారి చేయించి జ్వరాల నివారణ చర్యలు చేపట్టాలని మండల ప్రాంత ప్రజలు ముక్తకంఠంతో విజ్ఞప్తి చేస్తున్నారు.

## రెనో 12 5జీ సిరీస్‌ను విడుదల చేసిన ఒప్పో ఇండియా




**విజయవాడ, జూలై 12, (ఆంధ్రపత్రిక) :** రెనో 12 సిరీస్‌ను విడుదల చేస్తున్నట్లు ప్రకటించిన ఒప్పో ఇండియా, దేశంలో ఏఐ ఫోన్‌ల లభ్యతను వేగవంతం చేసే దిశగా తొలి అడుగు వేసింది. రెనో 12 సిరీస్ నిత్యం మీకు తోడుండే ఏఐ. ఇది క్లిష్టమైన ఇమేజ్‌లను ఎడిటింగ్ లేకుండా ఫన్నీ ఫోటోలను అందించేందుకు ఏఐ ఎరేజర్ 2.0, ఏఐ క్లియర్ ఫేస్, ఏఐ బెస్ట్ ఫేస్, స్మార్ట్ ఇమేజ్ మ్యాటింగ్ 2.0వంటి ఫీచర్లను కలిగి ఉంది. ఈ పరికరాలు రోజువారీ ఉత్పాదకతను పెంచడానికి ఏఐ రైటర్, ఏఐ సమ్మరీ, ఏఐస్పీక్‌లను కలిగి ఉన్న గూగుల్ జెమిని ఎల్ఎల్ఎం ఆధారితమైన ఏఐ టూల్‌బాక్స్‌ను కూడా కలిగి ఉంటుంది. రెనో 12ప్రో 5జీ రెండు వేరియంట్‌లలో అందుబాటులో ఉంటుంది.

నాగపట్నం వేళంగని మాత చర్చి వద్ద ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రావాలని చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని, మన విజయవాడ నగర ముద్దుబిడ్డ ఎన్టీఆర్ జిల్లాల్లో అన్నా క్యాంటీన్లు, మెడికల్ క్యాంపులు, దళిత, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల ప్రజలకు చేయూతనిచ్చిన, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ చిన్ని గారు చరిత్రలో అత్యధిక మెజార్టీ సాధించిన సందర్భంగా మొక్కు తీర్చుకుంటున్న, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎస్సీ సెల్. "దళితరత్న" పరిశపోగు రాజేష్.






దేవేంద్రరావు వెంకటేశ్వర లింగం రమేష్ రామిశెట్టి ప్రభాకర్ బొనిక వెంకటేశ్వరరావు తోకల కోటయ్య చిట్టి కోటయ్య చిట్టి లక్ష్మయ్య బండి శంకర్ పైలా రాజారత్నం

ప్రతి ఒక్కరికి అందుబాటులో

# నిత్యవసర ధరలు

- ఎమ్మెల్యే గద్దె రామమోహన్




**విజయవాడ, జూలై 12, (ఆంధ్రపత్రిక) :** ప్రతి ఒక్కరికి నిత్యవసర వస్తువుల ధరలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశ్యంతో తమ ప్రభుత్వం రైతు బజార్లలో ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని శాసనసభ్యులు గద్దె రామమోహన్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం కృష్ణలంక రైతుబజార్లో బియ్యం, కందిపపప్పు విక్రయ కేంద్రాన్ని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ ప్రారంభించి, తక్కువ ధరలకు బియ్యం, కందిపప్పు ప్యాకెట్లను రైతు ప్రజలకు విక్రయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ ధరల నియంత్రణ చేయడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని దాంతో ప్రజలకు బియ్యం, కందిపప్పు కొనాలంటే భయపడే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతు బజార్ల ద్వారా పేదలకు నిత్యావసర వస్తువులను తక్కువ ధరకే అందేలా చేసేందుకు కందిపప్పు, బియ్యాన్ని అందిస్తున్నారన్నారు. ఇవి కేవలం రైతు బజార్లకే పరిమితం కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రముఖ సూపర్ మార్కెట్లలలో కూడా ప్రభుత్వం నిర్ణయించిన తక్కువ ధరలకే బియ్యం, కందిపప్పుల విక్రయాలు జరిపేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, పలిశెట్టి అన్నారావు, గొరిపర్తి నామేశ్వరరావు, తోట శ్రీను, వేములపల్లి రంగారావు, పెద్ది అన్నారావు, నడికొప్పుల శివ, కేశనం భావన్నారాయణ, కొవ్వూరి కిరణ్, కొర్ర అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి త్రాగునీరు, ప్రతి ఎకరాకు

# సాగునీరు ఇదే ప్రభుత్వ ధ్యేయం

## కాగిత కృష్ణ ప్రసాద్



**బంటుమిల్లి జూలై 12, (ఆంధ్రపత్రిక) :** పట్టుసీమ లిఫ్ట్ నుంచి వచ్చిన నీటిని గత బుధవారం నాడు విజయవాడ ప్రకాశం బ్యారేజ్ వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేసి విడుదల చేయగా ఆ నీరు శుక్రవారం నాటికి గుడ్లవల్లేరు లాకులు దగ్గరికి చేరుకోగా శుక్రవారం నాడు కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు చేసి గుడ్లవల్లేరు లాకుల వద్ద బంటుమిల్లి కెనాల్ లాకులు ఓపెన్ చేసి నీరు విడుదల చేసిన పెడన నియోజవర్గం శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మరియు నాయకులు, కార్యకర్తలు, ఇరిగేషన్ డిపార్ట్మెంట్, తదితరులు పాల్గొన్నారు.

## రుణ ప్రణాళిక

# విడుదల చేసిన జిల్లా కలెక్టర్

బ్యాంకర్లతో సమావేశం నిర్వహించిన కలెక్టర్ డీకే బాలాజీ



**మచిలీపట్నం, జూలై 12 (ఆంధ్రపత్రిక) :** ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ ప్రోగ్రాం క్రింద యూనిట్లు మంజూరు చేసిన లబ్ధిదారులకు బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలని, విద్యా రుణాలు, ముద్ర రుణాలు మంజూరుకు బ్యాంకులు ప్రాధాన్యత నివ్వాలని, స్వయం ఉపాధి పథకాల క్రింద నిరుద్యోగ యువతకు ఉదారంగా రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ బ్యాంకు అధికారులకు సూచించారు. వివిధ బ్యాంకుల నియంత్రణాధికారులతో జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం కలెక్టరేట్ లోని మీకోసం సమావేశపు హాలులో జరిగింది. ఈ సమావేశంలో 2024 -25 ఆర్థిక సంవత్సరానికి కృష్ణాజిల్లా వార్షిక రుణ ప్రణాళిక కలెక్టర్ విడుదల చేశారు. 2024- 25 సం. జిల్లాలో వ్యవసాయ పారిశ్రామిక తదితర ప్రాధాన్యత రంగాలు, నాన్ ప్రయారిటీ సెక్టర్ క్రింద మొత్తం 7.52 లక్షల మందికి రు.20,390 కోట్ల రుణాలు మంజూరు చేయాలని వార్షిక రుణ ప్రణాళికలో పేర్కొన్నారు. ఇందులో వ్యవసాయ రంగంలో 5.02 లక్షల మంది రైతులకు రు.10,062 కోట్ల పంట రుణాలు, కాల పరిమితి రుణాలు మంజూరు చేయాలని, ఎమ్మెస్ ఎం ఇ క్రింద 46,606 వేల మందికి రు.2864 కోట్ల రూపాయల రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వార్షిక రుణ ప్రణాళికలో వివిధ రంగాలకు నిర్దేశించిన లక్ష్యాల సాధనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బ్యాంకర్లకు సూచించారు. ముఖ్యంగా విద్యా రుణాలు, ముద్ర రుణాలు మంజూరుకు ప్రాధాన్యత నివ్వాలన్నారు. నిరుద్యోగ యువత జీవనోపాధికి స్వయం ఉపాధి పథకాల క్రింద బ్యాంకు రుణాలు మంజూరు చేయాలన్నారు. కేంద్ర రాష్ట్ర పథకాల క్రింద వివిధ బ్యాంకుల ద్వారా ఉదారంగా రుణాలు మంజూరు చేయాలన్నారు ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ ప్రోగ్రామ్ కింద మంజూరైన యూనిట్లు స్థాపనకు బ్యాంకులు సత్వరమే రుణాలు మంజూరు చేయాలన్నారు. ఫైనాన్షియల్ లిటరసి క్యాంప్స్(ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమాలు) ఎక్కువగా నిర్వహించాలని, కేంద్ర రాష్ట్ర పథకాల మంజూరు పట్ల అవగాహన కల్పించాలన్నారు. రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు టైలరింగ్ మగ్గం వర్క్ ఏసీ మెకానిజం ఫోటోగ్రఫీ మాష్రూమ్ కల్చర్ వంటి కోర్సుల్లో ఆసక్తిగల నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి బ్యాంకు లింకేజీ మంజూరు చేసి వారి స్వయం ఉపాధికి తోడ్పడాలన్నారు. శిక్షణా కార్యక్రమాలు గురించిన అవగాహనకై గ్రామ /వార్డు సచివాలయాల సిబ్బంది సహకారంతో శిక్షణ కార్యక్రమాల సమాచారం నోటీసు బోర్డుల్లో ప్రదర్శించాలన్నారు. కౌలు రైతులకు జారీ చేసిన సిసిఆర్సి కార్డులపై బ్యాంకు రుణాలు మంజూరు లో సమస్యలు బ్యాంకర్లు తెలియజేశారు, ఈ సందర్భంగా కలెక్టర్ కౌలు రైతులకు పంట రుణాలు మంజూరులో బ్యాంకులు ముందుకు రావాలని, ఈ ఏడాది లక్ష్యాలు సాధనకు కృషి చేయాలన్నారు. తొలుత లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ జయవర్ధన్ గత సమావేశపు చర్యా నివేదిక సమర్పించారు. ఈ సమావేశంలో నాబార్డ్ ఏజీఎం మిలింద్, ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ రాజేష్, కే డి సి సి జిఎం చంద్రశేఖర్, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఆర్ వెంకట్రావు పిడి డిఆర్డిఏ/డిపిఓ నాగేశ్వర నాయక్, మెప్మా పీడీ వెంకటనారాయణ, వివిధ బ్యాంకుల నియంత్రణ అధికారులు పాల్గొన్నారు.

## ఆపన్నుల అనాధల సేవలో

# సహాయ ఫౌండేషన్

మహిళలు ప్రతిఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

కె.వి. రామకృష్ణయ్య, కృష్ణాజిల్లా న్యాయ సేవాధికార సంస్థ

కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కె.వి. రామకృష్ణయ్య



**మచిలీపట్నం జూలై 12 (ఆంధ్రపత్రిక) :** ఆపన్నుల అనాధల అభాగ్యుల సేవలో సహాయ ఫౌండేషన్ సేవలు అనన్యసామాన్యమని కృష్ణాజిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి,సీనియర్ సివిల్ జడ్జి కె.వి. రామకృష్ణయ్య అన్నారు. స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ కృష్ణాజిల్లా వారి అధ్వర్యంలో సహాయ ఫౌండేషన్ సహకారంతో శుక్రవారం మహిళల రక్షణ, వారి హక్కులు, మహిళలకు, గర్భిణి స్త్రీలకు, ప్రభుత్వాల నుండి వర్తించే పథకాలు బాలల చట్టాలపై అవగాహన, మహిళలకు వైద్య,న్యాయ సహాయలు, మిషన్ శక్తి,మిషన్ సేవల పై అవగాహన సదస్సును స్థానిక లక్ష్మీటాకీస్ సెంటర్ లో ఎన్ కన్వెన్షన్ హాల్ నందు నిర్వహించడం జరిగింది. ఇండియన్ పోస్టల్ డిపార్ట్మెంట్, పోస్టల్ బ్యాంకు ఆధార్ సంబంధిత పూర్తి సేవలు,ప్రధానమంత్రి మాతృత్వ యోజన,పలు స్కీములు నమోదు చేయడం జరిగింది. బందరు ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం జరిగింది. జిల్లా స్థాయిలో జరిగిన ఈ కార్యక్రమంలో 5 గురు న్యాయమూర్తులు పాల్గొనడం జరిగింది. రామకృష్ణయ్య కృష్ణాజిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి తో బాటు డి .దీపిక సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్.బి . అప్పారావు ఐతే,రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జ్, విజయవాడఎం రేష్మ అదనపు సివిల్ జడ్జ్ నందిగామ,ఏ. సింధూర , అదనపు సివిల్ జడ్జి, తిరువూరు లు పాల్గొన్నారు. అదే విధంగా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ అధికారులునోడల్ ఆఫీసర్ టి. జి .పద్మావతి , సిడిపిఓ గ్లోరీ , ఈవో విజయలక్ష్మి , డి సి పి ఓ మౌనిష, ఓ ఎస్ సి కార్యదర్శి పి అచ్చిష్మ, చైల్డ్ హెల్ప్ లైన్ యూనిట్ కోఆర్డినేటర్ నాగరాజు , కత్తి ఆదినారాయణ ఎస్ పి పోస్టల్ డిపార్ట్మెంట్, సహాయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఉస్మాన్ భాషా ,ఉపాధ్యక్షులు మామిడి ప్రసాద్ ఐపీ చంద్రశేఖర్ , చిలకలపూడి ఎస్సై సత్యనారాయణ సహాయ మహిళ విభాగం అధ్యక్షురాలు కోన వెంకటేశ్వరమ్మ,మాజేటీ లక్ష్మికాంతం,అల్లాడ శ్యామల,విన్నకోట సంధ్య, టి.శాంతి రాణి, సుధాబత్తుల లక్ష్మి,బడుగు ఉమ, మల్లికా, సుభాని, కోన వాణి,తదితరులు పాల్గొన్నారు బాధిత మహిళలు మరియు బాలికలకు అత్యవసర సమయాల్లో టోల్ ఫ్రీ నెంబర్ ఉమెన్స హెల్ప్ లైన్ 181, హెల్ప్ లైన్ నెంబర్ 1098, 100, 112 కి కాల్ చేయవచ్చున్నారు . కానీ వారి తరపున ఎన్జీవోలు, బంధువులు, వారి తల్లిదండ్రులు స్వయంగా ఈ కేంద్రాలను ఆశ్రయించొచ్చన్నారు.

## భారతదేశంలో ఏసర్ బ్రాండ్ కింద స్మార్ట్ ఫోన్‌లను ఆవిష్కరించిన ఇండ్‌కల్ టెక్నాలజీస్

INDKAL



**విజయవాడ, జూలై 12, (ఆంధ్రపత్రిక) :** భారతదేశంలోని ప్రముఖ సాంకేతిక సంస్థ అయిన ఇండ్‌కల్ టెక్నాలజీస్, వినూ త్న సాంకేతికత, అసాధారణ ఉత్పత్తులకు ప్రసిద్ధి చెందిన గ్లోబల్ ఐసీటీ దిగ్గజం ఏసర్ సంస్థతో ట్రేడ్‌మార్క్ లైసెన్సింగ్ ఒప్పందం కింద స్మార్ట్ ఫోన్ మార్కెట్‌లోకి ప్రవేశించినట్లు ప్రకటించింది. ఈ ఒప్పందం ప్రకారం, ఇండ్‌కల్ భారతదేశంలో ఏసర్ బ్రాండ్ క్రింద స్మార్ట్ ఫోన్ల రూపకల్పన, తయారీ, పంపిణీ చేస్తుంది. ఈ వ్యూ హాత్మక ఒప్పందం భారతీయ మార్కెట్లోకి ఏసర్-బ్రాండెడ్ స్మార్ట్ ఫోన్ల పరిచయాన్ని సూచిస్తుంది. ఇది ఆవి ష్కరణ, విస్తరణల కొత్త శకానికి నాంది పలికింది. ఇండ్‌కల్ టెక్నాలజీస్ 2024 మధ్యలో ఏసర్ బ్రాండ్ క్రింద విస్తృత శ్రేణి స్మార్ట్ ఫోన్ మోడళ్లను విడుదల చేయనుంది. ఇది త్వరగానే ఊపందుకొని గణనీయమైన మార్కెట్ వాటాను పొందగలదని భావిస్తున్నారు. ఈ ప్రయత్నం ఏసర్ బ్రాండ్ శక్తి సామర్థ్యాలు, భారతీయ వినియోగదారులకు ప్రీమియం-నాణ్యత ఉత్ప త్తులను అందించడంలో ఇండ్‌కల్ నిబద్ధతను చాటిచెబుతుంది. ఇందులో పటిష్ఠ స్పెసిఫికేషన్‌లు, అత్యాధునిక హార్డ్ వేర్, అధునాతన సాఫ్ట్ వేర్ సాంకేతికతలు ఉన్నాయి. ఇండ్‌కల్ టెక్నాలజీస్ సీఈఓ ఆనంద్ దూబె ఈ సందర్భంగా మాట్లాడుతూ, "ఏసర్ స్మార్ట్ ఫోన్ విషయంలో మేం రెండేళ్లుగా పని చేస్తున్నాం. ఎట్టకేలకు ఈ ప్రయత్నాన్ని ప్రకటించినందుకు మేం సంతోషిస్తున్నాం. ఏసర్ స్మార్ట్ ఫోన్లతో, భారతీయ వినియోగదారులు వేడుక చేసుకోగలరని మేం కచ్చితంగా చెప్పగలం. మా కొనుగోలుదారులు హై ఎండ్ ప్రాసెసర్లు, అత్యున్నత స్థాయి కెమెరా టెక్నాలజీ, సంబంధిత శ్రేణిలో అనేక ప్రీ మియం ఫీచర్‌లతో అనూహ్యంగా చక్కగా రూపొందించబడిన స్మార్ట్ ఫోన్లను పొందగలుగుతారు. ఓ గొప్ప విషయం ఏమిటంటే, అన్ని ఏసర్ - బ్రాండెడ్ స్మార్ట్ ఫోన్లు భారత్ లోనే రూపొందించబడతాయి మరియు తయారు చేయబడతాయి, ఇది ఇండ్‌కల్ కు ఒక ప్రత్యేక విజయం" అని అన్నారు. ఏసర్ గ్లోబల్ స్ట్రాటజిక్ అలయన్సెస్ వీపీ జేడ్ జౌ ఈ సందర్భంగా మాట్లాడుతూ, "1987లో స్థాపించబడినప్ప టి నుండి, ప్రజలు మరియు సాంకేతికత మధ్య అడ్డంకులను ఛేదించడమే ఏసర్ బ్రాండ్ లక్ష్యం. ఏసర్ బ్రాం డ్ క్రింద విస్తృత శ్రేణి స్మార్ట్‌ఫోన్లను అందించడం ద్వారా ఇండ్‌కల్ టెక్నాలజీస్ భారతదేశంలో ఈ ఆశయా న్ని మరింతగా ముందుకు తీసుకువెళ్లనున్నందుకు మేం సంతోషిస్తున్నాం. ఇది తుది వినియోగదారు ఎంపికలను విస్తరింపజేస్తుంది మరియు భారతదేశ మార్కెట్లో వారి అనుభవాన్ని మెరుగుపరుస్తుంది.

## సీఎంఎఫ్ ఫోన్ 1, సీఎంఎఫ్ బడ్స్ ప్రో 2 సీఎంఎఫ్ వాచ్ ప్రో 2ల సేల్ ప్రారంభం




**విజయవాడ,జూలై 12, (ఆంధ్రపత్రిక) :** లండన్ కు చెందిన సీఎంఎఫ్ ఫోన్ 1, సిఎంఎఫ్ వాచ్ ప్రో 2 సిఎం.ఎఫ్ బడ్స్ ప్రో 2ల అమ్మకం ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది.

**సీఎంఎఫ్ ఫోన్ 1**

**సీఎంఎఫ్ ఫోన్:** భారతదేనే కప్పు మొదటి మీడియా టెక్ డైమెన్సిటీ 73005సెషన్ తో వేగముతమైన నమ్మకమైన మరియు సమర్థవంతమైన శక్తి కోసం శ్రేణిలో గొప్ప సామర్థ్యాన్ని అందిస్తోంది 5000 గం బ్యాటరీతో యూజర్స్ సింగిల్ ఛార్జిపై రెండు రోజుల వరకు ఆనందించవచ్చు. సీఎం వాచ్ ల్లో 2మార్చదగిన బీజర్ డిజైన్ టెష్ స్మార్ట్ వాన్ 1.32ళీ ఎమోలెడ్ రెజల్యూషన్ ను కూడీ ఉంటుంది. ఇరవై నాలుగు గంటలు ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్త అది, బ్లూటూత్ కాల్స్ మ్యూజిక్ నియంత్రణ, మరియు నోటిఫికేషన్స్ వంటి సాడివైన ఫీచర్స్ డిమోల్ కమేరా నియంత్రణను యిస్తుంది 1పిఎస్) నీరు మరియు దుమ్ము నిరోధకతతో ఇది చురుకైన జీవన శైలికి మద్దతు ఇస్తుంది 11 రోజుల వరకు బ్యాటరీ జీవిత కాలాన్ని ఇస్తుంది. సీఎంఎఫ్ బడ్స్ 2 కూడ విడుదల చేసిందిసీఎంఎస్ ల డ్యూయల్ డ్రైవర్స్ ఎల్డాక్" మోదుగైన ఆడియో అనుభవం కోసం అడియో వైర్ లైసే ధ్వనీకరణ, 50 డ స్మార్ట్ సిఎన్ సీ మరియు డిజైన్ చేయబడిందిస్టైల్ ను కోరుకునే వారికోసం బఢ్స 2ను కూడ మార్కెట్ లో విడుదల చేసింది.

## శాంసంగ్ జెడ్ ఫోల్డ్ 6, జెడ్ ఫ్లిప్ 6 ముందస్తు బుకింగ్స్ ప్రారంభం



**విజయవాడ, జూలై 12, (ఆంధ్రపత్రిక) :** భారతదేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శాంసంగ్, గెలాక్సీ ఏఐ యొక్క తదుపరి అ ధ్యాయాన్ని ఆవిష్కరిస్తూ, తమ ఆరవ తరం ఫోల్డ బుల్ స్మార్ట్ ఫోన్లు.. గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6, జెడ్ ఫ్లిప్ ల కోసం ముందస్తు బుకింగ్ లను తెరిచింది. కొత్త గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6, జెడ్ ఫ్లిప్ గెలాక్సీ ఏఐని నూతన శిఖరాలకు తీసుకువెళ్లనున్నాయి. విని యోగదారులకు ప్రత్యేకమైన మొబైల్ అనుభవాల శ్రేణిని అందిస్తాయి. గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6, జెడ్ ఫ్లిప్ కోసం ముందస్తు బుకింగ్ ఈనెల 10 నుండి అన్ని ప్రముఖ ఆన్లైన్, ఆఫ్లైన్ రిటైల్ స్టోర్లలో ప్రారంభమైంది.

# దొంగలు బాబోయ్

# దొంగలు..!



### రోజు రోజుకి నగరంలో పెరిగిపోతున్న దొంగతనాలు..!
### నగరంలో పలు ప్రాంతాల్లో లైటింగ్ వ్యవస్థ వైఫల్యం..!
### పోలీస్ శాఖ నిఘా వైఫల్యం

**మచిలీపట్నం జూలై 12 (ఆంధ్రపత్రిక) :** నగరంలో రోజురోజుకీ దొంగతనాలు పెరిగిపోతున్నాయి. గతంలో రాత్రి వేళల్లో ముమ్మరమైన పోలీస్ బందోబస్తు నగరమంతా ఉండేది. ప్రస్తుతం పోలీసులు రాత్రి వేళల్లో అక్కడక్కడ మాత్రమే నామమాత్రంగా కనిపిస్తున్నారు. పోలీసుల నిఘా వైఫల్యం, పర్యవేక్షణ కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. గత ఐదు రోజుల్లో నగరంలో రెండోసారి చోరీ జరిగిందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా శివారు ప్రాంతాలు, మారుమూల ప్రాంతాలు, తాళం వేసిన ఇళ్లే టార్గెట్ గా దొంగలు రెచ్చిపోతున్నారు. దీనికి తోడు నగరంలో లైటింగ్ వ్యవస్థ కూడా అస్తవ్యస్తంగా ఉండడం వల్ల పలు ప్రాంతాల్లో రాత్రి వేళల్లో చీకటిమయంగా ఉంటుంది. గత శనివారం స్థానిక హౌసింగ్ బోర్డ్ లోని విశ్రాంత ఉద్యోగి హరిబాబు ఇంట్లో నాలుగు కేజీల వెండి వస్తువులు, కొంత నగదు చోరీ జరిగిన సంఘటన ప్రజలు మరువకముందే, గురువారం రాత్రి అదే కాలనీలో విశ్రాంత ఉపాధ్యాయుడు సాయినాథ్ మల్లికార్జున్ రావు ఇంటిని యదేచ్ఛగా దొంగలు తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులతో మల్లికార్జున రావు ఊరు వెళ్లిన రోజే ఈ సంఘటన జరగడం గమనార్హం. దొంగలు ముందుగానే రెక్కీ నిర్వహించుకుని తమ ప్రణాళికలను పక్కాగా పటిష్టంగా అమలుపరుస్తున్నారని, దీనిని బట్టి అర్థం అవుతోంది. అంతేగాక ఇంకొక మూడు ఇళ్లల్లో తలుపు గడియలు ధ్వంసం చేసి, చోరీకి పాల్పడే ప్రయత్నం చేసినట్టుగా తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో నగర ప్రజలు ఊరు దాటి వెళ్లాలంటే బెంబేలెత్తిపోతున్నారు. పోలీసుల గస్తీకి సుస్తీ చేసిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి సంఘటనలు జరగడం పట్ల ప్రజలు తమ భద్రతపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక నగరంలో వీధిలైట్లు కూడా సరిగా వెలగడం లేదు. ముఖ్యంగా గాంధీనగర్, బైపాస్ రోడ్ వద్ద హౌసింగ్ బోర్డ్ కాలనీ, నారాయణపురం, ఈడేపల్లి, ఆర్టీసీ కాలనీ, సుకర్లాబాద్ ఇలా పలు ప్రాంతాలలో నగరంలో లైటింగ్ వ్యవస్థ లేక నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరానికి గుండెకాయ లాంటి కలెక్టర్ ఆఫీసు చుట్టుపక్కల ప్రాంతాల్లోనే లైటింగ్ వ్యవస్థ దారుణంగా ఉంది అంటే, నగరంలో పరిస్థితి ఎలా ఉందో? అర్థం చేసుకోవచ్చు. జిల్లా అధికారులు కలెక్టరేట్ చుట్టుపక్కల ప్రాంతాలు రాత్రి వేళలో ఒకసారి పరిశీలిస్తే పరిస్థితి అర్థం అవుతుందని నగర ప్రజలు అనుకోవడం గమనార్హం. నగరపాలక సంస్థ అధికారులు కూడా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఏ ఏ ప్రాంతాల్లో లైట్లు వెలగడం లేదో తరచూ తనిఖీలు నిర్వహించడం లేదు. సరైన పర్యవేక్షణ చేయకపోవడం వల్ల నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లైట్లు వెలగని చోటఎందుకు వెలగడం లేదో కనీస పరిశీలన కూడా చేయడం లేదు. లైట్లు పాడైపోయి నెలలు గడుస్తున్నా ఆయా ప్రాంతాల్లో లైట్లు వెలగక పోవడం లో గల కారణాలు తెలుసుకోకపోవడం వల్ల కూడా దొంగలు సునాయాసంగా తమ పని పూర్తి చేసుకుందుకు అనుకూలంగా ఉంటోంది. వీధిలైట్లు ఎందుకు వెలగడం లేదు? అని కనీసం పరిశీలించకపోవడం కూడా నగరపాలక సంస్థ వైఫల్యం అని చెప్పవచ్చు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి, నగరంలో అస్తవ్యస్తంగా ఉన్న లైటింగ్ వ్యవస్థ పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే, దొంగల బెడదను కొంతమేర అరి కట్టవచ్చు. గత 5, రోజుల్లో రెండోసారి చోరీ సంఘటన జరగడం నగర ప్రజలను విస్మయానికి గురిచేసింది.



**శివారు ప్రాంతాలు, ఇంటికి తాళం వేసిన ఇల్లే అతగాడి టార్గెట్..**

గత శనివారం స్థానిక హౌసింగ్ బోర్డ్ లోని విశ్రాంత ఉద్యోగి హరిబాబు ఇంట్లో 4 కేజీల వెండి వస్తువులు, కొంత నగదు చోరీ జరిగిన సంఘటన మరవకముందే, గురువారం అర్ధరాత్రి అదే కాలనీలో విశ్రాంత ఉపాధ్యాయుడు సాయినాథ్ మల్లికార్జునరావు ఇంటిని యదేచ్ఛగా తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. సాయినాథ్ కుటుంబ సభ్యులతో ఊరు వెళ్లిన రోజే, ఈ పరిణామం చోటు చేసుకుంది. ఇంకొక మూడు ఇళ్లల్లో తలుపు గడియలు ధ్వంసం చేసి చోరీకి పాల్పడే ప్రయత్నం చేశారు. ఈ పరిస్థితులతో మచిలీపట్నం ప్రజలు, ఊరు దాటి వెళ్లాలంటే బెంబేలెత్తిపోతున్నారు. పోలీసుల గస్తీకి సుస్తి చేసిందని విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. ఇలాంటి సంఘటనలు జరగడం పట్ల ప్రజలు తమ భద్రతపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీస్ శాఖ పటిష్టమైన భద్రత చర్యలు తీసుకొని నగరంలో దొంగతనాలు జరగకుండా కట్టడి చేస్తుందని, నగరపాలక సంస్థ అధికారులు ప్రతి డివిజన్లోనూ వీధిలైట్లు వెలుగుతున్నాయో లేదో పరిశీలించి నగరం అంతా లైటింగ్ ఉండేలాగా చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం..!

# ఊర్మిళానగర్ పోలేరమ్మ తిరునాళ్లు ప్రారంభం



**విజయవాడ పశ్చిమ, జూలై 12, (ఆంధ్రపత్రిక) :** స్థానిక భవానిపురం ఊర్మిళా సుబ్బారావు నగర్ లోని గ్రామదేవత పోలేరమ్మ తిరునాళ్లు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఊర్మిళానగర్ గ్రామదేవత పోలేరమ్మ ఉత్సవాలను జూలై 12, 13, 14 తేదీల్లో నిర్వహించనున్నట్లు పోలేరమ్మ దేవస్థానం కమిటీ అధ్యక్షులు సూరసాని రామిరెడ్డి చెప్పారు. గత 37 సంవత్సరాలుగా పోలేరమ్మ తిరుణాళ్లను నిర్వహిస్తూ వస్తున్నట్లు చెప్పారు. ఈ పోలేరమ్మ తిరునాళ్లలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ కార్యదర్శి గుత్తావళి విజయబాబు, తుమ్మా తిరుపతిరెడ్డి, దొడ్డా వెంకటేశ్వర రెడ్డి, రాచమల్ల రమణమ్మ, గొందేసి సత్యనారాయణ రెడ్డి,గోపాదబాబు, ప్రధానార్చకులు గంటి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు కళ్ళే లలిత ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నసమారాధన



**విజయవాడ పశ్చిమ, జూలై 12, (ఆంధ్రపత్రిక) :** అజిత్ సింగ్ నగర్ స్వర్గీయ కళ్ళే లలిత వీధిలో పేదలకు అన్నసమారాధన కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో కళ్ళే లలిత ట్రస్ట్ డైరెక్టర్లు కళ్ళే సీతామహాలక్ష్మి పాల్గొని స్వర్గీయ కళ్ళే లలిత చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు కళ్ళే కుటుంబ సభ్యులు పాల్గొని పేదలకు అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వర్గీయ కళ్ళే లలిత భౌతికంగా దూరమైన నాటి నుండి ప్రతి నెలా 12వ తేదిన క్రమం తప్పకుండా పేదలకు సింగ్ నగర్ ప్రాంతంలోని కళ్ళే లలిత వీధి వద్ద అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. ఇప్పటికే వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి వాటర్ కూలింగ్ ఫ్రిజ్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. రానున్న రోజులలో కళ్ళే లలిత ట్రస్ట్ సేవలు విస్తరిస్తాని ట్రస్ట్ అధ్యక్షులు కళ్ళే కుటుంబ సభ్యులు అన్నారు. ఈ కార్యక్రమంలో ముప్పూరి హరీష్, ఎమ్.జశ్విన్,జి. ధ్రువన్ స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



**విజయవాడ పశ్చిమ, జూలై 12, (ఆంధ్రపత్రిక) :** ప్రజా సంక్షేమం, అభివృద్ధిగా పాలన చేస్తున్న సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రం అన్నిరంగాల్లో పురోభివృద్ధి సాధిస్తోందని టిఎన్‌టియుసి రాష్ట్ర నాయకులు లింగంపల్లి మోహనరావు కొనియాడారు. శుక్రవారం భవానీపురం జోజినగర్ చర్చి సెంటర్‌లో సీఎం చంద్రబాబు చిత్రపటానికి టిఎన్‌టియుసి రాష్ట్ర నాయకులు లింగంపల్లి మోహన్ రావు ఆధ్వర్యంలో పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రాగానే చంద్రబాబు చెప్పిన పింఛను 4వేల రూపాయలు ఇవ్వడం, నిరుద్యోగులందరికీ మెగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉపాధ్యాయ పోస్టులు ప్రకటించడం, అలాగే ఉచిత ఇసుక విధానం అమలుపర్చడం ద్వారా కార్మిక వర్గానికి, ప్రజలందరికీ పని మరియు జీవన ఉపాధి కల్పించడం జరిగిందని కొనియాడారు. దీనివల్ల అనేక రంగాలకు సంబంధించిన కార్మికుల ఉపాధి అవకాశాలు బాగా మెరుగుపడ్డాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు కె రాంబాబు, దేవత్ రమేష్ ,ఏడుకొండలు, భక్తుల వెంకటేశ్వర్లు ,పూజల శ్రీనివాస్, ఎల్ సీతారామయ్య ,ఎన్ వెంకటేశ్వరరావు, ఆటో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పాల్గొనడం జరిగింది.

# ఆర్ అండ్ బి రోడ్డును కబ్జా చేసిన ఘనుడు

### చోద్యం చూస్తున్న ప్రభుత్వాధికారులు..
### భారీ స్థాయిలో ముడుపులు చేతులు మారాయని పలువురి గుసగుసలు



**బంటుమిల్లి 12జూలై (ఆంధ్రపత్రిక) :** స్థానిక మండలంలోని అర్తమూరు గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న పాత ఆర్ అండ్ బి రోడ్డుని కబ్జా చేసిన సమీపంలో ఉన్న ఇంటి యజమాని. ఇతను అడ్డగోలుగా ఆర్ అండ్ బి రోడ్డును ఆక్రమించి మెరక చేసినప్పటికీని, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండటంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. వివరముల్లోకెళితే..216 జాతీయ రహదారి విస్తరణలో భాగంగా, నేషనల్ హైవే అధికారులు, ఈ స్థలాన్ని మెరక చేసిన సదరు రైతు వద్ద నుంచి స్థలాన్ని కొనుగోలు చేసి పరిహారం చెల్లించి రోడ్డు విస్తరణ పనులు చేయడం జరిగింది. ఈ క్రమంలో అర్తమూరు గ్రామంలోకి వెళ్లే పాత రోడ్డును మూసి వేయడం జరిగింది. అయితే ఈ రోడ్డు ఎడమవైపున ఉండడం వలన అధికారులు దానిని మూసివేసి కొత్తగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. పాత రోడ్డుకు అడ్డంగా గడ్డర్ లు నిర్మించారు. ఇదే అదనుగా రోడ్డు కోసం భూమిని ఇచ్చిన సమీప ఇంటి యజమాని తన ఇంటికి ఆనుకుని ఉండటంతో ఇతరులు ఎవరైనా ఆ భూమిని కబ్జా చేస్తారు అనే ఉద్దేశంతో ముందుగా పెద్ద ఎత్తున మట్టిని తోలి తన స్థలంలో కలుపుకున్నాడు. ఈ అక్రమ ఆక్రమణ పై ప్రభుత్వ శాఖల అధికారులు ఎవ్వరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఎక్కడైనా ప్రభుత్వ భూములు, డ్రైనేజ్ భూములు, చెరువు పోరంబోకులు ఆక్రమించుకోవడం చూశాం గానీ ఏకంగా నేషనల్ హైవే కి పక్కన ఆర్ అండ్ బి రోడ్డు ని ఆక్రమించుకున్న పట్టించుకోకపోవడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంలో ఆర్ అండ్ బి జె ఈ వివరణ కోరగా హైవే వాళ్ళకి అప్పగించిన రోడ్డుఅని దానికి సంబంధించి నేషనల్ హైవే వాళ్ళే చూసుకోవాలి అని ఆయన వివరణ ఇవ్వడం జరిగింది. ఈ వ్యవహారంలో ట్రాక్టర్ యజమానులైన ఆలోచించి ఉంటే బాగుండేది డబ్బులు వస్తే చాలు ఏదైనా మేరకు చేసేస్తాం అన్నట్లుగా ఉంది ట్రాక్టర్లు యజమానులు తీరు. గత ప్రభుత్వ హయాంలో నే మెరక చేయగా ఇప్పటివరకు ఆ మేరకని తొలగించకపోవడంపై, కొద్దిరోజుల కిందట వేరే పత్రికలలో వార్తా కథనాలు( ఆంధ్ర పత్రిక కాదు) ప్రచురించినప్పటికీని అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై పలువురు పెద్ద మొత్తంలో చేతులు మారాయి అని గుసగుసలాడుకోవడం విశేషం....

## నాడు నేడు పెండింగ్ పనులు పూర్తి చేయాలి



**ఎమ్మిగనూరు. జూలై 12 (ఆంధ్రపత్రిక) :** గత ప్రభుత్వం చేపట్టిన పాఠశాలలో నాడు నేడు పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి విజేంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం తాహశీల్దార్ కార్యాలయం నందు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో తాహశీల్దార్ శేషారెడ్డి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను రూపురేఖలు మెరుగు పరిచేందుకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు నేడు పనులు ప్రదానోపాధ్యాయుడు నిర్లక్ష్యం వల్ల పూర్తి స్థాయిలో చేయలేక పోయారు. ప్రదానోపాధ్యాయుని విచారించగా గత ప్రభుత్వం నిధులు పూర్తి స్థాయిలో రాక పోయినా సొంత ఖర్చులతో నిర్మాణ పనులు చేపట్టామన్నారు. కాబట్టి నాడు నేడు పనులను మధ్యలో ఆపాల్సి వచ్చిందని సమాధానం చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నియోజకవర్గ పెండింగ్ పనులకు సుమారుగా పదికోట్ల రుపాయలు నిధులు విడుదల పూర్తి స్థాయిలో పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి అబ్దుల్ ఖాదర్,ప్రతాప్, భాస్కర్,రవి వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాల వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### కృష్ణాజిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ



**కానూరు (బందరు మండలం )జులై 12 (ఆంధ్రపత్రిక) :** వర్షాకాల వ్యాధుల పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలని, వ్యాధి నివారణ చర్యలు తీసుకోవాలని కృష్ణాజిల్లా తెలుగు రైతు అధ్యక్షులు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపు సత్యనారాయణ అన్నారు. శుక్రవారం కానూరు గ్రామ సబ్ సెంటర్ లో కృష్ణ జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన అతిసారా వ్యాదులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమములో కానూరు గ్రామ ప్రజలను ఉద్దేశించి వర్షాకాలం నందు వ్యాపించే వ్యాదుల గురించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని త్రాగునీరుని కాచి చల్లార్చి తాగడం , మురికి నీటిని నిల్వ ఉంచకుండా చూసుకోవడం, వేడి ఆహార పదార్థాలు మాత్రమే తినడం వంటివి చేయాలని తెలిపారు. తదనంతరం కానూరు గ్రామంలో పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను ఉద్దేశించి వారు మరిన్ని ఉన్నత చదువులు చదువుకుని కానూరు గ్రామమునకు మంచిపేరు తీసుకురావాలని గోపు సత్యనారాయణ ప్రోత్సహించారు. ఈ కార్యక్రమములో తాళ్ళపాలెం పీహెచ్సీ డాక్టర్ జి.సాయి సుస్వర , డిప్యూటీ డి ఎం ఓ పి. స్వామిరెడ్డి , హెల్త్ ఎడ్యుకేటర్ పి. రాజేంద్రకుమార్ క్రాసా సంస్థ నుండి ఇజ్రాయెల్ , క్రై సంస్థ నుండి సుధ, గ్రామ ప్రజా నాయకులు చెక్కా ఏడుకొండలు, దివి మహేష్, బొమ్మిడి ఏడుకొండలు, కొక్కిలిగడ్డ ప్రభుదాస్, బొలిశెట్టి నాని, మోకా వెంకన్న, ఈ మన సత్యనారాయణ, సేరు భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడే శ్రీ శ్రీ జగన్నాథ రథయాత్ర




**ఆగిరిపల్లి జులై 12 (ఆంధ్రపత్రిక) :** ఆగిరిపల్లి మండలం నెక్కలం గొల్లగూడెం అడ్డరోడ్డు లో గల వేదాంత %ఢ% సైన్స్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం వారి రథయాత్ర ఈనెల 13 (శనివారం) న అంగరంగ వైభవంగా ఆగిరిపల్లి గ్రామం సమీపాన ఉన్న ఎన్ఆర్ఐ కళాశాల నుండి వెంకటేశ్వర స్వామి వారి దేవస్థాన ప్రాంగణం వరకు రథయాత్ర జరుగునని, మధ్యాహ్నం 2 గంటలకు జగన్నాథ, బలదేవ, సుభద్రలను రథం మీదకు వేంచేయుట, స్వామివారికి ధూప దీప నైవేద్యాలు సమర్పణ, భక్తులకు ప్రసాదం, స్వామీజీ మరియు ముఖ్య అతిధుల ప్రసంగం, బంగారు చీపిరితో జగన్నాథుని రథం ముందు శుభ్రం చేయుట అనంతరం రథయాత్ర మొదలవుతుందని , .ముగింపు కార్యక్రమంలో 5 రకాల హారతులు, 108 రకాల వంటకములతో మహా నైవేద్యం సమర్పణ జరుగుతుందని, సాంస్కృతిక కార్యక్రమాలు అనంతరం ప్రసాద వితరణ జరుగుతుందని ప్రధాన అర్చకులు పీతాంబరి కృష్ణ దాస్ తెలిపారు. ఈ రథయాత్రకు దేశంలో వివిధ రాష్ట్రాల నుండి వైష్ణవ భక్తులు వస్తారని, వేరువేరు దేశములకు చెందిన భక్తులతో హరినామ సంకీర్తన జరుగుతుందని, రథయాత్ర ప్రారంభ ముగింపు సమయములలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, రథయాత్రలో షుమారు 5000 మందికి ప్రసాద వితరణ జరుగుతుందని ఆలయ నిర్వహకుడు కృష్ణ మిశ్రదాస్ తెలిపారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

### పి హెచ్ సి ఆకస్మిక తనిఖీలో కాగిత కృష్ణ ప్రసాద్



**బంటుమిల్లి 12జూలై (ఆంధ్రపత్రిక) :** పెడన నియోజకవర్గం,కృత్తివెన్ను మండలం చినపాండ్రాక గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నియోజకవర్గ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కాగిత కృష్ణ ప్రసాద్ ఆస్పత్రిలోని కొన్ని వైద్య సేవా విభాగాలు ను పరిశీలించారు. డాక్టరు లేరని,మహిళా గర్భవతులు జిల్లా కేంద్రం కి వెళ్లి పరీక్షలు చేయించుకుని వస్తున్నారు. అలాగే రోగులకు ఇచ్చే మందు మాత్రలు సరిపడా రావడం లేదని,రెట్టింపు అవసరం ఉంది. సెలైన్ సీసాలు అందుబాటులో లేవు. వీటన్నింటి గురించి సంబంధించిన అధికారులు కు రిపోర్ట్ చేయాలనీ తెలిపారు. కాగిత కృష్ణ ప్రసాద్ వైద్య సిబ్బంది తో మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల చికిత్స కు అవసరమైన వైద్య సేవలు అందించేవిధంగా చర్యలు తీసుకోవాలని పెడన శాసనసభ్యులు ఆదేశించారు.

## ప్రతిభ గల కళాశాలకు హోదా

**ఆగిరిపల్లి, జులై 12 (ఆంధ్రపత్రిక) :** అగిరిపల్లి సమీపాన ఉన్న ఎన్అర్ఐ కళాశాల అఫ్ ఫార్మసీ కి యుజిసి (యు జి సి -యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ న్యూ ఢిల్లీ వారు ఆటానమస్ హోదా కల్పించినట్లు కళాశాల చైర్మన్ డి ఆర్.వెంకటరావు తెలియజేశారు. ఈ ఆటానమస్ హోదా 2024-2025 విద్య సంవత్సరం నుండి 2034-2035 పది సంవత్సరాలు పాటు ఆక్టివ్‌గా ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ డి ఆర్. వై.ఏ.చౌదరి తెలియచేశారు. ఈ అభినందన సభలో అధ్యాపకులు మరియు కళాశాల సిబ్బంది పాల్గొని అభినందనలు తెలియజేశారు.

## చిన్ననాటి నుండే విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయం పట్ల అవగాహన కలిగించాలి

### కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ




**మచిలీపట్నం, జూలై 12 (ఆంధ్రపత్రిక) :** బాల్యం నుండి విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయం పట్ల అవగాహన కల్పించేందుకు పాఠశాలల్లో కిచెన్ గార్డెన్స్ అమలుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. జిల్లాలో పాఠశాలల్లో కిచెన్ గార్డెన్స్ విధానం అమలు గురించి శుక్రవారం ఉయ్యూరు విశ్వశాంతి విద్యాలయంలో నిర్వహించిన కార్యశాలలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ స్థానిక క్యాంపు కార్యాలయం నుండి వర్చువల్ గా పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో 100 పాఠశాలల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఉన్నట్లు, ఈ కార్యక్రమం పై అవగాహన కల్పించేందుకు గురువారం మచిలీపట్నంలో, ఈరోజు ఉయ్యూరులో కార్యశాలలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యవసాయ ఆధారిత కృష్ణ జిల్లాలో రైతులు తాము పండిస్తున్న పంటలకు సరైన ఆదాయం పొందలేక, రసాయనిక ఎరువులు వాడకం అధికమై భూసారం తగ్గడం వలన దిగుబడులు సరిగా పొందలేక రైతులు నష్టపోతున్నారని, తద్వారా నాణ్యమైన ఆరోగ్యకరమైన ఆహారం లభించక వ్యాధుల బారిన పడాల్సిన పరిస్థితులలో రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టడం ద్వారా రసాయన ఎరువుల వాడకం తగ్గించి జీవ ఎరువులు వాడకం వలన భూసారం పెరిగి అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఈ విధానాలపై విద్యార్థులకు చిన్నతనం నుంచి అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారుప్రస్తుత పరిస్థితుల్లో ప్రకృతి వ్యవసాయం వైపు ప్రతి ఒక్కరూ దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ ఉద్దేశంతోనే ప్రకృతి వ్యవసాయంపై చిన్నతనం నుండి పిల్లలకు తెలియజేయాలనే సత్సంకల్పంతో పాఠశాల స్థాయి నుండి పెరటి తోటల పెంపక కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. పిల్లలకు తెలియజేయడం ద్వారా వారు స్వగ్రామాలకు వెళ్లినప్పుడు వారి ద్వారా గ్రామాల్లో నెమ్మదిగా మార్పు రావడం జరుగుతుందన్నారు. తొలి దశలో రైతు సాధికార సంస్థల పరిధిలో ఉన్న పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. చిన్నతనం నుండి పిల్లలకు విత్తన శుద్ధి, ఘన, ద్రవ, బీజామృతాలు అంటే ఏమిటి వాటి వలన మొక్కలు ఎంత బాగా పెరుగుతాయనే విషయం పైన వారికి అవగాహన కలిగించాలన్నారు. ఖాళీ పీరియడ్లలో విద్యార్థులకు ఈ కార్యక్రమం పైన సంపూర్ణ అవగాహన కలిగించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని భారంగా భావించక, ఇదొక మంచి అవకాశంగా, బాధ్యతగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. జిల్లాలో మోపిదేవి జడ్పీ పాఠశాలలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పెరటి తోటల పెంపకం చేపట్టి సక్సెస్ అయ్యారని, ప్రధానోపాధ్యాయురాలు తమ అనుభవాలు కార్యశాలలో వివరించాలని సూచించారు. వ్యవసాయ శాఖ ఏడి పార్థసారథి ప్రకృతి వ్యవసాయంపై జరిగిన కార్యశాలలో అవగాహన కల్పించారు.

# ఎమ్మెల్యే జీవీ చొరవతో గుండ్లకమ్మ నుండి త్రాగునీరు

## శుద్ధమైన త్రాగునీరు అందిస్తాం...సింగర చెరువుని సందర్శించిన కలెక్టర్, ఎమ్మెల్యే



**వినుకొండ , జూలై 12 (ఆంధ్రప్రత్రిక):** గుండ్లకమ్మ నది నుండి వినుకొండ పట్టణానికి త్రాగునీరు సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. తొలి ఏకాదశి పండుగ నిర్వహణపై సమీక్షలో భాగంగా శుక్రవారం వినకొండకు వచ్చిన కలెక్టర్ పట్టణానికి త్రాగునీరు అందించే సింగర చెరువు అడుగంటడంతో చెరువుని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెరువులో నీరు అడుగంటడంతో కేవలం మరో 15 రోజులు మాత్రమే నీరు వస్తాయని, ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సూచనల మేరకు గుండ్లకమ్మ నది నుండి త్రాగునీటిని సరఫరా చేసి యధావిధిగా పట్టణానికి నీటి సరఫరా చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ పట్టణానికి త్రాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నాగార్జునసాగర్ డ్యాంలో నీరు డెడ్ స్టోరేజ్ లో ఉండటం వలన నేటి విడుదల ఆలస్యం అయ్యే అవకాశం ఉందన్నారు. ఎగువ కురిసిన వర్షాలకు ఆల్మట్టి డ్యాం నుండి శ్రీశైలం డ్యామ్, నాగార్జునసాగర్ డ్యామ్ లకు నీటి విడుదల కొంత ఆలస్యం అయ్యేటట్టు ఉందని, వినకొండకు దగ్గరగా చీకటిగల పాలెం అండర్ రోడ్డు వద్ద గుండ్లకమ్మ నది నుండి తాగునీటినీ వినుకొండ పట్టణానికి సరఫరా చేసేందుకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. గుండ్లకమ్మ నది నుండి ట్యాంకర్ల ద్వారా నీటిని పట్టణంలోని సింగర చెరువు ఫిల్టర్ బెడ్ల వద్ద డంపింగ్ చేసి నీటిని శుద్ధపరచి స్వచ్ఛమైన త్రాగునీటిని పట్టణ ప్రజలకు సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

పట్టణ ప్రజలు త్రాగునీటి విషయంలో ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని, సకాలంలో త్రాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వినుకొండ పట్టణము తో పాటు పల్నాడు జిల్లాలో నెలకొన్న త్రాగునీటి సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నిమ్మల రామానాయుడుల దృష్టికి తీసుకువెళ్లేమని, కృష్ణా రివర్ బోర్డు తో చర్చించి త్వరలో నాగార్జునసాగర్ కుడి కాలువకు త్రాగునీరు విడుదల చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి, 32 వ వార్డు కౌన్సిలర్ వాసిరెడ్డి లింగమూర్తి, మునిసిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి, డిఈ వెంకయ్య, టిడిపి నాయకులు పీవీ. సురేష్ బాబు, షమీంఖాన్, పువ్వాడ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ అంతరాయాలపై సమీక్ష



**వేటపాలెం, జూలై 12 (ఆంధ్రప్రత్రిక):** చీరాల డివిజన్ పరిధిలోని విద్యుత్ సిబ్బ ందితో శుక్రవారం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె జాన్ థామస్ విద్యుత్ అంతరా యాలపై సమీక్ష సమావేశం నిర్వహించినారు. వేటపాలెం మండలంలోని కొత్తపే ట పంచాయితీ ఎస్ ఆర్ జి కళ్యాణమండపం నందు జరిగిన ఈ సమీక్షలో 33 కెవి లైన్లు, 11కె లైన్లు, విద్యుత్ నియంత్రికలు మొదలగు వానిపై క్రమం తప్పకు ండా మెయింటెనెన్స్ చేసుకుంటూ విద్యుత్ అంతరాయములు తగ్గించవలసినదిగా సిబ్బందిని కోరారు. అంతరాయము అనివార్యమైనచో ముందుగా సంబంధిత వినియోగదారులకు తెలియజేయాలని తెలిపారు. ఏమైనా సాంకేతిక కారణముల వలన విద్యుత్ అంతరాయం ఏర్పడినచో వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బంది స్పందించి అతి తక్కువ సమయంలో పునరుద్ధరించవలసిందిగా ఆదేశించడం జరిగింది. విద్యుత్ సిబ్బంది అందరూ ప్రతి వినియోగదారునితో మంచి సంబం ధములు కొనసాగించి వారికి మెరుగైన సేవ చేయవలసిందిగా తెలపడం జరిగిం ది. విద్యుత్ అంతరాయాలను అధిగమించి నిరంతర విద్యుత్ సరఫరాకు సమగ్ర చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సమీక్షలో చీరాల డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి శ్రీనివాసరావు, వేటపాలెం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె శ్రీనివాసులు, పర్చూరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్ రమేష్ బాబు, డివిజన్ పరిధిలోని అన్ని మండలముల విద్యుత్ ఏఈ లు, లైన్మెన్లు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

# 14న ఉచిత కంటి మెగా వైద్య పరీక్షా శిబిరం



**వినుకొండ , జూలై 12 (ఆంధ్రప్రత్రిక):** జీ.వీ.ఆంజనేయులు స్థాపించిన శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్లి ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి పెదకాకాని మరియు జిల్లా అందత్వ నివారణ సంస్థ వారిలి సహకారంతో ఈనెల 14వ తారీఖున వినుకొండ పట్టణంలో నిర్వహించబోయే ఉచిత కంటి మెగా వైద్య పరీక్షా శిబిరంలో భాగంగా. ఈరోజు శుక్రవారం ఉదయం మరియు సాయంత్రం నాడు బొల్లాపల్లి మండలం గరికపాడు పమిడిపాడు మేళ్ల వాగు, జయంతి రాంపురం, రెడ్డి పాలెం, బొమ్మనంపాడు రేమిడిచర్ల, గ్రామాల్లో 735 మందికి కంటి పరీక్షల నిర్వహించి వారిలో 256 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించడం జరిగింది.వారందరినీ ఈనెల 14వ తారీకు ఆదివారం వినుకొండ పట్నంలోని లిప్రభుత్వ జూనియర్ కళాశాలలోలి షుగరు బిపి పరీక్షలు నిర్వహించి విడతల వారీగా శంకర్ కంటి ఆసుపత్రి పెద కాకాని పంపి ఆపరేషన్ చేయించడం జరుగుతుంది అని ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ జీ.వి రమణారావు తెలిపారు.ఈ కార్యక్రమంలో శంకర్ హాస్పటల్ సిబ్బంది నాగబాబు మరియు రాజు,రాంబాబు స్కైలాబ్,గ్రామాల్లోని తెలుగుదేశం పార్టీ నాయకులు జనసేన నాయకులు బిజెపి పాల్గొన్నారు.

# తల్లికి వందనంతో విదార్థుల డ్రాపౌట్స్ నివారణ

## తూర్పు ఎమెల్యే నసీర్ అహ్మద్



**గుంటూరు : జులై 12( ఆంధ్రపత్రిక ):** ఎన్డీయే ప్రభుత్వం తల్లికి వందనం పేరుతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న తల్లికి వందనం కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల డ్రాపౌట్స్ నివారణ సాధ్యమౌతోందని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమెల్యే నసిర్ అహ్మద్ అన్నారు. శుక్రవారం శ్రీ గురు కృష్ణ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక సంగదిగుంట మంత్రి బజార్ లోని ప్రభుత్వ ఉర్దూ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు ఉచితంగా పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ఎమెల్యే నసిర్ ముఖ్య అతిధిగా హాజరై విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువుకు స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహాయ సహకారాలు వెలకట్టలేనివన్నారు. గురుక్రిష్ణ ఛారిటబుల్ ట్రస్ట్ గత 14 ఏళ్లుగా నగరంలోని వివిధ ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు ప్రతి ఏటా ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేయడం ఆదర్శనీయమన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనేత నారా లోకేష్ విద్యా శాఖమంత్రి గా బాధ్యతలు తీసుకున్న తర్వాత విద్యా వ్యవస్థ కు మహర్దశ పట్టిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ఆయన బాటలు వేస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వం పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా యూనిఫారాలు, పుస్తకాలు, బెల్ట్, బూట్లు తదితర అవసరమైన వస్తువులు అందజేస్తుందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు గత ప్రభుత్వంలో నిలిచిపోయిన విదేశీ విద్యా విధానాన్ని కొనసాగించేందుకు చర్యలు తీసుకోవడం శుభపరిణామనన్నారు. జనసేన పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు మాటాడుతూ గత వైసీపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిందని మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలలో ఉన్నత ప్రమాణాలు పెరిగే విధంగా కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని ఎమెల్యే ని కోరారు. అనంతరం ట్రస్ట్ నిర్వాహకులు కొత్తకోటి ప్రసాద్ సేవలను వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు అడపా మాణిక్యాలరావు, ప్రచార కమిటీ అధ్యక్షులు శిఖా బాలు, 13వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు బుజ్జి, టీ డీ పి మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కరీముల్లా, స్థానిక టీడీపీ నేతలు లక్ష్మణ్ రావు, మీరా, పవన్ కుమార్, కంచర్ల వెంకటేష్, జనసేనపార్టీ నేతలు పసుపులేటి నరేష్,యడ్ల రాధిక, శివ పాల్గొన్నారు.

# విజ్ఞాన్స్‌లో "డార్లింగ్" సినిమా యూనిట్ సందడి



**గుంటూరు , జులై 12( ఆంధ్రపత్రిక ):** చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో శుక్రవారం సినీహీరో ప్రియదర్శి తన 'డార్లింగ్" సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా సందడి చేశారు. కార్యక్రమంలో హీరో ప్రియదర్శి, హీరోయిన్ నభా నటేష్, దర్శకుడు అశ్విన్ రామ్, ఇతర సినిమా సిబ్బంది పాల్గొన్నారు. ఈ చిత్రాన్ని ప్రైమ్ షో ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్స్‌పై కె.నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డిలు నిర్మించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సినీ హీరో ప్రియదర్శి మాట్లాడుతూ విద్యార్థులే నా బలగమని పేర్కొన్నారు. ఈ నెల 19న సినిమా ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుందన్నారు. విద్యార్థులందరూ డార్లింగ్ సినిమాను ఆదరించి అఖండ విజయాన్ని అందించాలని కోరారు. ఈ చిత్రాన్ని స్ప్లిట్ పర్సనాలిటీ అనే డిజార్డర్‌ను ఆధారంగా చేసుకుని రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెర కెక్కించామన్నారు. ఈ సినిమాలో రొమాంటిక్ కామెడీ, యాక్షన్ ఎపిసోడ్స్, ఎమోషన్స్, డ్రామా ప్రేక్షకులందరికీ నచ్చుతాయన్నారు.

ఈ సినిమాకి అశ్విన్ రామ్ దర్శకత్వం వహించగా, మ్యూజిక్ డైరెక్టర్‌గా వివేక్ సాగర్, డీవోపీ నరేష్ రామదురై, ఎడిటర్‌గా ప్రదీప్ ఈ రాఘవ్ పనిచేశారని తెలిపారు. సినిమా హీరోయిన్ నభా నటేష్ మాట్లాడుతూ ఈ సినిమా తన మనసుకు బాగా దగ్గరైన సినిమానని తెలియజేసారు. ఈ సినిమాలో తన పాత్ర ఇప్పటివరకు చేసిన పాత్రల కంటే వైవిధ్య భరితమైనదని వెల్లడించారు. అనంతరం డార్లింగ్ సినిమా యూనిట్ బృందాన్ని విజ్ఞాన్స్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవ రాయలు అభినందించి చిత్రం అఖండ విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మాజీ శాసన సభ్యులు తాడిశెట్టి వెంకట్రావు జన్మదినం అందరికీ పర్వదినం

## వేడుకల్లో పాల్గొన్న తాడిశెట్టి మురళి,ఎంఎల్ఏ రామాంజనేయులు



**గుంటూరు, జూలై 12 ( ఆంధ్రపత్రిక ):** గుంటూరు 2 మాజీ శాసన సభ్యులు తాడిశెట్టి వెంకట్రావు జన్మదిన వేడుకలు గుంటూరు జిల్లా లో ఘనంగా జరిగాయి. కార్యకర్తల కోలాహలం, అభిమానుల ఆనందోత్సాహాల నడుమ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పలు రూపాల్లో సేవా కార్యక్రమాలతో పాటు అన్న దానం, పండ్లు పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టారు. శుక్రవారం పట్టాభి పురం లోని తాడిశెట్టి మురళి మోహన్ ఇంటి వద్ద అభిమానులు ఏర్పాటు చేసిన వేడుకలకు ప్రత్తిపాడు నియోజక వర్గ శాసన సభ్యులు బి రామాంజనేయులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి తాడిశెట్టి మురళి మోహన్ తో కలిసి ఎంఎల్ఏ రామాంజనేయులు జన్మదిన కేక్ ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం పట్టాభి పురం లోని వృద్ధుల ఆశ్రమం లో ఏర్పాటు చేసిన అన్న దానం కార్యక్రమం, గోరంట్ల,రెడ్డి పాలెం లోని అనాధ ఆశ్రమాల్లో పండ్లు పంపిణీ,కేక కటింగా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ రామాంజనేయులు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి తాడిశెట్టి మురళి మోహన్ మాట్లాడుతూ జనమే జయం - తాడిశెట్టి సోదరులే నిజమని చెప్పడంలో ఏటువంటి సందేహం లేదన్నారు. పదవులు ఉన్నా,లేకున్నా కార్యకర్తలకు మేమున్నాం అనే భరోసా ఎప్పుడూ ఉంటుందన్నారు. విద్యార్థి, యువజన, కార్మిక, కర్షక పక్షపాతి అయినా తాడిశెట్టి సోదరులు భవిష్యత్ లో మరెన్నో ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు.

కార్యక్రమాల్లో టీడీపీ కూటమి నేతలు అడపా కాశీ విశ్వనాథం, చింతా సుబ్బారావు, ఖజావలి, సీతా మహాలక్ష్మి, సంబరాసు వాసు, బుజ్జి, అన్నం రాజు సాయిరాం, ముడావత్ శ్రీను నాయక్, శ్రీను, పరసా కోటేశ్వరరావు, పప్పుల రవి, తదితరులు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనదారుల హెల్మెట్ వాడకంపై న్యాయ విజ్ఞాన సదస్సు



**చీరాల, జులై 12 (ఆంధ్రప్రత్రిక):** ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడటం వల్ల, తమ ప్రాణాలనే కాకుండా తమపై ఆధారపడిన కుటుంబ సభ్యులను అనాధలుగా మార్చకుండా జాగ్రత్త వహించాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జ్ శ్రీమతి ఎం.సుధా అన్నారు. శుక్రవారం ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు చీరాల మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు భవన సముదాయంలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ముఖ్య అతిథిగా ఆమె పాల్గొని మాట్లాడారు. బైక్ రేసులు, ట్రిపుల్ రైడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ లు, మైనర్లు డ్రైవింగ్ చేయటం, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయటం వంటి వాటికి దూరంగా ఉండాలని ఉద్ఘాటించారు. ఎవరైనా అతిక్రమిస్తే మోటార్ వెహికల్ చట్టం ప్రకారం జరిమానాలు విధిస్తారని హెచ్చరించారు. అనంతరం విశిష్ట అతిథిగా హాజరైన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి ఎస్.కె రెహానా మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం ద్వారా ఎవరి ప్రాణాల్ని వాళ్ళు కాపాడుకోవచ్చునని తెలిపారు.ఈ కార్యక్రమంలో గౌరవనీయ సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి.రమేష్ బాబు, సోషల్ వర్కర్ పి యల్ వి యస్.డి.మతీన్, న్యాయవాదులు, కక్షిదారులు ,కోర్టు సిబ్బంది ప్రజలు తదితరులు పాల్గొన్నారు .

# భవిష్యత్ ప్రకృతి వ్యవసాయనిదే

## బూర్ల రామాంజనేయులు, ప్రత్తిపాడు శాసన సభ్యులు



**గుంటూరు , జులై 12(ఆంధ్రప్రత్రిక):** గతంలో ఉన్న పరిస్థితుల ను బట్టి అప్పట్లో పెరుగుతున్న ప్రజల ఆహార అవసరాలను తీర్చాల్సిన పరిస్థితులు తప్పనిసరి అయినవి కాబట్టి పంట దిగుబడులు పెరగడానికి హరిత విప్లం పేరుతో వ్యవసాయంలో సంకరజాతి విత్తనాలు మరియు రసాయనాలు ప్రవేశపెట్టడం జరిగింది కాబట్టి ప్రజల ఆహార అవసరాలు తీర్చగలిగాము. కాని ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో ఎలాంటి రసాయనాలు లేకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించగలిగితే మన ఆహార అవసరాలు తీర్చుకోవడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయి, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించే పంటల దిగుబడులలో పోషకాలు సక్రమంగా ఉంటాయి కాబట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో ప్రముఖ పాత్రను పోషిస్తాయి. కాబట్టి ఆరోగ్యంపై అవగాహన పెరుగుతున్న నేటి పరిస్థితుల్లో ప్రకృతి వ్యవసాయానిదే భవిష్యత్ అని ఈ రోజు రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్షక్ సేవా సేంద్రం నిర్వహణలో "సిరిధాన్యాలతో జీవన సిరి" అనే అంశంపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న ప్రత్తిపాడు శాసనసభ్యులు బూర్ల రాంజనేయులు అన్నారు. ఈ కార్యక్రమంలో డా సరళ ఖాదర్, మన్నవ పూర్ణయ్య, కొపాటి నాగేశ్వరరావు, పత్తి భవన్నారాయణ, నాగిశెట్టి నాగరాజు, గింజుపల్లి వేంకటేశ్వరరావు, రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

### వైద్య ఖర్చులు తగ్గాలంటే సిరిధాన్యాల ఆహారమే సరైన దారి

గతంలో మన పూర్వీకులు చిరుధాన్యాలయినటువంటి కొర్రలు, అండుకొర్రలు, ఆరికలు, ఊదలు, సామలు, సజ్జలు, జొన్నలు, రాగులు లాంటి చిరుధాన్యాలను తింటూ ఆరోగ్యంగా జీవితాలను గడిపేవారు. కాని రాను రాను వివిధ రకాల కారణాల వలన చిరుధాన్యాలను పక్కకు నెట్టి వరి బియ్యం మరియు గోధుమలను ప్రధాన ఆహారంగా చేసుకున్నాము. దాని ఫలితంగా మనలో చాలా మంది వివిధ రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మన సంపాదన మొత్తాన్ని వైద్యానికి ఖర్చు పెట్టవలసి వస్తుంది. ఈ పరిస్థితులు ఇదే విధంగా కొనసాగితే అనేక అనర్థాలు జరగడానికి అవకాశాలు మెండుగా ఉంటాయి కాబట్టి ఇప్పటికైనా చిరుధాన్యాలను ప్రత్యేకంగా కొర్రలు, అండుకొర్రలు, ఆరికలు, ఊదలు, సామలు లాంటి సిరిధాన్యాలను ఆహారంగా తీసుకోగలిగితే ఆరోగ్యకరమైన భవిష్యత్ సాధ్యమవుతుందని డా సరళ ఖాదర్ అన్నారు.

# వైసీపీ అవశేషాలు రాష్టానికి ప్రమాదకరమే వైసీపీ నేతల విషప్రచారాన్ని ప్రజలే తిప్పికొడుతున్నారు

## ప్రజలు ఓటుతో శిక్షించినా వైసీపీ నేతలకు ఇంకా సిగ్గురాలేదు- తల్లికి వందనం పథకం పై అంబటి వ్యాఖ్యలను ఖండించిన జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి.



**గుంటూరు , జులై 12( ఆంధ్రపత్రిక ):** వైసీపీ అరాచకాలను, దుర్మార్గాలను ఇక భరించలేం అంటూ ప్రజలు తమ ఓటుతో శిక్షించినా వైసీపీ నేతలకు ఇంకా సిగ్గురాలేదని జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి విమర్శించారు. రాజకీయాల్లో వైసీపీ లాంటి పార్టీ ఉండకూడదని ఆ పార్టీ అవశేషాలు కూడా రాష్ట్రానికి ప్రమాదకరమన్నారు. తల్లికి వందనం పథకంపై మాజీమంత్రి అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలను ఆయన మీడియాతో మాట్లాడుతూ తీవ్రంగా ఖండించారు. తల్లికి వందనం పథకంపై అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు రాకముందే అంబటి రాంబాబు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం అతని దుష్ట మనస్తత్వానికి నిదర్శనమని దుయ్యబట్టారు. అంబటి రాంబాబు లాంటి బాధ్యతారాహిత్య నాయకుడు దొరకడం రాష్ట్ర ప్రజలు చేసుకున్న దురదృష్టమన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన జలవనరుల శాఖను సమర్ధవంతంగా నిర్వహించకుండా దానిని జల్సా శాఖగా మార్చిన నీచుడు అంబటి అంటూ ధ్వజమెత్తారు. ఒక బీసీ సోదరుడు ప్రమాదవశాత్తు మరణిస్తే సీఎం సహాయనిధి కింద వచ్చిన డబ్బులో సగం వాటా అడిగిన దుర్మార్గుడు , శవాలపై పేలాలేరుకునే అంబటికి కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక అర్హత లేదంటూ మండిపడ్డారు. ఖజానా ఖాళీ చేసి ఇచ్చినా ఐదేళ్లుగా వైసీపీ నేతలు చేయని విధంగా ఇచ్చిన మాటప్రకారం మొదటి తారీకే పింఛన్లు, ఉద్యోగస్తులకు జీతాలు ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదన్నారు. ప్రజలు వైసీపీని పూర్తిగా మరచిపోయారని ఈ నేపథ్యంలో మేమూ రాజకీయంగా బ్రతికే ఉన్నామని చెప్పుకునేందుకే ఇలాంటి చౌకబారు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ నేతలు ఐదేళ్లుగా చేసిన ధ్వంసం చేసిన వ్యవస్థల్ని తిరిగి చక్కదిద్దటానికి , వారు చేసిన పాపాలను ప్రక్షాళన చేయటానికి కూటమి నేతలకు తలప్రాణం తోకకొస్తుందని వ్యాఖ్యానించారు. అధికారాన్ని చేపట్టిన క్షణం నుంచి చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ లు రాష్ట్ర సమగ్రాభివృద్ధికై ప్రతీనిత్యం శ్రమిస్తున్నారని వారి నేతృత్వంలో కొద్దిరోజుల్లోనే రాష్ట్రంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని కొనియాడారు. కూటమి ప్రభుత్వ పారదర్శక పాలనకు ప్రజల నుంచి పూర్తి స్థాయిలో మద్దతు లభిస్తుండటం ఎంతో ముదావహం అన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం కోసం జరుగుతున్న పాలనా యజ్ఞంలో ప్రజలు సైతం భాగస్వామ్యులు అవుతుండటం శుభపరిణామని ఆళ్ళ హరి అన్నారు.

# ఆర్.వి.ఆర్ అండ్ జె.సి. కళాశాలలో కమోడిటీ డెరివేటివ్స్ పై సెమినార్





**గుంటూరు , జులై 12(ఆంధ్రపత్రిక):** దేశ ఆర్థిక పురోగతి సాధనలో ఆలోచనాత్మక కమోడిటీస్ ట్రేడింగ్ ప్రధాన భూమిక పోషిస్తుందని మల్టీ కమోడిటీ ఎక్స్చేంజి అఫ్ ఇండియా లిమిటెడ్ సీనియర్ మేనేజర్ ,స్టేట్ హెడ్ శ్రీ ఎమ్. సాంబశివరావు పేర్కొన్నారు. స్థానిక చౌడవరంలోని ఆర్.వి.ఆర్ జె.సి. ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం నాడు సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజి బోర్డు అఫ్ ఇండియా సహకారంతో కళాశాల ఈ డి సెల్ మరియు ఆర్ జె ఈ-నెస్ట్ ఐ.టి.బి.ఐ. సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన "కమోడిటీ డెరివేటివ్స్" అనే సదస్సుకు ఆయన ముఖ్య అతిధిగా వచ్చి, దేశ ఆర్థిక స్థితిగతి పై కమోడిటీస్ ట్రేడింగ్ యొక్క ప్రభావాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వస్తువుల వర్తక వ్యాపారంలో జరిగే ధరల హెచ్చుతగ్గులు ప్రపంచలోని వివిధ దేశాలలో సంభవించే యుద్ధ వాతావరణం, ఎలక్షన్స్, వాతావరణ అనుకూలత, ప్రతికూలత వంటి వివిధ అంశాల ప్రభావాల పై ఆధారపడి వుంటాయని, దానికి అనుగుణంగా పూర్తి పరిజ్ఞానంతో వస్తువుల ట్రేడింగ్ లో అవగాహన పొందాలని ఆయన సూచిస్తూ, స్టాక్, ట్రేడింగ్ , షేర్ మార్కెట్లలో సంభవించే వివిధ అంశాలను వాటి పై చూపే ప్రభావాలను ఆయన వివరించారు. భారత దేశాన్ని సుసంపన్నమైన దేశ నిర్మాణం దిశగా విద్యార్థులు వర్తక వ్యాపార విజయంలో సులభతర ఆలోచనలు చేయాలని ఆర్.వి.ఆర్ జె.సి. ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షులు డా.రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. భారతదేశంలోని అత్యంత ప్రజాదరణ పొందిన కమోడిటీ ఎక్స్చేంజీలలో ప్రధాన సంస్థలలో ఒకటైన మల్టీ కమోడిటీ ఎక్స్చేంజి అధికారులు మరియు నిపుణుల బృందం తమ కళాశాల విద్యార్థులకు ఈ సదస్సు ద్వారా సందేశాన్ని అందించడం ఆనందదాయకని ఈ సందర్భంగా కళాశాల సెక్రటరి కరెస్పాండెంట్ రాయపాటి గోపాల కృష్ణ, కళాశాల ట్రెజరర్ డా.కొండబోలు కృష్ణ ప్రసాద్ వారిని అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.కొల్లా శ్రీనివాస్ అతిధిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ అండ్ ఆర్ అండ్ డి డైరెక్టర్ డా: కె.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డా.ఎన్.వి. శ్రీనివాస రావు, కళాశాల ఈ డి సెల్ కన్వీనర్ డా: సజ్జా రాధికా, కళాశాల ఇంక్యూబేషన్ సెంటర్ సి ఈ ఓ డా: మహేంద్ర వర్మా తదితరులు పాల్గొన్నారు.

# వై.ఎం.సి.ఏ ఆధ్వర్యంలో యువతి యువకులకు క్రీడా పోటీలు



**గుంటూరు , జులై 12( ఆంధ్రపత్రిక ):** అమరావతి సబ్ రీజియన్ అఫ్ యంగ్ మెన్స్ క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమరావతి సబ్ రీజియన్ అఫ్ యంగ్ మేన్స్ క్రిస్టియన్ అసోసియేషన్ అడ్ హాక్ కమిటీ సభ్యులు మోపర్తి సునీల్ కుమార్, చైర్మన్, వాసిమల్ల విజయ్ కుమార్, కోశాధికారి సంయుక్తముగా 180 వ యంగ్ మేన్స్ క్రిస్టియన్ అసోసియేషన్ వార్షికోత్సవములు జరుపుటకు, వై.ఎం.సి.ఏ అన్ని వర్గ సభ్యులను ప్రోత్సహించులాగున, యువతి యువకులకు క్రీడల పోటీలు, నిర్వహించి యువకులను శారీరకంగా మానసికంగా ఆత్మీయంగా బలపరిచి వారిలో విశ్వాసాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువజనులను ముందుకు నడిపించుటలో అన్ని కాలేజీ స్టూడెంట్స్ తో కలసి వివిధ కార్యక్రమములు పలువురితో చర్చలు జరిపి తుది నిర్ణయమును త్వరలో ప్రకటించునున్నామని తెలిపారు.

## మాజీ సీఎం జగన్‌పై కేసు నమోదు

(మొదటిపేజీ తరువాయి)

హయాంలో రాజద్రోహం చట్టం కింద తనను అరెస్టు చేసి వేధించారని రఘురామ పేర్కొన్నారు. మాజీ సీఎం జగన్‌తో పాటు అప్పటి సీఐడీ డీజీ పీవీ సునీల్‌కుమార్, మరికొందరు అధికారులపై ఫిర్యాదు చేశారు. కస్టడీకి తీసుకున్న సమయంలో తనపై దాడి చేశారని ఆరోపించారు. దాంతోపాటు హత్యాయత్నం చేశారని ఫిర్యాదులో తెలిపారు. తప్పుడు నివేదికలు ఇచ్చారన్నారు. ఈ నేపథ్యంలో సునీల్‌కుమార్ (ఏ1), ఇంటెలిజెన్స్ మాజీ డీజీ పీఎస్ఆర్ ఆంజనేయులు (ఏ2), జగన్ (ఏ3),అప్పటి సీఐడీ ఏఎస్పీ విజయ్‌పాల్ (ఏ4), గుంటూరు జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి (ఏ5)పై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. హత్యాయత్నం, తప్పుడు నివేదికలు, భయభ్రాంతులకు గురిచేయడం తదితర అంశాలకు సంబంధించిన పలు సెక్షన్లు పెట్టారు. వీటిలో బెయిల్‌బుల్, నాన్‌బెయిల్‌బుల్ సెక్షన్లు కూడా ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వంలో సునీల్ సీఐడీ డీజీగా పని చేశారు. అప్పుడు ఎంపీగా ఉన్న రఘురామ కృష్ణంరాజును కస్టడీకి తీసుకున్న సమయంలో కొట్టడమే కాకుండా హత్యాయత్నం చేశారని, చిత్ర హింసలు పెట్టారని ఫిర్యాదు చేశారు. దీంతో మాజీ సీఐడీ సునీల్‌తోపాటు పలువురు అధికారులపై పోలీసులు పలు సెక్షన్లకింద కేసు నమోదు చేశారు. జగన్ ప్రభుత్వ హాయంలో తనపై జరిగిన కస్టోడియల్ టార్చర్‌పై గుంటూరు ఎస్పీకి రఘురామకృష్ణంరాజు ఫిర్యాదు చేశారు. తనపై పోలీస్ కస్టడీలో జరిగిన హత్యాయత్నానికి బాధ్యులుగా సీఐడీ మాజీ చీఫ్ సునీల్ కుమార్, ఇంటిలిజెన్స్ చీఫ్ సీతారామంజనేయులు, మాజీ సీఎం వైఎస్ జగ్మోహన్ రెడ్డి, అప్పటి సీఐడీ, అడిషనల్ ఎస్పీ విజయ్ పాల్‌లపై కేసు నమోదైంది. తనకు అయిన గాయాలపై కోర్టుకు గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి తప్పుడు నివేదిక ఇచ్చారని ఫిర్యాదు చేశారు. జగన్ రెడ్డిని విమర్శిస్తే తనను చంపేస్తానని సునీల్ కుమార్ తనను బెదిరించారని కూడా రఘురామ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు గుంటూ జిల్లా పోలీసులు కేసు నమోదు చేశారు.

## ఈనెల 23 నుంచి 'పొలం పిలుస్తోంది'

(మొదటిపేజీ తరువాయి)

వ్యవసాయ సాగు పద్ధతులు, పంటల మార్పిడి, ఎరువుల వాడకం తదితర వాటిని వివరించి రైతులకు అవగాహన కల్పిస్తామని వివరించారు. వైసీపీ హయాంలో రైతాంగం అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని వెల్లడించారు. వ్యవసాయ రంగం కుదేళయ్యిం దని ఆరోపించారు. రైతులు ఎలాంటి సమస్యలున్నా ప్రభుత్వం దృష్టికి తేవాలని సూచించారు. వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, డెయిరీ డెవలప్మెంట్, మత్స్యశాఖ మంత్రి గా అచ్చెన్నాయుడు నేడు ఏపీ సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వ్యవసాయ శాఖా మంత్రిగా నేడు అధికారికంగా బాధ్య తలు స్వీకరించారు. ఏపీ ప్రధానంగా వ్యవసాయ ఆధారిత రాష్ట్ర మని తెలిపారు. రాష్ట్ర జనాభా లో 62శాతం మంది 3.02 కోట్ల మంది వ్యవసాయం, వ్యవసాయ అను భంద రంగాలపై ఆధారపడి ఉన్నారని తెలిపారు. వ్యవసాయం, సహకారం, మార్కెటింగ్, పశుసంవర్ధక, డెయిరీ డెవలప్మెంట్, మత్స్య శాఖలను తనకు చంద్రబాబు నాయుడు అప్పగించారని అన్నారు. ఈ రంగాన్ని ఏ ప్రభుత్వమైన అత్యంత ప్రాధాన్యమైనదిగా తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

## రోడ్లపై గుంతలు ఉండవద్దు

(మొదటిపేజీ తరువాయి)

పనులు మొదలు కావాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో 4,151 కి.మీ మేర రోడ్లపై గుంతల సమస్య ఉందన్నారు. తక్షణమే మరమ్మతులు చేయాల్సిన రోడ్లు మరో 2,936 కి.మీ మేర ఉన్నాయని పేర్కొన్నారు. మొత్తంగా రాష్ట్రంలో 7,087 కిలోమీటర్ల పరిధిలో తక్షణం పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

## సుప్రీంకోర్టులో కేజ్రీవాల్‌కు ఊరట

(మొదటిపేజీ తరువాయి)

అరెస్టయినందున ఆయన తిహార్ జైల్లోనే ఉండనున్నారు. ఢిల్లీ లిక్కర్ కేసులో తన అరెస్ట్ అక్రమం అని కేజ్రీవాల్ వేసిన పిటిషన్‌ను విస్తృత ధర్మాసనానికి బదిలీ చేసినట్టు జస్టిస్ సంజీవ్ కన్నా ధర్మాసనం తెలిపింది. గత నెల 27వ తేదీన ఢిల్లీ లిక్కర్ కేసులో కేజ్రీవాల్‌ను సీబీఐ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం తిహార్ జైల్లో కేజ్రీవాల్ ఉన్నారు. ఢిల్లీ మద్యం విధానం మనీలాండరింగ్ కేసులో ఏప్రిల్ 9న ఢిల్లీ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్త నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం కేజ్రీవాల్ పిటిషన్ పై విచారణ జరిపింది. కేజ్రీవాల్, ఈడీ వాదనల అనంతరం మే 17న తీర్పును సుప్రీంకోర్టు రిజర్వ్ చేసింది. ఆ తరవాత జూన్ 20న కేజ్రీవాల్‌కి రౌస్ అవెన్యూ కోర్టు సాధారణ బెయిల్ మంజూరు చేయగా... మరుసటి రోజే ఢిల్లీ హైకోర్టు స్టే ఇచ్చింది.

## ఎమర్జెన్సీపై కేంద్రం కీలక నిర్ణయం

(మొదటిపేజీ తరువాయి)

జూన్ 25వ తేదీని 'రాజ్యాంగ హత్యా దినం'గా ప్రక టించింది. ఈ మేరకు కేంద్రం శుక్రవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ విష యాన్ని హోం మంత్రి అమిత్ షా 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. 1975 జూన్ 25న అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ తన నియంతృత్వ పాలనతో దేశంలో అత్యయిక స్థితి విధించి ప్రజా స్వామ్యం గొంతు నులిమేశారు. ఎలాంటి కారణం లేకుండా లక్షలాది మందిని జైల్లో పెట్టారు. మీడియా గళాన్ని అణగదొక్కారు. ఆ చీకటి రోజులకు నిరసనగా ఇక నుంచి ఏటా జూన్ 25ను 'సంవిధాన్ హత్య దివస్'గా నిర్వహించాలని నిర్ణయించాం. ఎమర్జెన్సీ సమయంలో ప్రజలు అనుభవించిన వేదనను, దాన్ని ఎదిరించి నిలబడిన యోధులను ఆ రోజున గుర్తు చేసుకుందాం' అని అమిత్ షా రాసుకొచ్చారు. ఈ ప్రకటనపై ప్రధాని మోదీ స్పందించారు. నాటి ప్రభుత్వం రాజ్యాంగాన్ని అణగదొక్కి ఎలాంటి పాలన సాగించిందో ఈ సంవిధాన్ హత్య దివస్ మనకు గుర్తుచేస్తుంది. దేశ చరిత్రలో కాంగ్రెస్ రాసిన చీకటి దశ కారణంగా నష్ట పోయిన ప్రతి ఒక్కరినీ స్మరించుకునే రోజు అది అని ప్రధాని పేర్కొన్నారు.

## రహదారి అడ్డుకట్టలను తొలగించండి

(మొదటిపేజీ తరువాయి)

అని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల తో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో రైతు ఉద్యమం సందర్భంగా 'చలో దిల్లీ'ని అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం బారికేడ్లను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. వాటిని వారంలోగా తొలగించాలని పంజాబ్-హరియాణా హైకోర్టు కూడా బుధవారం ఆదేశించింది. ఫిబ్రవరిలో ఖనౌరీ సరిహద్దు వద్ద హరియాణా పోలీసులు, రైతుల మధ్య జరిగిన ఘర్షణల్లో యువ రైతు శుభ్‌కరణ్ సింగ్ మృతి చెందారు. ఆయన మృతిపై హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని మార్చి 7న హైకోర్టు నిర్ణయించింది. దీన్ని సవాలు చేస్తూ హరియాణా దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. హైకోర్టు జారీ చేసిన బారికేడ్ల తొలగింపు ఆదేశాలనూ సవాల్ చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలోనే ధర్మాసనం పలు కీలక ప్రశ్నలు సంధించింది. హైవేను ఒక రాష్ట్రం ఎలా దిగ్బంధిస్తుంది? ట్రాఫిక్‌ను నియంత్రించడం దాని బాధ్యత. జాతీయ రహదారిని తెరవండి.. కానీ, రాకపోకలను నియంత్రించండని జస్టిస్ భూయాన్ ఆదేశించారు. మీరు హైకోర్టు ఆదేశాలను ఎందుకు సవాల్ చేయాలనుకుంటున్నారు? రైతులూ ఈ దేశ పౌరులే. వారికి ఆహారం, మంచి వైద్యం అందించండి. వారు వచ్చి నినాదాలు చేసి, తిరిగి వెళ్లిపోతారు' అని జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. బహుశా మీరు రోడ్డు మార్గంలో ప్రయాణించరేమో! అని ప్రభుత్వ న్యాయవాదిని ఉద్దేశించి వ్యాఖ్యానించగా.. తాను అదే దారిలో రాకపోకలు సాగిస్తానని బదులిచ్చారు. అయితే.. మీకూ ఈ ఇబ్బందుల గురించి తెలిసే ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. తదుపరి చర్యలపై అఫిడవిట్ దాఖలు చేయాలని హరియాణా ప్రభుత్వాన్ని ఆదేశించింది.

## ఎమ్మెల్యేలకు అవగాహన అవసరం

(మొదటిపేజీ తరువాయి)



ఏ 1కన్వెన్షన్ సెంటర్‌లో వెంకయ్య నాయుడు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 75 వసంతాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఈ సమావేశం ఏర్పాటు చేశారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడు, హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, పలువురు ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉత్తరాంధ్రకు ఆప్తుడుగా వెంకయ్య నాయుడు ఉన్నారంటే అది ఏపీ అదృష్టమని కొనియాడారు. తన బాడీ లాగ్వేంజ్‌కి, తనకు లభించిన కుర్చీకి సరిపోలడం లేదని.. కానీ తన కుర్చీకి ఏమాత్రం అగౌరవం రాకుండా చూసుకుంటానని ఉద్ఘాటించారు. తొలిసారి గెలిచిన ఎమ్మెల్యేలకు ట్రైనింగ్ క్యాంపులు పెట్టబోతున్నామని.. వారికి వెంకయ్యనాయుడు వచ్చి తర్ఫీదు ఇవ్వాలని కోరుతున్నామని అన్నారు. ఏపీ విభజన జరిగినప్పుడు ఏరకమైన నష్టం వస్తుందో గ్రహించి అనేక ప్రతిపాదనలు సాధించిన ఘనత వెంకయ్యనాయుడుది అని మిజోరాం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు వ్యాఖ్యానించారు. తెన్నేటి విశ్వనాధం , గౌతులచ్చన్న వంటి యోధులవద్ద వారి జీవనం మొదలైందని చెప్పారు. దేశంలో స్మార్ట్ సిటీలుగా ఎంపికైన మూడు నగరాల్లో విశాఖకు స్థానం లభించిందంటే వెంకయ్యనాయుడు పుణ్యమేనని కొనియాడారు. గ్రామాల్లో నూటికి నూరు శాతం రోడ్ల నిర్మాణాలకు వెంకయ్యనాయుడు రూపకల్పన చేశారని కంభంపాటి హరిబాబు పేర్కొన్నారు.

## పలు గ్రామాల్లో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాలు




**కె.కోటపాడు,జులై 12 (ఆంధ్రపత్రిక):** డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా మండలం లోని లంకవానిపాలెం పరిధి గవరపాలెం, కె.జె.పురం, రామయోగిఅగ్రహారం, ఎ.కోడూరుగ్రామాల్లో శుక్రవారం హెల్త్ సూపర్ వైసర్ జె.సన్యాసిరావు, ఎం.ఎల్. హెచ్.పి.లు,ఎ.ఎన్.ఎం.లు ఆశలు గృహ సందర్శనలు చేశారు. రుబ్బురోళ్ళు, తాగి పడేసిన కొబ్బరి బొండాలు, టైర్లు, ప్లాస్టిక్ గ్లాసుల్లో ఇంట్లో పూల కుండీలు, వాడిపడేసిన ప్లాస్టిక్ బాటిల్స్ లో ప్రాణాంతక వ్యాధుల కారక దోమలుంటాయని ప్రజలకు తెలిపారు.వాటిని లార్వా దశలో నియంత్రిస్తేతేనే వ్యాధుల నుండి రక్షణ పొందవచ్చున్నారు.అలాగే మురికి కాలువలు, నీరునిల్వ ప్రదేశాల్లో లార్వాను నియంత్రించాలన్నారు. దోమలను దరిచేరనీయకుండా చర్యలు చేపట్టడం వలన మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా వంటి వ్యాధులు రాకుండా రక్షణగా ఉండవచ్చని హెచ్.ఎస్.సన్యాసిరావు అన్నారు.

## ఒడిషా నైనీలో సింగరేణి తవ్వకాలు

**భువనేశ్వర్,జూలై12 :** ఒడిశాలోని నైనీ వద్ద సింగరేణి సంస్థ చేపట్టిన బొగ్గు గని ప్రాజెక్టులో తవ్వకాలు చేపట్టేందుకు సహకరించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాంజీని కోరారు. దీనిపై స్పందించిన ఒడిశా సీఎం నైనీ బొగ్గు గనుల తవ్వకానికి పూర్తిగా సహకరిస్తానని భరోసా ఇవ్వడంతో పాటు, తగిన చర్యలు చేపట్టాలని ఆ రాష్ట్ర ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నైనీ బ్లాక్‌లో సింగరేణి కార్యకలాపాల ప్రారం భానికి సంబంధించి ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని కోరేందుకు శుక్రవారం భట్టి విక్రమార్క..అధికారుల బృందంతో కలిసి ఒడిశా సీఎంను శుక్రవారం ఆ రాష్ట్ర సచివాలయంలో కలిశారు. ఒడిశా ముఖ్య మంత్రికి డిప్యూటీ సీఎం భట్టి.. సింగరేణికి బొగ్గు బ్లాకుల ఆవశ్యకతను వివరించారు. 2017లోనే సింగరేణికి నైనీ గనులను కేటాయించారని తెలిపారు. తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ విషయాలకు సంబంధించి గత ప్రభుత్వంలో నాటి బొగ్గు గనుల మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి తాడిచర్ల బ్లాక్, నైనీ బ్లాక్‌లకు సంబంధించిన అడ్డంకులను తొలగించాల్సిందిగా విజ్ఞప్తి చేసినట్టు వివరించారు. నైనీ బ్లాకులో గనుల తవ్వకానికి పారిశ్రామిక, పర్యావరణ అనుమతులు సైతం వచ్చాయని తెలిపారు. అటవీ, ప్రైవేటు భూములను సింగరేణికి బదలాయించాల్సిన అంశం పెండింగ్‌లో ఉందని, ఈ సమస్య పరిష్కారం అయితే సింగరేణి తవ్వకాలను ప్రారంభిస్తుందని చెప్పారు. నైనీ బ్లాక్‌లో తవ్వకాలు చేపట్టడం వల్ల ఒడిశా యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి, పన్నుల రూపంలో రూ.600 కోట్ల వరకు ఒడిశా సర్కార్‌కు ఆదాయం సమకూరుతుందని వివరించారు. దీంతో భూముల బదలాయింపు, విద్యుత్తు, రహదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అక్కడి ఉన్నతాధికారులకు ఒడిశా సీఎం ఆదేశాలు జారీ చేశారు.

## బాధ్యతలు హైడ్రాకు ఇవ్వండి

**హైదరాబాద్,జూలై 12 (ఆంధ్రపత్రిక):** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విపత్తుల నిర్వహణ విభాగాన్ని విస్తృతం చేయాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ హైడ్రా విధి విధానాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... హోర్డింగ్స్, ఫ్లెక్సీల తొలగింపు బాధ్యత హైడ్రాకు ఇవ్వాలని సూచించారు. జోన్ల విభజనలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నాళాలు, చెరువులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై కఠిన నిబంధనలు రూపొం దించాలని ఆదేశించారు. ఒక బలమైన వ్యవస్థగా హైడ్రా ఉండాలని, అందుకు అవసరమైన ప్రత్యేక నిధులు కేటాయించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. . ఈ సందర్భంగా హైడ్రా విధివిధానాలపై చర్చ జరిగింది. హైడ్రా విధివిధానాలపై సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు వరకు 2 వేల చదరపు కి.మీ పరిధిలో హైడ్రా విధులు నిర్వహించేలా చూడాలని సీఎం ఆదేశించారు. ఇప్పటి వరకు జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న అనధికారిక హోర్డింగ్స్, ఫ్లెక్సీలు తొలగించాలి. అపరాధ రుసుము వసూలు బాధ్యత హైడ్రాకు బదలాయించాలని ఆదేశించారు. జోన్ల విభజనలో పోలీస్ స్టేషన్ పరిధులు,అసెంబ్లీ నియోజకవర్గ పరిధులు పూర్తిగా ఒకే జోన్‌లో వచ్చేలా జాగ్రత్త వహించాలన్నారు.నాళాలు, చెరువులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణల విషయంలో నిబంధనలు కఠినతరం చేసేలా అధ్యయనం చేయండని అధికారులను సీఎం ఆదేశించారు. హెచ్ఎండీఏ, వాటర్ వర్క్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, మున్సిపల్ విభాగాల మధ్య ఎప్పటికప్పుడు సమన్వయం ఉండేలా చూడాలి. ఒక బలమైన వ్యవస్థగా హైడ్రా ఉండాలి. అవసరమైతే ప్రత్యేక నిధులు కేటాయించే అంశాన్ని పరిశీలించండి. అసెంబ్లీ సమావేశాల్లోగా పూర్తిస్థాయి విధివిధానాలు రూపొందించండని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ ఆదేశించారు.

## షర్మిల కీలక వ్యాఖ్యలు

(మొదటిపేజీ తరువాయి)

చంద్రబాబు అధికా రంలోకి వచ్చి ఒక నెల దాటిందని... కూటమి కలిపి చేసిన వాగ్దానాలు ఎన్నో ఉన్నాయన్నారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన రెండో రోజే మహిళలకి ఉచిత బస్సు ప్రయాణం హామీ నెరవేర్చారని తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వానికి ఎందుకు ఇంత సమయం పడుతుందని ప్రశ్నించారు. మహిళలకు ఈ పథకం ఎంతగానో ఉపయోగడుతుంది కాబట్టి ఈ అంశం లేవనెత్తుతున్నామన్నారు. ఒక మహిళకి భద్రత అనేది బస్సు ప్రయాణం నుంచి ఉంటుందన్నారు. మహిళలకు పనికొచ్చే ఈ చిన్న పథకానికి ఎందుకు ఇంత సమయం పడుతుందో అర్ధం కావట్లేదన్నారు. సూపర్ సిక్స్ హామీలో భాగంగా అమ్మకి వందనం పథకం ఇవ్వాలన్నారు. ఈ స్కీం లో ప్రతి తల్లికి అన్నారని.. ప్రతి బిడ్డకి ఇవ్వాలన్నారు. చంద్రబాబు ఈ పథకంపై క్లారిటీ ఇవ్వాలని షర్మిల డిమాండ్ చేశారు.గతంలో జగన్ కూడా హామీ ఇచ్చి మాట తప్పారని మండిపడ్డారు. ప్రతి బిడ్డకి రూ.15వేలు ఇస్తామని తన చేత కూడా ప్రచారం చేయించారన్నారు. వైజాగ్ స్టీల్‌కు ఇంతవరకు కాప్టిమ్ మైన్ లేదన్నారు. మోదీ ఏపీకి పోలవరం, స్పెషల్ స్టేటస్ ఇస్తామని పలు హామీలు ఇచ్చారు కానీ నెరవేర్చలేదన్నారు. మోదీ అంటేనే మోసం గతంలో జగన్ సీఎంగా ఉన్నప్పుడు వైజాగ్ స్టీల్‌ను కాపాడలేక పోయారని విమర్శించారు. వైజాగ్ స్టీల్ నష్టాలలో ఉంటే ఎందుకు తగిన నిర్ణయాలు తీసుకోలేదని విమర్శించారు.ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చిందని.. వైజాగ్ స్టీల్‌పై మోదీతో మాట్లాడి ప్రజలకి ఉపయోగపడే నిర్ణయాలు తీసుకోవాలని షర్మిలా రెడ్డి హితవు పలికారు.

## అనంతపురంలో ఎయిర్‌పోర్టు?

**అమరావతి,జూలై 12 (ఆంధ్రపత్రిక):** అనంతపురంలో అనువైన భూమి చూపితే విమానాశ్రయం ఏర్పాటుపై అధ్యయనం మొదలుపెడతామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. ఉద్యాన ఉత్పత్తుల ఎగు మతుల కోసం ఇక్కడ ఎయిర్‌పోర్టు ఏర్పాటుచేయాలని రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, స్థానిక ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి ఇటీవల చేసిన విజ్ఞప్తిపై ఆయన స్పందించారు. విమానాశ్రయానికి కావాల్సిన భూమి చూపితే తదుపరి కార్యాచరణ చేపడతామ న్నారు. ఇందుకు 1,200 ఎకరాలు అవసరమవుతాయని పేర్కొన్నారు. గన్న వరం విమా నాశ్రయం అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎయిర్ పోర్ట్ అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గన్నవరం ఎయిర్ పోర్ట్ అంతర్జాతీయ టెర్మినల్ పనులు గత ప్రభుత్వం హ యాంలో అటకెక్కాయి.. గత ప్రభుత్వం ఐదు సంవత్సరాలు అధికారంలో ఉండి విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయకపోవడం దారుణమని విమర్శించారు. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎయిర్ పోర్ట్ టెర్మినల్ అభివఅద్ధి పనులను సంవత్సరంలోపు పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని ఎంపీ కేశినేని చిన్ని వెల్లడించారు. ఇక, కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడుతో మాట్లాడుతూ.. గన్నవరం ఎయిర్ పోర్టు అభివృద్ధికి కృషి చేసి రాష్ట్రంలో నెంబర్ వన్ స్థాయిలో నిలుపుతామన్నారు. విమానాశ్రయం అభివృద్ధికి అను విధాలుగా కృషి చేస్తాను అని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో పనులను ఎయిర్ పోర్టుల్లో సందర్శించి సమీక్షించారు.. పనుల్లో జాప్యం ఉంటే కాంట్రాక్టర్లను మార్చాలి.. అంతేగాని గత వైసీపీ ప్రభుత్వం ఐదు సంవత్సరాలు ఎయిర్ పోర్ట్ పనులు నిలిపి వేసి చోద్యం చూశారని కేంద్రమంత్రి మండిపడ్డారు. మా ఎన్డీయే ప్రభుత్వంలో కేవలం 9 నెలలోనే ఎయిర్ పోర్ట్ ను అంతర్జాతీయ టెర్మినల్స్ ను పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామన్నారు. ఎయిర్ పోర్టులో అంతర్జాతీయ టెర్మినల్ పనులు సమీక్షించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

## నేపాల్‌లో ఘోర ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

3.30 సమయంలో కొండ చరియలు విరిగి పడ్డాయి. ఆ సమయంలో భారీగా వర్షం కూడా కురుస్తోంది. దీంతో అదే మార్గంలో దాదాపు 65 మందికి పైగా ప్రయాణికులతో వెళ్తున్న రెండు బస్సులపై కొండచరియలు పడడంతో ఆ రెండు బస్సులు పక్కనే ఉన్న త్రిశూన్ నదిలో పడ్డాయి. గల్లంతైన వారిలో ఏడుగురు భారతీయులు కూడా ఉన్నట్లు సమాచారం. వీరు ప్రాణాలు కోల్పోయినట్లు వార్తలొస్తున్నాయి. కానీ,ఎటువంటి అధికారిక ధ్రువీకరణ రాలేదు. మరో బస్సుపై కొండచరియలు విరిగిపడటంతో డ్రైవర్ మృతి చెందాడు. 24 మంది ప్రయాణికుల తో ఓ బస్సు కాఠ్‌మాండూ వెళుతోంది. మరో బస్సులో 41 మంది ఉన్నట్లు గుర్తించారు. వీటిని గణపతి డీలక్స్, ఏంజెల్ బస్సులుగా గుర్తించారు. వీటిల్లో గణపతి డీలక్స్‌కు చెందినదిగా భావిస్తున్న బస్సు నుంచి ముగ్గురు ప్రయాణికులు తప్పించుకొన్నారు. బస్సు ప్రమాదానికి గురికాగానే వారు దానిలోనుంచి బయటకు దూకేసినట్లు కాఠ్‌మాండూ పోస్టు పేర్కొంది. అదే మార్గంలో మరో చోట కూడా బస్సుపై కొండచరియ విరిగిపడటంతో దాని డ్రైవర్ తీవ్రంగా గాయపడి మృతి చెందారు. ఈ బస్సు బుట్వాల్ నుంచి కాఠ్మాండూకు వెళుతోంది. మృతుడిని మేఘ్‌నాథ్‌గా గుర్తించారు. ఈ ఘటనపై నేపాల్ ప్రధాని పుష్పకమల్ దహాల్ విచారం వ్యక్తంచేశారు. ప్రభుత్వ ఏజెన్సీలు అక్కడ బాధితుల గాలింపునకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆ దేశ సాయుధ దళాలు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి.

## ఫోన్ ట్యాపింగ్ నిందితులకు ఎదురుదెబ్బ

### బెయిల్ పిటిషన్లు కొట్టేసిన నాంపల్లి కోర్టు

**హైదరాబాద్,జూలై 12 (ఆంధ్రపత్రిక):** ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితులకు మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. నాంపల్లి కోర్టులో నిందితులు దాఖలుచేసిన మ్యాండేటరీ బెయిల్ పిటిషన్లను న్యాయస్థానం కొట్టివేసింది. ఏ2 ప్రణీత్‌రావు, ఏ3 తిరుపతన్న, ఏ4 భుజంగరావు, ఏ5 రాధాకిషన్‌రావులకు కస్టడీ పూర్తయిందని, ఇప్పటి వరకు ఛార్జిషీట్ నమోదు కానందున వారికి బెయిల్ ఇచ్చే అధికారం కోర్టుకు ఉందని నిందితుల తరఫు న్యాయవాదులు కోర్టుకు విన్నవించారు. వారి వాదనలపై అభ్యంతరం వ్యక్తం చేసిన పోలీసులు.. ఛార్జిషీట్ దాఖలు చేశామని, దాన్ని తిప్పి పంపినంత మాత్రాన అసలు దాఖలు చేయనట్టు కాదు అన్నారు.

## సమాచార,పౌర సంబంధాల శాఖ డైరెక్టర్‌గా హిమాన్షు శుక్లా

(మొదటిపేజీ తరువాయి)

స్వీకరించారు. విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్ లోని ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ రెండవ అంతస్తులోని సమాచార పౌర సంబంధాల శాఖ ప్రధాన కార్యాలయంలో మధ్యాహ్నం 3 గం.లకు ఆయన డైరెక్టర్ గా బాధ్యతలు చేపట్టారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం హిమాన్షు శుక్లా ఐ అండ్ పీఆర్ అధికారులతో సమావేశమై శాఖాపరమైన వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమాచార, పౌర సంబంధాల శాఖకు డైరెక్టర్ గా రావడం ఆనందంగా ఉందన్నారు.అంతకుముందు ఐ అండ్ పీఆర్ (సమాచార పౌర సంబంధాల శాఖ) అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది హిమాన్షు శుక్లాకు ఘనస్వాగతం పలికారు. బాధ్యతల స్వీకరణ అనంతరం పుష్పగుచ్చాలతో అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీమతి ఎల్.స్వర్ణలత, జాయింట్ డైరెక్టర్లు పి.కిరణ్ కుమార్, శ్రీమతి. తేళ్ల కస్తూరి, చీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ ఓ.మధుసూధన, రీజినల్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్లు సి.వి. కృష్ణారెడ్డి, నాగరాజు, అసిస్టెంట్ డైరెక్టర్లు ఎం. భాస్కర్ నారాయణ, జీవీ. ప్రసాద్, వెంకటరాజు గౌడ్, ఎఫ్ డీసీ జనరల్ మేనేజర్ శ్రీ. శేష సాయి, ఐ అండ్ పీఆర్ ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్‌ను తరిమేస్తేనే మనుగడ

(మొదటిపేజీ తరువాయి)

ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను పవన్ సందర్శించారు. అనంతరం ఎస్-ఎల్ఆర్ఎం వర్క్ షాప్‌లో పాల్గొన్నారు. దీనిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన అధికారులు.. భీమవరం, పిఠాపురం, గొల్లప్రోలు లో ఈ ప్రాజెక్ట్ అమలు చేస్తున్నట్లు వివరించారు. డ్రైనేజ్ టు డైమండ్ అనే కాన్సెప్ట్‌తో ఈ ప్రాజెక్టును రూపొందించారని ఎల్ ఎల్ఆర్ఎం రిసోర్స్ ప్రతినిధి శ్రీనివాసన్ పేర్కొన్నారు. 12 గంటల్లో చెత్తను కలెక్ట్ చేయగలిగితే అది సంపదే అవతుందని.. పనికి రాని చెత్త వేరే అవసరాలకు సంపదగా మారుతుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. పిఠాపురంలో తొలిసారిగా ఎస్ఎల్ఆర్ఎం ప్రాజెక్ట్ చేపడతు న్నామని.. శ్రీనివాసన్ గత రెండు దశాబ్దాలుగా ఈ ప్రాజెక్టుపై పని చేస్తున్నారని చెప్పారు. ప్రజలు సైతం ఈ ప్రాజెక్టులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దీనిపై అవగాహన కల్పించేందుకు మాస్టర్ ట్రైనర్స్‌ను సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. 'పంట కాల్వ కనిపిస్తే కొందరు డంపింగా యార్డుగా మార్చేస్తున్నారు. పంచభూతాల్లో నీరు ఉంది. నీటిని మనం పూజలకు ఉపయోగిస్తాం. అలాంటి జలాన్ని కాలుష్యం కాకుండా కాపాడుకోవాలి. ప్రస్తుతం పర్యావరణానికి అతి పెద్ద సమస్య ప్లాస్టిక్. ప్లాస్టిక్, చెత్తా చెదారంతో ఇబ్బందులు వస్తున్నాయి. మనం గోవులను పూజిస్తాం. ప్లాస్టిక్ కవర్లు తినడం వల్ల ఆవులు చనిపోవడం బాధాకరం. ఎస్ఎల్ఆర్ఎం ప్రాజెక్టులో ఈ ఇబ్బందులు తొలుగుతాయి. ఈ ప్రాజెక్టును మా కార్యాలయంలో.. మా పార్టీ ఆఫీసులో ప్రారంభిస్తాం. ఈ ప్రాజెక్టును అమలు చేయగలిగితే పంచాయతీలు, మున్సిపాల్టీలకు ఆదాయం వస్తుందని పవన్ వివరించారు. మన జీవితంలో చెత్త ఒక భాగంగా మారిందని అన్నారు. మన దేశం నదులు, సంప్రదాయాలు, పూజలకు విలువ ఇస్తామని.. కానీ నదుల సంరక్షణకు చర్యలు తీసుకోబోమన్నారు. పంట కాలువలను డంపింగ్ యార్డులుగా మారుస్తున్నారని.. ప్లాస్టిక్ కవర్లు ఎక్కడ పడితే అక్కడ పారేస్తున్నారని పవన్ పేర్కొన్నారు. వాటిని తిని గోవులు చనిపోతున్నాయన్నారు. గోవులను పూజించడమే కాదు.. వాటి బాగు కూడా చూడాలి. మనకి పనికిరాని వస్తువులతో సంపద సృష్టించవచ్చు. చెత్తను ఊడ్చి పడేయటం వరకే... తరువాత ఏమిటి అని ఆలోచన చేయడం లేదు. పిఠాపురంలో తొలుత ఈ ప్రాజెక్టును ప్రారంభిస్తున్నాం. రోజుకు రెండు సార్లు చెత్త కలెక్ట్ చేసి.. కొత్త సంపద సృష్టిస్తాం. ప్రజలు కూడా దీనిని బాధ్యత తీసుకుని సహకరించాలని అన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా పిఠాపురంలో అన్ని కాలనీల్లో అమలు చేస్తాం. మాస్టర్ ట్రైనర్స్‌ను ముందు రెడీ చేసి.. వాళ్ల ద్వారా రాష్ట్రం మొత్తం శిక్షణ ఇస్తాం. ఇది వ్యక్తి తో మొదలైనా... వ్యవస్థ మొత్తం అమలు చేయాలి. నా పార్టీ ఆఫీస్, నా క్యాంపు ఆఫీస్, నా నియోజకవర్గంలో నేను మొదలు పెడతా. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ద్వారా కూడా కొన్ని మార్పులు తీసుకు వస్తాం. పంచాయతీల ద్వారా మోటివేషన్ తీసుకు వస్తాం. 101 గ్రామ పంచాయతీల్లో చెత్తతో రూ.2600 కోట్లు ఆదాయం సమకూరింది. రెండున్నర లక్షల మందికి ఉపాధి అవకాశాలు వచ్చాయి. స్వచ్ఛాంధ్ర ద్వారా దీనిని ప్రజల్లోకి తీసుకెళతాం. ప్రజలంతా దీనిపై అవగాహన పెంచుకోవాలి. చెత్త ద్వారా వచ్చే సంపదను ఆయా కార్మికులకు కేటాయిస్తాం. బ్లీచింగ్ పౌడర్‌కే పంచాయతీల్లో డబ్బులు లేని పరిస్థితి. పంచాయతీకి నిధులు సమకూర్చే సవాల్‌ను స్వీకరించి ముందుకు సాగుతాం. గ్రామాల్లో రోడ్డు వెంట కొబ్బరి చెట్లు పెంచడం ద్వారా కొంత ఆదాయం సమకూర్చుకుంటాం. పంచాయతీలను అనేక కారణాలతో నిర్వీర్యం చేశారు. సమూలంగా ప్రక్షాళన జరగాలి. స్వయం సమృద్ధిగా పంచాయతీలు ఎదగాలి. అల్లావుద్దీన్ అద్భుత దీపంలా అన్ని పరిష్కారాలు ఒకేసారి అయిపోవు. ఈ ప్రాజెక్టును ముందు అమలు చేసి.. ఫలితాల చూసి.. అన్నిచోట్ల అమలు చేస్తాం అని అన్నారు. దీనికి కమ్మిట్మెంట్ ఉండే లీడర్ షిప్ ఉంటేనే ఇది సాధ్యం. పిఠాపురంలో 54 పంచాయతీ ల్లో మేము చేసేది చేయగా.. యన్ఆర్ఐలు ముందుకు వస్తే వారి సాయం తీసుకుంటాం అని పవన్ పేర్కొన్నారు. సర్వీస్ అంటే ఎవరూ రారు.. చెత్తతో సంపద వస్తుంది అంటేనే ముందుకు వస్తారు. అన్ని అనర్ధాలకు ఒకే ఐఏయస్ కారణం. ఏ సమీక్ష చేసినా... ఆయనే మూల కారణం అంటున్నారు. ఆయన ఇప్పుడు సర్వీసులో లేరు. ఎవరిని బాధ్యులను చేయాలి, నిధులు ఎలా రికవరీ చేయాలి? కేవలం కేసులు పెట్టి చట్టపరంగా చర్యలు తీసుకోవాలి. గత ప్రభుత్వం పంచాయతీలకు రాష్ట్ర వాటా ఇవ్వలేదు. కేంద్రం కూడా నమ్మకం పోయి నిధులు ఆపేసింది. 70:30 నిధులు ఇస్తే పని అయ్యేది.. అది జరగలేదు. రకరకాల పేర్లు చెప్పి నిధులు మొత్తం మళ్లించారు. ముందు ఖర్చు పెట్టండి, తరువాత బిల్లు ఇస్తాం అని నమ్మబలికారు. డబ్బులు వచ్చినా.. రోడ్లు వేసిన కాంట్రాక్టర్‌లకు గత ప్రభుత్వం ఇవ్వలేదు. అన్ని వ్యవస్థ ల్లో, పథకాల్లో ఇటువంటి ఛాలెంజ్‌లు ఉన్నాయి. వీటిని పెట్టుకుని వెంటనే అన్నీ చేయాలంటే మాకు సాధ్యం కాదు కదా' అని పవన్ పేర్కొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలి





-మెనూ ప్రకారం పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందించాలి-పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్
-10వ తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించిన కలెక్టర్

**హిందూపురం,జులై 12 ( ఆంధ్రపత్రిక ):** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధనతో పాటు పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చైతన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హిందూపురం పట్టణంలో జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ సుడిగాలి పర్యటించారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, మున్సిపల్ కమిషనర్ హిందూపురం ఎమ్మార్వో శివ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు, అనంతరం జిల్లా కలెక్టర్ తహసిల్దార్ కార్యాలయం ఆవరణలో పత్రిక సమావేశంలో మాట్లాడుతూ హిందూపురం పట్టణంలో నిరుపయోగముగా ఉన్న భవనాలను గుర్తించి వాటిని పునర్ నిర్మించడానికి కార్యాచరణ ప్రణాళికలు చేపట్టాలని అందుకు పెనుగొండ సబ్ కలెక్టర్ ప్రత్యేక ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. హిందూపురం కోర్టు పరిశీలించి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టులను పరిశీలించడం జరిగిందని పెనుకొండ సబ్ కలెక్టర్ అందించిన వివరాలు మేరకు తమను మర్యాద పూర్వకముగా కలిసిన బార్ అసోసియేషన్ వారికి వివరించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఇసుక విధానం ప్రజలకు విరివిగా అందజేయుచున్నామని తెలిపారు. ఇసుక నియంత్రణపై గట్టి నిఘ ఏర్పాటు చేయుచున్నామని త్వరలో రెవెన్యూ శాఖ, మైనింగ్ శాఖ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ చర్యలు చేపడుతున్నామని తెలిపారు, జిల్లాలో మున్సిపాలిటీ వారి ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయడానికి ప్రణాళిక చేపడుతున్నామని వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య మిత్ర హెల్ప్ డెస్క్ ను పరిశీలించారు. ఓపి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అన్నా క్యాంటీన్ ను త్వరలో ప్రారంభించడం జరుగుతుందని అందుకు కార్యక్రమాలు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. ప్రజలకు సీజన్ వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని వైద్య సిబ్బందిని హెచ్చరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.వైద్య సేవల నిమిత్తం వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడం జరుగు తుందని ఇందులో భాగంగా ఆసుపత్రిలో అవసరమైన బెడ్ షీట్స్,ఆపరేషన్ కి అవసరమైన వైద్య పరికరాలను ఆస్పత్రి అభివృద్ధి నిధి నుండి కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ మెడికల్ సూపర్ డెంటన్ ఆదేశించారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీకి సంబంధించిన ప్రతిపాదన లను సిద్ధం చేసి పంపాలని, దూర ప్రాంతాల నుండి డాక్టర్లపై ఎంతో నమ్మకంతో వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించి వారిని ఆదుకోవాలని డాక్టర్లకు సూచించారు. చిలమత్తూరులోని స్థానిక కస్తూరిబా బాలికోన్నత పాఠశాలను శుక్రవారం కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేసి విద్యా బోధన , మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధనా ఉండాలన్నారు. విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం వేలాది కోట్ల రూపాయలు ఖర్చుచేస్తున్నదని, అందుకు తగిన విధంగా విద్యా ఫలితాలు ఉండాలన్నారు. పాఠశాలల్లో విద్యాభ్యాసం చేసి విద్యార్థినీ, విద్యార్థులలో పౌష్టికాహారలోపం లేకుండా ఉండేలా మధ్యాహ్న భోజనంలో ప్రతీ రోజు పౌష్టికాహారంతో ప్రత్యేక మెనూను ప్రభుత్వం అమలు చేస్తున్నదన్నారు. నిర్దేశించిన మెనూను ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. తాను తన జిల్లాలో వివిధ కార్యక్రమాలలో పాల్గొనే క్రమంలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను తప్పనిసరిగా ఆకస్మికంగా తనిఖీ చేస్తానని, ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘించినట్లు తన పరిశీలనలో తేలితే సంబంధిత సిబ్బందిపై చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు. మధ్యాహ్న భోజన కిచెన్ ని పరిశీలించి వంట సరుకుల నాణ్యత, కోడిగుడ్ల పరిమాణం, చిక్కీ ల నాణ్యత, భోజనం నాణ్యత ను, కిచెన్ లో పరిశుభ్రతను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, వండిన ఆహారం పరిమాణంలను ప్రధానోపాధ్యాయులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆహరం వండే విధానం, మెనూ ప్రకారం పిల్లలకు అందిస్తున్నారా లేదా అని కూడా పరిశీలించాలన్నారు. విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను కూడా తెలియజేయాలని, భోజనానికి ముందు చేతులు సబ్బుతో కడుక్కోవాలని తెలియజేస్తూ పరిశీలించాలన్నారు.
అనంతరం జిల్లా కలెక్టర్ పదో తరగతి చదివే విద్యార్థులకు సాంఘిక శాస్త్రానికి సంబంధించిన ఫెడరలిజంపై బోధించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగారు. ఈకార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి ఆర్. ఎం. ఓ,డాక్టర్ కె డేవిడ్ రాజు, సూపర్డెంట్ రోహిల్ కుమార్, చిలమత్తూరు తహసీల్దార్ భాగ్యలత, కస్తూరిబా గాంధీ స్కూల్ ఎస్ వో సునీత కుమారి, స్కూల్ టీచర్లు పాల్గొన్నారు.

# పరామర్శకు వస్తే అడ్డుకుంటారా?

## రాజకీయం చేసేందుకు రావడం లేదు -నేను వస్తే నిజాలు బయట పడతాయాని భయపడుతున్నారా? : శాప్ మాజీ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థ రెడ్డి




**నందికొట్కూరు, జులై 12, (ఆంధ్రపత్రిక) :** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న 9 ఏళ్ల బాలిక అదృశ్యంపై బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు శుక్రవారం కర్నూల్ నుంచి వస్తున్న శాప్ మాజీ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిని పోలీసులు బ్రాహ్మణకొట్కూరులో అడ్డుకున్నారు. ఈ సంఘటనపై బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తనకు అత్యంత సమీప కుటుంబ సభ్యులకు తీవ్ర అన్యాయం జరుగుతే వారి మనసులో ధైర్యం నింపేందుకు గ్రామానికి వెళుతుంటే పోలీసులు మధ్యలోనే అడ్డుకొని బ్రాహ్మణ కొట్టుకూరు స్టేషన్లో ఉంచడం అన్యాయమన్నారు. క్రైమ్ అత్యధికంగా ఉండే ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో సైతం మహిళలకు ఏదైనా అఘాయిత్యం జరిగితే పరామర్శించేందుకు ఎవరికైనా అనుమతి ఇస్తారని, అయితే ఇక్కడ తన సొంత గ్రామానికి కూడా వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఆరు రోజులుగా బాలిక అదృశ్యమైన ఇంతవరకు ఆచూకీ కనుక్కోకపోవడంపై కారణాలు ఏవో తెలియాల్సి ఉందన్నారు. ఎవరి పొద్దలంతో పోలీసులు తనను గ్రామానికి వెళ్లకుండా అడ్డుకున్నారో, తాను వస్తే నిజానిజాలు బయటపడతాయని భయపడుతున్నారో వారికే తెలియాలన్నారు. నన్ను అడ్డుకోవడంపై శ్రద్ధ పెట్టిన పోలీసులు బాలిక ఆచూకీ కోసం సమయం కేటాయించి ఉంటే బాగుండేది అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించేందుకు, పోలీసులను నిందించడానికో తాను రాలేదని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని కోరేందుకే తాను వచ్చానన్నారు. అభం శుభం తెలియని చిన్నారిపై ముగ్గురు మైనర్ యువకులు అఘాయిత్యం చేసి, ఆపై హత్య చేశారని వస్తున్న ఉదంతాలపై విచారణ వేగవంతం చేసి దోషులను కఠినంగా శిక్షించి, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కాగా సిద్ధార్థ రెడ్డిని పోలీస్ స్టేషన్ నుంచి బయటకు పంపాలని ఆ పార్టీ నాయకులు పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు తులసి రెడ్డి మల్లారెడ్డి చంద్రమౌళి పాల్గొన్నారు.

# డ్రైవింగ్ పై నిర్లక్ష్యం వీడాలి

## -జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి



**హిందూపురం, జులై 12 ( ఆంధ్రపత్రిక ) :**వాహన వినియోగదారులు డ్రైవింగ్ పై నిర్లక్ష్యం వీడి జాగ్రత్తగా వాహనాలను నడపాలని జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి సూచించారు. శుక్రవారం స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలో హెల్మెట్ల వాడకం – రోడ్డు ప్రమాదాల నివారణ పై జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లను ఉపయోగించి వాహనాలను నడపాలన్నారు. అదేవిధంగా సెల్ ఫోన్లు మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలను నడపవద్దని సూచించారు. కార్లు నడిపే వ్యక్తులు విధిగా సీట్ బెల్టు పెట్టుకోవాలన్నారు. అజాగ్రత్తగా వాహనాలను నడిపి ప్రమాదాలు జరిగితే ఆయా కుటుంబాలు ఎంతో నష్టపోవాల్సి ఉంటుందని తెలిపారు. వాహనదారులు విధిగా లైసెన్సులు పొందడంతో పాటు తమ వాహనాలకు బీమా సౌకర్యం ఉండేలా చూసుకోవాలన్నారు.

18 ఏళ్ల లోపు మైనర్లకు వాహనాలను ఇవ్వరాదన్నారు. అలా వాహనా లు నడిపే సమయంలో ప్రమాదాలు జరిగితే ఆయా తల్లితండ్రులను బాధ్యులుగా చేస్తూ చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయన్నారు. వాహనదారులు నిర్లక్ష్యం లేకుండా సురక్షితమంగా తమ గమ్యస్థా నాలకు చేరుకునేలా చూసుకోవాలన్నారు. దీనికి తోడు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. మితిమీరిన వేగంతో వాహనాలను నడిపి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని న్యాయమూర్తి సూచించారు. హిందూ పురం పట్టణ శివారు ప్రాంతాల్లో యువకులు ద్విచక్ర వాహనాల పోటీలను ఏర్పాటు చేసుకుని ఒక చక్రంపై వాహనాలను నడపడం వంటి విన్యాసాలు చేస్తున్నారని దీనివల్ల ఎంతో ప్రమాదం ఉంద న్నారు. పోలీసులు ఆయా కార్యకలాపాల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని న్యాయమూర్తి సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు రాజశేఖర్, శ్రీనివాసరెడ్డిలతో పాటు న్యాయవాదులు, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి, శారద, ట్రాఫిక్ పోలీసులు, కక్షిదారులు పాల్గొన్నారు.

# గుంతకల్లులో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ విద్యుత్ భవనంను శంకుస్థాపన



**గుంతకల్లు,జులై 12 ( ఆంధ్రపత్రిక ):** పట్టణంలో ఆలూరు రోడ్ విద్యుత్ కార్యాలయం ప్రాంగణంలో శుక్రవారం విద్యుత్ భవనాన్ని శంకుస్థాపన కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ 2. 20 రూ.కోట్ల తో నిర్మించిన విద్యుత్ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా రైలు గేట్ ల వల్ల నిరంతరం ప్రజలు ఇబ్బందులు వున్నాయని బ్రిడ్జీలు నిర్మించాలని, ట్రాక్ కు ఇరుపక్కలా ప్రహరీ గోడ కట్టడం వల్ల విద్యార్థులు పాఠశాలకు వెళ్లే మార్గం లేక మూడు కిలోమీటర్ల దూరం నడవాల్సి వస్తుందని అన్నారు. వెంటనే ఎంపీ ఆయా ప్రాంతాలను సందర్శించి సికింద్రాబాద్ జనరల్ మేనేజర్ కు ఫోన్ ద్వారా తెలియజేసి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రపోజల్స్ కూడా అతి త్వరలోనే పంపడం జరుగుతుంది అని స్థానికులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యమంలో అధికారులు, స్థానిక నాయకులతో పాటు గుమ్మనూరు నారాయణస్వామి,మణికంత, ముష్టురు తిమ్మప్ప, ముష్టురు భాస్కర్, మాజీ కౌన్సిలర్ అంజి, తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్ వాడండి - ప్రమాదాలను నివారించండి

## డోన్ సివిల్ జడ్జి తంగమణి



**డోన్ ,జులై 12 (ఆంధ్రపత్రిక) :** వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ల ను వాడి ప్రమాదాల నుంచి ప్రాణాలను కాపాడుకోవాలని డోన్ సివిల్ జడ్జి తంగమని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవ అధికార సంస్థ అమరావతి మరియు జిల్లా రవాణాశాఖ అధికారి జి వి శివారెడ్డి సూచనల మేరకు ఎస్ . తంగమణి సీనియర్ సివిల్ జడ్జ్ ఆధ్వర్యం లో పట్టణ ప్రభుత్వ జూనియర్ కళాశాల యందు హెల్మెట్ వాడకం పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ జడ్జి తంగమని మాట్లాడుతూ మోటార్ సైకిల్ నడుపు తున్న ప్పుడు తీసుకొనవలసిన జాగ్రత్తలు మరియు మోటార్ వాహన చట్టంలోని జరిమానా మరియు శిక్షల గురించి వివరించారు, ఈ కార్యక్రమంలో పట్టణ సి ఐ ప్రవీణ్ కుమార్, మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ క్రాంతి కుమార్ మరియు కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణయ్య కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపీ డీజీపీని కలిసిన ప్రజా వైద్యశాల మల్లికార్జున



**డోన్ ,జూలై 12 (ఆంధ్రపత్రిక):** గత ప్రభుత్వ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని నంద్యాల జిల్లా టిడిపి బీసి సెల్ అధ్యక్షులు ప్రజా వైద్యశాల మల్లికార్జున కోరారు. శుక్రవారం విజయవాడలోని డీజీపీ కార్యాలయంలో కార్యాలయంలో ఏపీ డీజీపీ ద్వారక తిరుమలరావు మర్యాదపూర్వకంగా మల్లికార్జున కలిశారు. ఈ సందర్భంగా డిజిపి కి వినతి పత్రం సమర్పించారు. జగన్ ప్రభుత్వ హయాంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల పైన నాయకుల పైన అక్రమంగా బనాయించిన కేసులపై విచారణ జరిపించి ఎత్తివేయాలని ఆయన కోరారు.

## వసంతిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

### వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి



**చౌడేపల్లి,జూలై12(ఆంధ్రపత్రిక):** అభం శుభం తెలియని చిన్నారి వసంతి(8)ని ఘోరంగా మానభంగం చేసి, ఆపై హత్య చేసిన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి నాయకుడు ఆదినారాయణ డిమాండ్ చేశారు. వసంతి హత్యకు నిరసిస్తూ చిన్నారి ఆత్మశాంతి కోసం ఆ సంఘం ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ నందు కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. వసంతి లాంటి చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడే వారిని ఉరితీయాలని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం బస్టాండ్ నందు కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి ప్రసాద్, వెంకటరమణ, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



**బంగారుపాళ్యం,జులై12(ఆంధ్రపత్రిక):** చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండల పరిధిలోని మొగిలి ఘాట్ రోడ్డులో ఈనెల 10వ తేదీ సాయంత్రం 5:30గం"కి అన్నమయ్య జిల్లా వాయల్పాడు మండలానికి చెందిన 35 సంవత్సరముల వయసు కలిగిన ఎం.మధు కుమార్ తన బావమరిది భరత్ కుమార్,నాగరాజ్ అనే వ్యక్తులతో ద్విచక్ర వాహనంపై తన స్వగ్రామమైన వాయల్పాడుకు సూళ్లూరుపేట నుండి వెళుతుండగా అడవి పందులు ఎదురుపడగా వాటిని తప్పించబోయి ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాద ఘటనలో మధు కుమార్ కు తీవ్రగాయాలు కాగా భరత్ కుమార్, నాగరా జులకు రక్త గాయాలు కావడంతో వీరిని రుయా ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగా మధుకుమార్ గురువారం రాత్రి 10 గంటలకు మరణించడం జరిగింది. ఈసంఘటనపై బంగారుపాళ్యం ఏఎస్ఐ మల్లప్ప కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ఘనంగా గోరింటాకు(డే)పండుగ సంబరాలు




**కర్నూలు జూలై 12(ఆంధ్రపత్రిక):** విన్నపం ఒక పోరాటం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షురాలు చీకూరి లీలావతి ఆధ్వర్యంలో గోరింటాకు (డే) సెలబ్రేషన్స్ లో పాల్గొన్న హుజూర్ నగర్ మండల పరిధిలో గోపాలపురం గ్రామంలో మండల ఏపీఎం తుమ్మల స్వరూప రాణి ఈ సందర్భంగా మాట్లాడుతూ పూర్వికులు గోరింటాకు అందంతో పాటు ఆరోగ్యానికి మంచిదనేసి పెట్టుకునేవారు ఈ వర్షాకాలం ప్రారంభంలో వచ్చే చర్మ రోగాలకు నిండి రక్షించబడుతుందని ఆచర సంప్రదాయాలైన ఒక సైన్స్ అని భావితరాలకు కూడా ప్రకృతి ప్రసాదించిన గోరింటాకు యొక్క ప్రాముఖ్యత తెలియజేయటం అందంతో పాటు ఆరోగ్యం కూడా ఉంటుందని అన్నారు.హుజూర్ నగర్ మండల సిసి పరిమళారాణి ఆర్ మాట్లాడుతూ ప్రకృతిలో ఆకుల్లో అన్నిటికంటే ఒక గోరింటాకు మాత్రమే ఎర్రగా పండే స్వభావం ఉందని ఇది మహిళలకు అందాన్ని ఆరోగ్యాన్ని ఇచ్చే విధంగా ఆకుకి గొప్పతనం ప్రతి ఒక్కరూ ఈ సీజన్లో గోరింటాకు పెట్టుకోవాలని అన్నారు. విన్నపం ఒక పోరాటం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షురాలు చీకూరి లీలావతి సైన్స్ దాగిన గోరింటాకు రాష్ట్ర ప్రభుత్వం ఆషాడ మాసంలో ఒకరోజున ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం కొన్ని సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామన్నారు. ఇది భావితరాలకి ఒక మంచి ఆరోగ్య సూచన ఇలాంటి వాటిని గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో సుజాత దొంతకాని విజయ రమాదేవి సంధ్య గిరిజ లక్ష్మి అంజమ్మ పుష్ప జేరిన అరుణ ఆశ గురువమ్మ ఈశ్వరమ్మ యశోద ఇందిరమ్మ చిన్న పాప పాల్గొన్నారు.

# అంగన్వాడీలకు చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

## ఎఐటియూసి జిల్లా అధ్యక్షులు సుంకయ్య



**డోన్, జూలై 12 ( ఆంధ్రపత్రిక):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో లక్ష మందికి పైగా ఉన్న అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ కు ఎన్నికల సందర్భంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుంకయ్య, నియోజకవర్గ కార్యదర్శి జి .అబ్బాస్ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా నాయకురాలు జులేక ,ఎస్తేరులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక నక్కిరామన్న కార్మిక భవన్ నందు విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి .సుంకయ్య మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ తమ సమస్యల పరిష్కారం కోసం అనేకసార్లు ఎన్నో ఉద్యమాలు పోరాటాలు చేసిన అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సమస్యలు పరిష్కారం చేయకపోగా కార్మిక ఉద్యమాలను అనచివేశారని వారు అన్నారు. అంగన్వాడి వర్కర్స్ గొంతెమ్మ కోరికలు కోరలేదని పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం 26 వేల రూపాయలు కావాలని , ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని,ఉద్యోగ భద్రత కల్పించాలని, సంక్షేమ పథకాల అమలు చేయాలని ,రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని రిటైర్మెంట్ వయసు పెంచాలని, పని ఒత్తిడి తగ్గించి ,ఎఫ్ ఆర్ ఎస్ యాప్ ను రద్దుచేసి ఒకే యాప్ ద్వారా పనులు చేయించాలని కోరామని పరిష్కారం చేయకుండా సమ్మె చేస్తున్న అంగన్వాడి వర్కర్స్ పై పోలీసులతో నిర్ధాక్షణంగా లాటి చార్జీలు చేసి చివరికి ఏస్మాప్రయోగించి ఉద్యోగం లో నుండి తొలగిస్తామని హెచ్చరిస్తూ 50 వేల మందికి పైగా ఉద్యోగం నుండి తొలగిస్తున్నట్లు ప్రకటించారు .ఇన్ని నిర్బంధాల మధ్య అంగన్వాడి వర్కర్స్ తమ హక్కులను కోల్పోయి దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నటువంటి సందర్భంలో ఎన్నికల బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేను అధికారంలోకి వస్తే అంగన్వాడి వర్కర్ సమస్యలను పరిష్కారం చేస్తానని బహిరంగ సభలో ప్రకటించారు అందుకు వర్కర్స్ సంతోషించారు కానీ అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తక్షణమే అంగన్వాడి వర్కర్ల సమస్యలు పరిష్కారం చేయడంలో వెంటనే చర్యలు చేపట్టాలని కార్మిక సంఘాలతో చర్చలు జరపాలని అంగన్వాడి వర్కర్స్ ను ఆదుకోవాలని ఈ సందర్భంగా కోరారు .లేని పక్షంలో మరి కొంత సమయం తర్వాత తప్పని పరిస్థితి అయితే మరో ఉద్యమానికి సిద్ధం కావాల్సి వచ్చిందని ఈ సందర్భంగా తెలియజేశారు. సమావేశంలో డోన్ ప్రాజెక్ట్ నాయకురాలు మల్లికా ,స్వర్ణలత ,మస్తాన్ బి, నిర్మల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం. సురేంద్ర లు పాల్గొన్నారు.

# తిరుమలలో షాపింగ్ కాంప్లెక్స్, ఆర్బిసి ప్రాంతాలలో ఇఓ తనిఖీలు



**తిరుమల,జులై12(ఆంధ్రపత్రిక):** తిరుమలలోని వరాహస్వామి విశ్రాంతి భవనం, ప్రధాన షాపింగ్ కాంప్లెక్స్‌లలోని దుకాణాలను శుక్రవారం అధికారులతో కలిసి ఇఓ జె.శ్యామలరావు శుక్రవారం తనిఖీ చేశారు.

ఇందులో భాగంగా షాపుల లైసెన్స్‌లు, సంబంధిత ధృవీకరణ పత్రాలను పరిశీలించారు. షాపింగ్ కాంప్లెక్స్ వరండాలో సరకులను నిల్వ ఉంచి, భక్తుల రాక పోకలకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్న దుకాణ దారులను, షాపింగ్ కాంప్లెక్స్ చుట్టుపక్కల అనధి కారిక తట్టలు, హాకర్లను హెచ్చరించాలని సంబం ధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఇఓ మాట్లాడుతూ, యాత్రికులు తిరిగేందుకు వీలు లేకుండా దుకాణదారులు సరుకులు ఉంచారని, అలా కాకుండా పరిశుభ్రతతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణంలో యా త్రికులు షాపింగ్ చేసే విధంగా షాపింగ్ కాంప్లెక్స్ ను తీర్చిదిద్దాలనే ఆలోచనలో ఉన్నట్లు చెప్పారు. త్వరలో అనధికారిక తట్టలు, హాకర్ల లైసెన్సులను తనిఖీ చేసి ఆక్రమణలను తొలగించాలని అధికారులను ఆదేశిం చారు. అంతకుముందు గోకులం లోని సమావేశ మందిరంలో జెఇఓ వీరబ్రహ్మంతో కలిసి టీటీడీ రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలపై ఇఓ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుమల ఎస్టేట్స్ అధికారి విజయలక్ష్మి, ప్రత్యేక అధికారి మల్లిఖార్జున, ఏఇఓ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్ రావు



బంగారుపాళ్యం,జూలై 12(ఆంధ్రప్రత్రిక): చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండల కేంద్రంలోని రోఫ్స్ సేవా సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన వికలాంగులకు వీల్ సైకిళ్ళు పంపిణి కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావు పాల్గొన్నారు.ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ విద్యతోనే విజ్ఞానం సాధ్యమవుతుందని కావున ప్రతి ఒక్కరూ విద్యనభ్యసించాలని తెలిపారు. ముఖ్యంగా మహిళలు విద్యావంతులు కావాలన్నారు.మహిళ హక్కుల కోసం పోరాడాలని అన్నారు.ఆప్తులకు ఆపన్న హస్తాన్ని అందించేది స్వచ్ఛంద సేవా సంస్థలే అని కొనియాడారు.రోఫ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రతిభావంతులకు వీల్ చైర్లను పంపిణీ చేశారు.ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించి తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆయన సూచించారు.మరీ ముఖ్యంగా మహిళలు విద్యావంతులైనప్పుడు సమాజం పురోభివృద్ధి వైపు పయనిస్తుందని ప్రసాద్ రావు తెలియజేశారు.

చిత్తూరు పార్లమెంటు సభ్యులుగా ఢిల్లీ లోక్ సభలో ప్రమాణ స్వీకారం చేసి,బంగారుపాళ్యంకు తొలిసారిగా వచ్చేసిన ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావుకు బంగారుపాల్యం టిడిపి మండల అధ్యక్షుడు జయ ప్రకాష్ నాయుడు,పార్లమెంటు జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, స్థానిక సర్పంచ్ ఉమాదేవి కృష్ణమూర్తి తదితరులు స్వాగతం పలికారు.

రోఫ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ కె.ధన శేఖరన్,అధ్యక్షురాలు శ్రీలత,ఐఎంసి చిత్తూరు జిల్లా ఇన్చార్జ్ రమేష్,సభ్యురాలు సుభాషిని తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు.అనంతరం ఆయన మాట్లాడుతూ తాను ఐఆర్ఎస్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో రోఫ్స్ లాంటి స్వచ్ఛంద సేవా సంస్థతో పాటు టిటిడి ట్రస్ట్, క్రిస్టియన్,హిందూ,ముస్లిం సేవా సంస్థల సేవల గురించి తనకు అవగాహన ఉందన్నారు.ఆ సందర్భంలో ఆసంస్థలకు ప్రత్యక్షంగా సేవ చేసే భాగ్యం తనకు కలిగిందన్నారు.ఇప్పుడున్న పరిస్థితులలో స్వచ్ఛంద సేవ సంస్థల సేవలు సమాజానికి ఎంతో కీలకమన్నారు.రోప్ స్వచ్ఛంద సేవా సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు.

ప్రజలు కూడా స్వచ్ఛంద సేవా సంస్థలు అందిస్తున్న సేవలను అందిపుచ్చుకొని తమ ఉన్నతికి బాటలు వేసుకోవాలని సూచించారు. తాను కూడా ప్రభుత్వ ప్రతినిధిగా స్వచ్ఛంద సంస్థలకు ఏ మేరకు సహాయ సహకారాలు అందించగలనో అందించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. ప్రజలు కూడా తాము సొంతంగా ఎదగడానికి ప్రయత్నించాలని,చిన్న తరహా, మధ్యతరహా పరిశ్రమలు స్థాపించుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రసాదరావు తెలిపారు.రోఫ్స్ సంస్థ ఆధ్వర్యంలో వీల్ చైర్లను ప్రత్యేక ప్రతిభావంతులకు అందించారు.అలాగే మహిళల ఉపాధి కోసం రోఫ్స్ సంస్థ నేతృత్వంలో సిద్ధం చేసిన చెక్కులను మహిళలకు అందించారు.ఆప్తులకు ఆపన్న హస్తానందించేందుకు తానెప్పుడూ ముందుంటానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు కోక ప్రకాష్ నాయుడు, టిడిపి నాయకులు ధరణి నాయుడు,భాష్యం వంశీ చౌదరి,హేమచంద్ర నాయుడు మరియు పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సముద్రతీర ప్రాంతాలలో యాత్రికుల రక్షణకు పటిష్ట చర్యలు





బాపట్ల ,జూలై 12(ఆంధ్రప్రత్రిక): సముద్రతీర ప్రాంతాలకు వచ్చే యాత్రికుల రక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. బాపట్ల జిల్లాలోని సూర్య లంక, రామాపురం, వాడరేవు సముద్ర తీరాలకు యాత్రికులను అనుమతించిన తరుణంలో జూలై 12న శుక్రవారం ఎస్పీ యాత్రికులకు పలు సూచనలు సూచించారు. ఎస్పీ మాట్లాడుతూ బాపట్ల జిల్లాలోని సూర్యలంక, రామాపురం, వాడరేవు సముద్ర తీరాలకు ఎక్కువ సంఖ్యలో యాత్రికులు వస్తుంటారన్నారు. గత నెలలో చోటుచేసుకున్న వరుస ప్రమాదాలలో యాత్రికులు మృత్యువాత పడడంతో తగిన భద్రతాపరమైన చర్యలు తీసుకోవడానికి తాత్కాలికంగా బాపట్ల జిల్లాలోని సముద్రతీరంలోకి యాత్రికులను అనుమతించలేదన్నారు. బాపట్ల జిల్లాలోని రిసార్ట్ నిర్వాహకులతో కమిటీ ఏర్పాటు చేసి వారి సహకారంతో యాత్రికులు సముద్రంలో మునిగే ప్రదేశాలలో గజ ఈతగాళ్లను నియమించడం జరిగిందన్నారు.

గజ ఈతగాళ్లకు రక్షణగా లైఫ్ బాయ్, లైఫ్ జాకెట్ లను ఏర్పాటు చెయ్యడం జరిగిందన్నారు. ప్రజలను అప్రమత్తం చేయడానికి పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టమ్ లను, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సివిల్, మెరైన్ పోలీస్ లతో సముద్ర తీరం వెంబడి గస్తీ ఏర్పాటు చెయ్యడం జరిగిందన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా రక్షణ పరమైన తగిన భద్రత చర్యలు తీసుకున్న అనంతరం యాత్రికులను తిరిగి అనుమతించడం జరిగిందని తెలిపారు.పోలీసులు సూచించే సూచనలు, హెచ్చరికలు యాత్రికుల రక్షణ, భద్రత కొరకే అని గ్రహించాలన్నారు. మద్యం సేవించి ఎవరు సముద్రంలో మునగ రాదని, సముద్రపు అలల ఆటుపోట్లను గమనిస్తూ సముద్రంలో ఎక్కువ లోతు కు వెళ్లకుండా పోలీస్ వారు సూచించిన లోతు వరకే వెళ్లి స్నానాలు ఆచరించాలన్నారు. యువకులు, విద్యార్థు లే ఎక్కువ గా ప్రమాదాలకు గురవుతున్నారన్నారు కనుక సముద్ర స్నానాలు ఆచరించడానికి విచ్చేసే యువకుల పై నిఘా వుంచడం జరుగుతుందని తెలిపారు. యాత్రికులు పోలీసు వారికి సహకరించి, వారి సూచనలు పాటిస్తూ, ఆనందంగా, ఆహ్లాదక రంగా గడిపి క్షేమంగా వారి గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. సముద్రతీ రాలలో యాత్రికులు పాటించవలసిన జాగ్రత్తలు యాత్రికులు పోలీస్ శాఖ సూచనలు తప్పనిసరిగా పాటించాలి. తీరప్రాంతాలలోని బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించరాదు. మద్యం సేవించి ఎవరు సముద్రంలో మునగరా దు. నిర్దేశించిన ప్రదేశాల లోనే తగిన జాగ్రత్తలు తీసుకుంటూ సముద్రంలో మునగాలి. పోలీస్ శాఖ ఎరుపు రంగు జెండాలు ఏర్పాటుచేసి సూచించిన లోతు వరకే వెళ్ళాలి, అంతకు మించి లోతుకు వెళ్ళరాదు. ఇతర యాత్రికులకు ఇబ్బంది కలిగే విధం గా, గౌరవానికి భంగం కలిగే విధంగా వ్యవహరించరాదు. పిల్ల లు, వృద్ధులు లోతుకు వెళ్ళకు ండా వారి సంరక్షకుల సమక్షంలో మునగాలి. యాత్రి కులు వారి వాహనాలను సురక్షిత ప్రదేశాల లో పార్క్ చేసుకోవాలి. యాత్రికులు వారి విలువైన వస్తువులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలి. సముద్రం ఆటుపోట్లకు గురి అవుతున్నప్పుడు పోలీస్ సిబ్బంది పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టమ్ ద్వారా చెప్పే సూచనలను పాటించాలి. హెచ్చరిక బోర్డు లలో ఉన్న సూచనలను తప్పని సరిగా పాటించాలి. విధులలో ఉన్న పోలీస్ సిబ్బందికి సహకరించాలి.

# హెూటల్ గ్రాండ్ నాగార్జున ఆధ్వర్యంలో కుండ బిరియాని ఫుడ్ ఫెస్టివల్



గుంటూరు,జులై 12 ( ఆంధ్రప్రత్రిక ): గుంటూరు నాగార్జున గ్రాండ్‌లోని నూతనంగా కుండ బిర్యానీ ఫెస్టివల్ ప్రారంభించడం జరిగింది ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ పాల్గొన్నారు. ఈ సందర్భం గా నజీర్ అహ్మద్ మీడియాతో మాట్లాడుతూ గుంటూరు నగరం బిర్యానీకి చాలా ప్రసిద్ధి చెందినది అని అటువంటి గుంటూరు నగరంలో ఒక సరికొత్త ఆలోచనతో గ్రాండ్ నాగార్జున హెూటల్ వారిచే కుండ బిరియాని ఫెస్టివల్ ఏర్పాటు చేయటం అభినందనీయమని ఈ బిరియాని ఫెస్టివల్ లో వెజ్ బిర్యానీ, చికెన్ దమ్ బిర్యాని, మటన్ దమ్ బిర్యానీ తో పాటు వివిధ రకాల ప్రత్యేక మసాలా దినుసులతో అత్యంత క్వాలిటీ మరియు రుచికరంగా ప్రత్యేక షఫ్ ల తో తయారు చేసిన అన్ని రకాల బిర్యాని లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో హెూటల్ గ్రాండ్ నాగార్జున యాజమాన్యం సమీర్ జానీ, మరియు హెూటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీం పొడిగింపు

కొరిశపాడు జూలై 12(ఆంధ్రప్రత్రిక ): రాష్ట్ర ప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీం పథకాన్ని 2024-25 ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ 12.07.2024న జీవో యం.యస్ నెం. 82 ను జారీ చేసినట్లు సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ శ్రీ హిమాన్షు శుక్లా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీం (WJHS) పొడిగింపునకు సమా చార, పౌర సంబంధాల శాఖ ప్రతిపాదనలు పంపించగా ప్రభు త్వం ఆమోదం తెలిపిందని వివరించారు.జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ ద్వారా జర్నలిస్టులు, వారిపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులకు ఏదైనా అనుకోని అనారోగ్యం సంభవించిన ప్రతి సారి రూ. 2 లక్షల వరకు విలువ చేసే వైద్యసేవలు అందుతా యని, ఇలా సంవత్సర కాలంలో ఎన్నిసా ర్లైనా పరిమితులు లేకుండా ఈ సదుపాయాన్ని అందిస్తారని తెలి పారు. వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ ద్వారా జర్నలి స్టులు ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ( ఈ హెచ్ ఎస్ ) తరహాలో వైద్య సేవలు పొందవచ్చన్నారు. వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ ద్వారా పొందే వైద్యసేవల విషయంలో ఎలాంటి ఆదాయ పరిమితులు లేవని, అదే విధంగా నిర్దేశిత చికిత్సలకు సంబంధించి ఉచిత ఓపీ సేవలు పొందవచ్చని ఆయన వివరించారు. ఈ పథకానికి డా. నందమూరి తారకరామారావు వైద్య సేవ ట్రస్ట్ ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీగా అదే విధంగా సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తాయని ఆయన పేర్కొన్నారు. అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని డైరెక్టర్ శ్రీ హిమాన్షు శుక్లా ప్రకటనలో స్పష్టం చేశారు.

# తిరుమలలో యువతిపై విరిగిపడిన చెట్టుకొమ్మ..

## యువతికి తీవ్ర గాయాలు...



తిరుమల,జూలై 12(ఆంధ్రప్రత్రిక): యువతిపై విరిగిపడిన చెట్టు కొమ్మ విరిగి పడటంతో యువతికి తీవ్ర గాయాలు అయ్యాయి. తిరుమల తిరుపతి దేవస్థానం నిత్యం వేలాది లేదా లక్షలాది మంది భక్తులతో కిటకిటలాడుతుంది. నిత్యం కొండ మీదికి భక్తులు వస్తూనే ఉంటారు. తిరుపతికి వెళ్లాక కేవలం శ్రీవారి దర్శనంతో సరిపెట్టుకోకుండా చుట్టుపక్కల ఉన్న ఇతర దైవ క్షేత్రాలను కూడా దర్శించి మొక్కులు సమర్పించుకుంటారు. ఇలాగే ఓ యువతి తిరుమల కొండపై ఉన్న జాపాలి క్షేత్రంలో ఆంజనేయ స్వామి దర్శనం కోసం వెళ్లుతుండగా తీవ్ర ప్రమాదానికి గురైంది. దర్శనం కోసం వెళుతుండగా.. ఆలయ ముఖ ద్వారానికి సమీపానికి వచ్చాక హఠాత్తుగా ఓ పెద్ద చెట్టుకొమ్మ విరిగి ఆమె పై పడింది. ఆ కొమ్మ నేరుగా ఆమె తలపై పడింది. దీంతో క్షణాల్లోనే ఆమె నేలపై కూలపడిపోయింది. ఆమె పక్కనే ఉన్న వ్యక్తి మాత్రం అదృష్టవశాత్తు ఎలాంటి ప్రమాదానికి గురికాలేదు. ఆమె భక్తిలో దైవ దర్శనానికి వెళ్లుతుండగా మార్గమధ్యంలోనే పైనుంచి పెద్ద కొమ్మ వచ్చి పడటం అందరినీ ఆందోళనలోకి నెట్టేసింది. ఈ ఘటనను తోటి భక్తులు వీడియో తీశారు. గాయాలైన ఆ యువతిని హాస్పిటల్‌కు తరలించారు.

# కర్నాటక మద్యం పట్టివేత

## -నలుగురు వ్యక్తులను అరెస్టు



ఎమ్మిగనూరు. జూలై 12 (ఆంధ్రప్రత్రిక): మంత్రాలయం మండలం పరిధిలోని రాంపురం గ్రామంలో సమీపంలో పంపు హౌస్ వద్ద ఆటో లో కర్నాటక మద్యం తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్లు సెబ్ సీఐ భార్గవ్ రెడ్డి పేర్కొన్నారు. పట్టుబడిన నలుగురు వ్యక్తులు రాంపురం గ్రామానికి చెందిన మహబూబ్. చాపల బాబు. తుంగభద్ర గ్రామానికి చెందిన ఈరన్న. రాఘవేంద్ర లను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి మద్యం. ఆటో ను స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. టెట్రా ప్యాకెట్లు బాటిల్ 720. 10 బాక్సుల్లో వుండగా వీటి విలువ లక్ష రూపాయల వరకు వుంటుందని అంచనా వేశారు. ఈ కార్యక్రమంలో సెబ్ ఎస్ఐ హెడ్ కానిస్టేబుళు. సెబ్ పోలీసులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన సదస్సు



వేటపాలెం, జూలై 12, (ఆంధ్రప్రత్రిక): ఆరోగ్య సంరక్షణకు పరిశుభ్రత అత్యవసరమని పట్టభద్రుల సంఘం అధ్యక్షులు ప్రత్తి వెంకట సుబ్బారావు అన్నారు. పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో వేటపాలెం జీవీ కేసీ ఎయిమ్ ఫర్ సేవా బాలుర వసతి గృహ విద్యార్థులకు ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వారోత్సవాల సందర్భంగా ఆరోగ్యం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహారం తీసుకోవటానికి ముందు చేతులను పరిశుభ్రంగా కడుక్కొని ఆ తర్వాతే ఆహారం తీసుకోవాలన్నారు. విద్యార్థులకు సోప్స్, సోప్ బాక్స్, టూత్ పేస్ట్, టూత్ బ్రష్, కొబ్బరి నూనె, గడియారాలు అందించారు.

అనంతరం అల్పాహారాన్ని, పట్టభద్రుల సంఘ ప్రతినిధులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి సుంకర వెంకట లక్ష్మీ ప్రసాద్, సభ్యులు వెంకట సాయి స్నేహ మల్లిక, మౌనిక,శ్రీను, మస్తాన్ రెడ్డి, వేంకటేశ్వర్లు, సేవక్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

# బాలిక కుటుంబానికి న్యాయం జరగాలి

## -మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని



ఎమ్మిగనూరు. జూలై 12(ఆంధ్రప్రత్రిక): నందికొట్కూర్ నియోజకవర్గం ముచ్చుమర్రి గ్రామంలో 8 సంవత్సరాల బాలిక హత్యకు గురైన బాలిక కుటుంబానికి న్యాయం జరగాలి మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గిడ్డమ్మ,శ్రావణి లు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సిపిఐ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏపి మహిళా సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు గిడ్డమ్మ. శ్రావణి మాట్లాడుతూ ముచ్చుమరి గ్రామంలో మూడో తరగతి చదువుతున్న 8 సంవత్సరాల బాలిక వాసంతి పై అత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించా లన్నారు. వాసంతి అనే బాలిక హత్యపై ఆచూకీ నాలుగు రోజులైనా లభించలేదన్నారు. అదే గ్రామానికి చెందిన ముగ్గురు మైనర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్నారు. పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపట్టారు. విచారణలో అసలు విషయం బయటకు వచ్చింది పాపం శుభం తెలియని చిన్నారి వాసంతిపై మానవ మృగాలు అత్యాచారం చేసి,హత్య చేసినట్లుఅంగీకరించనట్లు తెలిపారు. ,మృతదేహాన్ని ముచ్చుమతి ఎత్తిపోతల కాలువ లో పడేసామని పోలీసులకు సమాచారం అందించారు. బుధవారం ఉదయం నుంచి పోలీసులు కాలువలో గాలింపు చర్యలు చేపట్టిన పాప ఆచూకీ లభించలేదని, ఉన్నతా ధికారులు ఈ మృగాలపై కఠినమైన చర్యలు తీసుకుని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఈరమ్మ, పద్మావతి, పట్టణ నాయకురాలు కృష్ణమ్మ, ఈరమ్మ,వాణి తదితరులు పాల్గొన్నారు.

# 'దిల్ సే కరో బాత్, భగవాన్ కే సాథ్' కాంపైన్‌ను ప్రారంభించిన ఐటిసి మంగల్ దీప్




తిరుపతి,జూలై 12(ఆంధ్రప్రత్రిక):భారతదేశపు ప్రీమియర్ అగర్ బత్తి బ్రాండ్ ఐ టి సి మంగల్దీప్ తమ కొత్త, 'దిల్ సే కరో బాత్, భగవాన్ కే సాథ్' (మనస్ఫూర్తిగా భగవంతునితో మాట్లాడండి) ను అనగా 'భగవంతుడ్ని మీకు సన్నిహితమైన వ్యక్తిగా చేయండి' అని అర్థం ఇచ్చే తమ కాంపైన్ ను ప్రకటించింది. ఈ విలక్షణమైన కాంపైన్ భగవంతునితో తమకు గల దైవిక సంబంధాన్ని సంబరం చేస్తుందని కాంపైన్ విడుదల గురించి ఐటీసీ మ్యాచెస్ , అగరబత్తి బిజినెస్ (ఎంఏబీ) ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ గౌరవ్ తయాల్ అన్నారు. ఇది మనస్ఫూర్తిగా సంభాషణలు చేసే ఇద్దరు సన్నిహిత వ్యక్తుల మధ్య ఉన్న సంబంధంలాగా మనుష్యులు భగవంతునికి మధ్య సంబంధాన్ని ఉదాహరిస్తుందన్నారు. ఈ కాంపైన్ తో, బ్రాండ్ కొత్త స్థానం అనుసరిస్తుందనీ, దీనిలో విభిన్నమైన జీవితాలు, సంస్కారాలు, నమ్మకాలు, ఆధ్యాత్మికత, భక్తిని వ్యక్తీకరించే మార్గాలు ఉంటాయన్నారు. కాంపైన్ ను లక్ష్యభరితమైన ప్రేక్షకుల వద్దకు తీసుకువెళ్లడానికి, ఓగిల్వీ ఇండియా ద్వారా చిత్రీకరించబడిన కొత్త యాడ్ ను ఐ టి సి మంగల్దీప్ విడుదల చేసిందన్నారు.ఈ కాంపైన్ గురించి ఓగిల్వీ ఇండియాలో గ్రూప్ క్రియేటివ్ డైరెక్టర్ రాజేష్ మణి మాట్లాడుతూ తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, అరుణాచల్ ప్రదేశ్, కేరళ రాష్ట్రాల్లో 10 జులైన నుండి ప్రసారమయ్యే ఫ్లాగ్ షిప్ టీవీసీ (యాడ్) విడుదల చేసిందన్నారు. ఈ కొత్త స్థానం గురించి ప్రచారం చేయడానికి సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్ కార్యకలాపాలను ఏర్పాటు చేశామని చెప్పారు.

# భారతదేశంలో ఏసర్ బ్రాండ్ కింద స్మార్ట్ ఫోన్‌లను ఆవిష్కరించిన ఇండ్‌కల్ టెక్నాలజీస్

INDKAL



గుంటూరు, జూలై 12(ఆంధ్రప్రత్రిక): భారతదేశంలోని ప్రముఖ సాంకేతిక సంస్థ అయిన ఇండ్‌కల్ టెక్నాలజీస్, వినూత్న సాంకేతికత, అసాధారణ ఉత్పత్తులకు ప్రసిద్ధి చెందిన గ్లోబల్ ఐసీటీ దిగ్గజం ఏసర్ సంస్థతో ట్రేడ్‌మార్క్ లైసెన్సింగ్ ఒప్పందం కింద స్మార్ట్ ఫోన్ మార్కెట్‌లోకి ప్రవేశించినట్లు ప్రకటించింది. ఈ ఒప్పందం ప్రకారం, ఇండ్‌కల్ భారతదేశంలో ఏసర్ బ్రాండ్ క్రింద స్మార్ట్ ఫోన్ల రూపకల్పన, తయారీ, పంపిణీ చేస్తుంది. ఈ వ్యూ హాత్మక ఒప్పందం భారతీయ మార్కెట్లోకి ఏసర్-బ్రాండెడ్ స్మార్ట్ ఫోన్ల పరిచయాన్ని సూచిస్తుంది. ఇది ఆవి ష్కరణ, విస్తరణల కొత్త శకానికి నాంది పలికింది.ఇండ్‌కల్ టెక్నాలజీస్ 2024 మధ్యలో ఏసర్ బ్రాండ్ క్రింద విస్తృత శ్రేణి స్మార్ట్ ఫోన్ మోడళ్లను విడుదల చేయనుంది. ఇది త్వరగానే ఊపందుకొని గణనీయమైన మార్కెట్ వాటాను పొందగలదని భావిస్తున్నారు. ఈ ప్రయత్నం ఏసర్ బ్రాండ్ శక్తి సామర్థ్యాలు, భారతీయ వినియోగ దారులకు ప్రీమియం-నాణ్యత ఉత్ప త్తులను అందించడంలో ఇండ్‌కల్ నిబద్ధతను చాటిచెబుతుంది. ఇందులో పటిష్ఠ స్పెసిఫికేషన్‌లు, అత్యా ధునిక హార్డ్ వేర్, అధునాతన సాఫ్ట్ వేర్ సాంకేతికతలు ఉన్నాయి. ఇండ్‌కల్ టెక్నాలజీస్ సీఈఓ ఆనంద్ దూబే ఈ సందర్భంగా మాట్లాడుతూ, "ఏసర్ స్మార్ట్ ఫోన్ విషయంలో మేం రెండేళ్లుగా పని చేస్తున్నాం. ఎట్టకేలకు ఈ ప్రయత్నాన్ని ప్రకటించినందుకు మేం సంతోషిస్తున్నాం. ఏసర్ స్మార్ట్ ఫోన్లతో, భారతీయ వినియోగదారులు వేడుక చేసుకోగలరని మేం కచ్చితంగా చెప్పగలం. మా కొనుగోలుదారులు హై ఎండ్ ప్రాసెసర్లు, అత్యున్నత స్థాయి కెమెరా టెక్నాలజీ, సంబంధిత శ్రేణిలో అనేక ప్రీ మియం ఫీచర్‌లతో అనూహ్యంగా చక్కగా రూపొందించబడిన స్మార్ట్ ఫోన్లను పొందగలుగుతారు. ఓ గొప్ప విషయం ఏమిటంటే, అన్ని ఏసర్ -బ్రాండెడ్ స్మార్ట్ ఫోన్లు భారత్ లోనే రూపొందించబడతాయి మరియు తయారు చేయబడతాయి, ఇది ఇండ్‌కల్ కు ఒక ప్రత్యేక విజయం" అని అన్నారు.ఏసర్ గ్లోబల్ స్ట్రాటజిక్ అలయన్సెస్ వీపీ జేడ్ జౌ ఈ సందర్భంగా మాట్లాడుతూ, "1987లో స్థాపించబడినప్ప టి నుండి, ప్రజలు మరియు సాంకేతికత మధ్య అడ్డంకులను ఛేదించడమే ఏసర్ బ్రాండ్ లక్ష్యం. ఏసర్ బ్రాం డ్ క్రింద విస్తృత శ్రేణి స్మార్ట్‌ఫోన్లను అందించడం ద్వారా ఇండ్‌కల్ టెక్నాలజీస్ భారతదేశంలో ఈ ఆశయా న్ని మరింతగా ముందుకు తీసుకువెళ్లనున్నందుకు మేం సంతోషిస్తున్నాం. ఇది తుది వినియోగదారు ఎంపికలను విస్తరింపజేస్తుంది మరియు భారతదేశ మార్కెట్లో వారి అనుభవాన్ని మెరుగుపరుస్తుంది.

# ఆర్టిసి బస్సు బోల్తా ప్రయాణికులు సురక్షితం



జె పంగులూరు, జూలై 12 ( ఆంధ్రప్రత్రిక ): ఇంకొల్లు నుండి అద్దంకి వస్తున్న అద్దంకి డిపో ఆర్టీసీ బస్సు ప్రమాదవశాత్తు అదుపుతప్పి కొప్పెరపాడు నుండి తక్కెళ్ళపాడు వచ్చే దారిలో ఎస్ ఎస్ ఫార్మ్స్ దాటాక రోడ్డు పక్కన పంట కాలువలోకి పడడం జరిగింది.

ఆర్టీసీ బస్సులో 19 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడడం జరిగింది ఎవరికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



## మొగల్తూరులో ఎరువుల దుకాణం తనిఖీ

**- తనిఖీ చేస్తున్న ఏడి అనిల్ కుమారి**

**మొగల్తూరు,జూలై 12 (ఆంధ్రపత్రిక):**మొగల్తూరు గాంధీ బొమ్మ సెంటర్లో గల ఎరువులు పురుగుమందులు దుకాణాన్ని నరసాపురం వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఈద అనిల్ కుమారి నిర్వహించారు. దుకాణంలో శాస్త్రవేత్తలు మరియు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు సంయుక్తంగా ధ్రువీకరించిన ఎరువులు పురుగు మందులు మాత్రమే విక్రయాలు నిర్వహించాలని ఆమె దుకాణ నిర్వాహకులకు సూచించారు. షాపులో ఎరువులు విత్తనాలు అమ్మే రికార్డులను ఆమె పరిశీలించి సంతృప్తికరం వ్యక్తం చేశారు. ఆమె వెంట మొగల్తూరు మండల వ్యవసాయ శాఖ అధికారి షేక్ అబ్దుల్ రహీం ఉన్నారు.

## జూబ్లీహిల్స్ శ్రీ పెద్దమ్మ తల్లికి ఘనంగా ప్రత్యేక పూజలు



**నరసాపురం/మొగల్తూరు జూలై 12 (ఆంధ్రపత్రిక):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధాని జూబ్లీహిల్స్ నందు వేంచేసియున్న శ్రీ పెద్ద మ్మ తల్లి ఆలయము నందు శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ట్రస్ట్ బోర్డు చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాస్ రాజుల ఆధ్వర్యంలో బోర్డు సభ్యులు, మరియు ఆలయ సిబ్బంది భక్తులకు అసౌకర్యం కలగకుండా తగిన పర్యవేక్షణ నిర్వహించారని శ్రీ సత్తెమ్మ తల్లి దేవాలయ సిబ్బంది కముజు సుజాత పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం నియోజకవర్గంలో మా "ఆంధ్రపత్రిక ప్రతినిధి"కి తెలిపారు. శుక్రవారం భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.

## నేడు ఈ గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం



**కె.కోటపాడు, జులై 12 (ఆంధ్రపత్రిక):**ఈ నెల13వ తేదీన మండలంలోని వారాడ విద్యుత్ సబ్-స్టేషన్ నిర్వహణ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగ దారులు సహకరించాలని ఏపీ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కె.కోటపాడు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఎం.చంద్ర శేఖర్ శుక్రవారం ఇక్కడి విలేఖరులకు తెలిపారు. విద్యుత్ సబ్ - స్టేషన్ మెయింట్ నెన్స్ పనుల్లో భాగంగా ఎల్.సి.తీసుకో నున్న కారణంగా శనివారం ఉదయం 9:00గంటల నుండి సాయంకాలం 4:00గంటల వరకూ వారాడ, పింద్రంగి, రామయోగిఅగ్రహారం, ఆనందపురం, వి.సంతపాలెం, యడ్లవానిపాలెం, కొరువాడ, గవర పాలెం, కె.జె.పురం తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ఈ అంతరాయాన్ని వినియోగదారులు గమనించాలని ఎ.ఇ.చంద్రశేఖర్ కోరారు.

## వేపాడ సబ్ స్టేషన్ పరిధిలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ఏ.పీ ఈపీడీసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.సురేష్ బాబు**



**వేపాడ, జూలై 12 (ఆంధ్రపత్రిక):** మండలంలోని వేపాడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గల గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపిడీసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.సురేష్ బాబు తెలిపారు. విద్యుత్ ఉప కేంద్రం నిర్వహణ పనుల నిమిత్తం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 10గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగు తుందన్నారు. వేపాడ సబ్ స్టేషన్ పరిధిలోని వేపాడ, వల్లంపూడి, దబ్బిరాజుపేట, చామాలాపల్లి, కరకవలస, వావిల పాడు, కడకొండ, నల్లబిల్లి, చినగుడిపాల, నీలకంఠ రాజపురం, బల్లంకి, బానాది, కృష్ణారాయుడుపేట కుమ్మపల్లి, ఏ.కే.జి పాలెం, దీక్షితుల అగ్రహారం, వీలు పర్తి,చామలాదేవిఅగ్రహారం, తదితర 19 గ్రామాలలో సుమారు రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు.

## ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన మండల విద్యాశాఖ అధికారి



**వేపాడ, జూలై 12 (ఆంధ్రపత్రిక):**మండలంలోని చామలాపల్లి మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి పి.బాల భాస్కరరావు శుక్రవారం సందర్శించారు. ముందుగా పాఠశాల పరిసరాలను పరిశీలించి విద్యార్థులు సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.సాయంత్రం పాఠశాల ప్రార్థన నిర్వహణ, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించి, వారితో చతుర్విధ ప్రక్రియలు చేయించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, మెనూ ప్రకారం మధ్యాహ్నం భోజనాన్ని విద్యార్థులకు అందించాలని కోరారు.అనంతరం అధ్యాపకులతో రివ్యూ సమావేశాన్ని నిర్వహించారు. అధ్యాపకులు సమయపాలన పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, సిఆర్పిలు,పాల్గొన్నారు.

# బుచ్చెంపేట సచివాలయంలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ



**కోరుకొండ, జూలై 12 (ఆంధ్రపత్రిక):**కోరుకొండ మండలం బుచ్చంపేట గ్రామ సచివాలయం రాజనగరం ఎమ్మెల్యే బత్తుల బలరాంకృష్ణ శుక్రవారం ఆకస్మిక తనిఖీనిర్వహించారు. గ్రామంలో ప్రస్తుతం ఉన్న సమస్యలు, ఇబ్బందులు, సచివాలయ సిబ్బంది గురించి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ, గ్రామ విఆర్వో, సచివాలయం సెక్రటరీ, ఇతర సిబ్బంది అందరం కలిసి కట్టుగా పనిచేద్దామని, ప్రజలకు ఎటువంటి సమస్యలు గానీ, ఇబ్బంది గానీ వచ్చినా త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డిఏ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ట్రిబుల్ ఐటీలలో స్థానం సాధించిన గురుకుల పాఠశాల విద్యార్థులు




**అనకాపల్లి,జూలై 12 (ఆంధ్రపత్రిక):**పట్టణంలో గల మహాత్మ జ్యోతిబాపూలే ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు పైల మౌళి ఇంద్ర ఆకాష్‌లకు ప్రతిష్టాత్మకమైన ఐఐఐటిలో స్థానం సంపాదించారు. పైలమౌళికి శ్రీకాకుళం క్యాంపస్లో, ఇంద్ర ఆకాష్‌కు ఒంగోలు క్యాంపస్లో ప్రవేశం లభించిందని, ఈ సంవత్సరం పదవ తరగతి ఫలితాలలో కూడా ఈ ఇరువురు అత్యధిక మార్కులతో సత్తా చాటారని, పదవ తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించారని దేవరశెట్టి వెంకటేశ్వర్లు తెలియజేశారు. గురుకుల పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కర్రీ గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి నప్పుడే తల్లిదండ్రులు నిజమైన ఆనందాన్ని పొందుతారని, వీరిని ఆదర్శంగా తీసుకుని ఈ సంవత్సరం పబ్లిక్ పరీక్షలు రాయబోయే విద్యార్థులు కూడా బాగా చదవాలి అని చెప్పారు. పాఠశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తమ పాఠశాల విద్యార్థులు ట్రిబుల్ ఐటీకి ఎంపిక అవడం గర్వించదగిన విషయమని చెప్పారు. హిందీ అధ్యాపకుడు మహేంద్ర నాథ్ పట్నాయక్ మాట్లాడుతూ ప్రతిభ కలిగిన విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంచి అవకాశాలు కల్పిస్తున్నాయని రాష్ట్ర ప్రభుత్వం పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్లు, ప్రతిభా అవార్డుతో సత్కరిస్తారని, నూతన ప్రభుత్వం పారిశ్రామిక రంగం అభివృద్ధిపై దృష్టి పెడుతున్నందున ప్రతిభ కలిగిన విద్యార్థులకు అత్యధిక జీతంతో మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలియజేశారు. గురుకుల పాఠశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు ఇరువురు విద్యార్థులను అభినందించారు.

## సాంకేతికతతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చు

**- ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ**



**అనకాపల్లి,జూలై 12 (ఆంధ్రపత్రిక):**సాంకేతిక పరిజ్ఞానంతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని, వృత్తి నైపుణ్యత పెరిగినప్పుడే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని మాజీ మంత్రి, శాసనసభ్యుడు కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు. శ్రీ గౌరీ గ్రంథాలయంలో జన శిక్షణా సంస్థాన్ సహకారంతో టైలరింగ్, బ్యూటీషియన్, కంప్యూటర్ శిక్షణా తరగతులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత జీవన పరిస్థితుల్లో వృత్తి నైపుణ్యతలుంటేనే జీవనాన్ని ఎదుర్కొనగలమని, నిరంతర పఠనం, శిక్షణ మరింత విజ్ఞానాన్ని తెలియజేస్తుందన్నారు. ఆధునిక సాంకేతికతల వల్ల ఆన్లైన్ వ్యాపారాలు, స్వయం ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని తద్వారా ప్రయోజనాలను అందిపుచ్చుకోవడం ఎంత అవసరమో, మోసాలకు చిక్కకుండా జాగ్రత్తపడటమూ అంతే కీలకమని, అందుకు కంప్యూటర్ అక్షరాస్యత ఎంతో అవసరమన్నారు. మహిళలు, గ్రామీణుల్లో డిజిటల్ అక్షరాస్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో జరుగుతున్న శిక్షణా తరగతులను డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్థికాభివృద్ధి, స్వయం ఉపాధి రంగంలో ప్రోత్సహించేందుకు టైలరింగ్, బ్యూటీషియన్, కంప్యూటర్ ఉచిత శిక్షణా తరగతులు దోహదపడతాయన్నారు.సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రామకృష్ణ అన్నారు. జన శిక్షణా సంస్థాన్ (జెఎస్ఎస్) ఛైర్మన్ సీ.ఏ. రామరాజు మాట్లాడుతూ శిక్షణా కాలంలో స్టేషనరీ, మెటీరియల్‌ను ఉచితంగా అందిస్తామన్నారు. ప్రతి రోజూ మూడు గంటలు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణలో నైపుణ్యం సాధించిన అభ్యర్థులకు సర్టిఫికేట్లు కూడా జారీ చేస్తామమని ఆయన చెప్పారు. గౌరీ గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ మాట్లాడుతూ ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే గ్రంథాలయాలను నిత్య దర్శనీయ కేంద్రాలుగా విద్యార్థులు, యువత గుర్తించాలని అన్నారు. సమావేశంలో జె.ఎస్.ఎస్.డైరక్టర్ కె.నాయుడు, గ్రంథాలయ అధ్యక్షుడు డి.నూకఅప్పారావు, కోశాధికారి భీశెట్టి కృష్ణఅప్పారావు, మాజీ కార్యదర్శి మళ్ల బాపునాయుడు, సభ్యులు కాండ్రేగుల సత్యనారాయణ (ఎస్.ఎఫ్.ఐ.), బొడ్డేడ జగ్గఅప్పారావు పాల్గొన్నారు. అనంతరం గతంలో టైలరింగ్, బ్యూటీషియన్, కంప్యూటర్‌లో పొందిన అభ్యర్థులకు సర్టిఫికేట్లును కొణతాల రామకృష్ణ అందజేశారు.

## ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు

**మత్తు విముక్తి కేంద్ర సిబ్బంది 12 నెలల బకాయి వేతనాలు వెంటనే విడుదల చేయాలి**

**ఏపీ. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ వివి.శ్రీనివాసరావు మద్దతు**




రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రులలో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న మత్తు విముక్తి కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బందికి 2023 ఆగస్టు నుండి 2024 జూన్ వరకు 12 నెలలుగా జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ జీతాలు వెంటనే విడుదల చేసి తమ కుటుంబాలను ఆదుకోవాలని సిబ్బంది అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద ఈరోజు నుండి రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలకు ఏపీ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అనకాపల్లి జిల్లా కన్వీనర్ వీవీ శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్రావులు సందర్శించి వారి పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగంలో అనేక సంస్కరణలు తీసుకొని వచ్చి ప్రజలకు వైద్యాన్ని అందుబాటులో తెస్తున్నామని చెబుతున్న, ఆచరణలో ప్రతి ఏడాది బడ్జెట్ కుదింపు చేస్తుందన్నారు. దీనివల్లే కేంద్ర ప్రభుత్వ స్కీముగా కొనసాగుతున్న మత్తు విముక్తి కేంద్రాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బందికి కనీసం ప్రతీ నెలా జీతాలు కూడా ఇవ్వకుండ చేయటం అత్యంత దుర్మార్గం అన్నారు. రాష్ట్రంలోని 25 కేంద్రాల్లోని పనిచేస్తున్న సిబ్బందికి 12 నెలలుగా జీతాలు ఇవ్వకుండా తాత్సారం చేయడం అన్యాయం అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లా అధికార యంత్రాంగం వెంటనే స్పందించి ఈ సిబ్బందికి 12 నెలల వేతనాలు విడుదల చేయాలని లేదంటే వీరి పోరాటాన్ని మరింత ఉధృతం చేయడంలో తమ యూనియన్లు భాగస్వాములు అవుతాయని ప్రభుత్వాన్ని హెచ్చరిక చేశారు.

## ఎస్టీ, ఎస్సీ, బిసి విద్యార్థి వసతి గృహాల సమస్యలు జిల్లా కలెక్టర్ పరిష్కరించాలి

**వామపక్ష పార్టీల డిమాండ్**




**అనకాపల్లి,జూలై 12 (ఆంధ్రపత్రిక):**సీపిఎఐ, సీపిఎం, సీపిఎఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీల ఆధ్వర్యంలో జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల సమస్యలపై శుక్రవారం ప్రదర్శన నిర్వ హించి అర్.డి. ఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వ హించాము. జిల్లా కలెక్టర్కు ఉద్దేశించిన వినతి పత్రాన్ని అనకాపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాల యానికి అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజన దొరబాబు, మీడియాతో మాట్లాడారు. అనకాపల్లి జిల్లా ఎస్టీ, ఎస్సీ, బిసి విద్యార్థి వసతి గృహాలకు గత ఆరు నెలలుగా నిధులు విడుదల కాలేదని, ప్రస్తుతం రెండు నెలల నిధుల విడుద లకు ప్రక్రియ మొదలు పెట్టారని అన్నారు. ఇది వసతి గృహాలలోని విద్యార్దులకు ప్రాణ సంకటంగా మారిందని అన్నారు.నిధులు లేని కారణంగా వసతి గృహాలలోని విద్యార్దులకు పోషక విలువలు కలిగిన నాణ్యమైన ఆహారం అందటం లేదని, మౌలిక వసతకులు లేక విద్యార్దులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు అర్.శంకర్రావు మాట్లాడుతూ ఏప్రిల్-మే నెలలో చేపట్టవలసిన హాస్టల్ మరమ్మత్తులు, ఎన్నికల కారణంగా జరగలేదని, కొన్ని వసతి గృహాలలో సిబ్బంది కొరత వున్నదని, ఖాళీ అయిన పోస్టలను భర్తీ చేయాలని హాస్టల్లో బాత్రూంలో సక్రమంగా లేక విద్యార్థులు మరుగుదొడ్లకు బయటకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందని దీనివల్ల అనారోగ్యంతో పాలవుతున్నారని అన్నారు.సీపిఎఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ప్రతినిధి సవరాల గణేష్ మాట్లాడుతూ వసతి గృహాలలోకు నోడల్ అధికారులను పంపి సమగ్రమైన ఆడిట్ జరపాలని వామపక్ష పార్టీలు జిల్లా కలెక్టర్‌ను కోరారు. సమాజంలోని అట్టడుగు వర్గాల పిల్లలు విద్యాభివృద్ధికి వసతి గృహాలు చాల కీలకమిని అటువంటివాటిపై నిర్లక్షం తగదని వామపక్ష పార్టీలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి పీఏస్ అజయ్ కుమార్, సీపిఎం నాయకుల నగిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ సభ్యత్వ నమోదు

**కె.కోటపాడు, జూలై 12 (ఆంధ్రపత్రిక):**ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఎ.పి.టి .ఎఫ్.)-2024-2025 సంవత్సరం సభ్యత్వ నమోదుకు సంఘ సారధులు మండలంలో శనివారం శ్రీకారం చుట్టారు. మండలంలో గల కె.కోటపాడు, చౌడువాడ, మేడిచర్ల, పాతవలస, ఎ.కోడూరు, కొరువాడ, గొండుపాలెం గ్రామాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేశారు.ఎ.పి.టి.ఎఫ్. రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమరాన త్రినాథ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఈ మండల శాఖ అధ్యక్షుడు సూరెడ్డి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బోకం లలితాప్రసాద్, పూర్వ ప్రధాన కార్యదర్శి ఆదిరెడ్డి అబద్ధం, ఆడిటర్ కిలపర్తి శ్రీను, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బొద్దాం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఓబలయ్యపాలెంలో ర్యాలీ

**- ఉచిత వైద్య శిబిరంలో పలువురు రోగులకు చికిత్సలు**



**వేపాడ, జూలై 12(ఆంధ్రపత్రిక):**మండలంలోని బొద్దాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆద్వర్యంలో శుక్రవారం ఓబలయ్యపాలెం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో నాలుగైదు రోజులుగా గ్రామస్తులు జ్వరాలబారిన పడగా బొద్దాం ఆస్పత్రి సిబ్బంది గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే.ఈ మేరకు గ్రామస్తులను చైతన్య పరుస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అలాగే గ్రామంలో దగ్గు, జలుబుతో బాధపడుతున్న ఏడుగురు వ్యక్తులకు వైద్య పరీక్షలు జరిపి మందులు పంపిణీ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దివదారి లక్ష్మి, పాటూరు గ్రామ టీడీపీ నాయకుడు కొట్యాడ రమణమూర్తి, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ ర్యాలీలో మలేరియా, చికెన్ గున్యా తదితర వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.

## దశపర్ణి కషాయం తయారీపై అవగాహన కార్యక్రమం



**వేపాడ, జూలై 12 (ఆంధ్రపత్రిక):**మండలంలోని కొమ్మపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ మండల ఎం.టి సన్యాసమ్మ,ఐ.సి.ఆర్ పి.ఈశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం దశపర్ణి కషాయం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం దశపర్ని కషాయం తయారు చేసే విధానాన్ని రైతులకు వివరించి, వారితో చేయించారు. 40 రోజుల వ్యవధిలో తయారైన దశపర్ణి కషాయం రైతులు వినియోగించడం వలన పంట సస్యశ్యామలంగా పండుతుందని తెలిపారు.ఈ కషాయం కాయగూరలు, వరి పంటలకు వినియోగించడం వలన కాయ తొలుచు,కాండం తొలిచే పురుగులు అలాగే పచ్చ పురుగులు నివారించబడతాయని తెలిపారు. వరి పంటకు ముందు దశపరిని కషాయాన్ని పొలాల్లో చల్లాలని తెలిపారు.కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నారాయణమ్మ, మహిళా రైతులు పాల్గొన్నారు.

## శాకంబరీ దేవిగా అమ్మవారు



**అనకాపల్లి.జులై 12 (ఆంధ్రపత్రిక):**పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో అమ్మవారి ప్రతిష్ఠా శతజయంతి ఉత్సవాలు భాగంగా ఆషాడ మాసం సందర్భముగా శుక్రవారం శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి శాకంబరీ దేవిగా అలంకరణ చేశారు, అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో. ప్రతిష్ట శత జయంతి ఉత్సవములచైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషు కుమార్, ఆలయ అధ్యక్షులు బిళ్ళపాటి కృష్ణ కుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు. ఉత్సవ కమిటీ చైర్మన్ వుప్పల శ్రీనివాసరావు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కందిపప్పు, బియ్యం, ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు



**అనకాపల్లి, జూలై 12 (ఆంధ్రపత్రిక):**ధరలు నియంత్రణలో భాగంగా వినియోగదారుల సౌకర్యార్థం అనకాపల్లి పట్టణంలో మెయిన్ రోడ్లో కందిపప్పు, బియ్యం, ప్రత్యేక కౌంటర్లు శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేకమైన కౌంటర్లు అనకాపల్లి జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కె.వి.ఎల్. ఎన్ మూర్తి, అమ్మకాలను ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన కందిపప్పు కేజీలు 160రూపాయలు, బియ్యం కేజీ 49 రూపాయలు, ధరలకు అమ్మకాలు జరుగుతాయి ఆయన తెలియజేశారు. శనివారం అనకాపల్లి మెయిన్ రోడ్ లో శ్రీధరాల జోగారావు షాపు వద్ద ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని దీని ద్వారా ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో. ఏ ఎస్ ఓలు కళ్యాణి, నందకిషోర్. సిఎస్డిటి లీల శేషు కుమారి, అనకాపల్లి రైస్, డాల్ మర్చంట్ అసోసియేషన్. సంఘం గౌరవ అధ్యక్షులు శ్రీధరాల సోమరాజు, అధ్యక్షులు బొడ్డేడ శంకర్రావు. కార్యదర్శి. గుండా సాయి, కోశాధికారి. బచ్చు రామకృష్ణ, సంఘ సభ్యులు ప్రజలు పాల్గొన్నారు.



# కాన్వాయ్ ఆపి స్వయంగా వినతుల స్వీకరణ

**పార్టీ కార్యాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తా**
**సిఎం చంద్రబాబు నాయుడు వెల్లడి**

**అమరావతి, జూలై 12 (ఆంధ్రపత్రిక):** ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక చంద్రబాబు నాయుడు ఏపీ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వీలైనంత త్వరగా నెరవేర్చేలా ప్రణాళికలను రూపొందిస్తున్నారు. ఏపీని అన్ని విధాలుగా ముందుకు తీసుకెళ్లేందుకు చంద్రబాబు నిత్యం శ్రమిస్తున్నారు. అధికారులతో సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తూ సీఎం బిజీబిజీగా గడుపుతున్నారు. అలాగే ఎక్కడికక్కడ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వాటిని త్వరిగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఈ క్రమంలో శుక్రవారం ఉండవల్లి నివాసం నుంచి సెక్రటేరియట్‌కు వెళ్తుండగా అక్కడ ఉన్న ప్రజలను చూసి ముఖ్యమంత్రి చంద్రబాబు కాన్వాయ్ ఆపారు. నివాసం నుంచి కాన్వాయ్ బయటకు వచ్చిన వెంటనే రోడ్డుపై వినతి పత్రాలతో జనం నిలబడి ఉన్నారు. వారిని కార్‌లో నుంచి చూసిన చంద్రబాబు ముందుకు వెళ్తూ కాన్వాయ్‌లో తన కార్ ఆపివేయించారు. అనంత రం కారు దిగి... అందరి వద్దకు వెళ్లి వినతి పత్రాలు తీసుకుని సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

సమస్యలను పరిష్కరిస్తానని ప్రజలకు చంద్రబాబు హామీ ఇచ్చారు. అలాగే పార్టీ ఆఫీస్‌లో వినతి పత్రాలు తీసుకునేందుకు కొత్త వ్యవస్థను ఏర్పాటు చేశామని అక్కడకు వెళ్లి కూడా ఇవ్వొచ్చని ఈ సందర్భంగా ప్రజలకు చంద్రబాబు చెప్పారు.



# తీర ప్రాంతంలో సముద్ర కోత నివారణ

**ఎన్‌సీసీఆర్, కోస్టల్ మేనేజ్‌మెంట్ జోన్ అథారిటీ మధ్య ఒప్పందం**
**డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడి**

**అమరావతి, జూలై 12 (ఆంధ్రపత్రిక):** ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతంలో సముద్ర కోత నివారణపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టిపెట్టారు. తీర ప్రాంతంలో అలల ఉధృతికి భూమి కోతను నివారించేలా నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రిసెర్చ్ (ఎన్‌సీసీఆర్), ఏపీ కోస్టల్ మేనేజ్‌మెంట్ జోన్ అథారిటీ మధ్య ఒప్పందం కుదిరింది. తీర ప్రాంత నిర్వహణపై ఎన్‌సీసీఆర్ రూపొందించిన ప్రణాళికను డిప్యూటీ సీఎం విడుదల చేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. సముద్రపు కోత ప్రమాదాన్ని నివారించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. ఇటీవల ఉప్పాడ తీరంలో కోతపై సమీక్షించి నిపుణులతో చర్చించామన్నారు. రాష్ట్రంలోని తీరం వెంట కోత సమస్య ఎక్కడెక్క ఉంది? వాటి రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై అధ్యయనం చేయాలని అధికారులను పవన్ ఆదేశించారు. కొత్త ఓడ రేవులు, ఫిషింగ్ హార్బర్ల కోసం అనువైన ప్రదేశాలు ఎంచుకునేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తీర ప్రాంత కోత ప్రమాద నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రకటించారు. తీర ప్రాంత నిర్వహణపై ఎన్సీసీఆర్ రూపొందించిన ప్రణాళికను విడుదల చేశారు. తీర ప్రాంత నిర్వహణకు ఎన్సీసీఆర్, ఏపీసీజడ్ఎంఏల మధ్య అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. రాష్ట్టానికి 973 కి.మీ.కిపైగా ఉన్న సుదీర్ఘ సముద్ర తీరం ఒక వరం తీర ప్రాంత సంరక్షణ, నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో సముద్రపు కోత ఆందోళన కలిగిస్తోంది. కోత ప్రమాదాన్ని నివారించేందుకు ప్రత్యేక దృష్టిపెడుతున్నామని వివరించారు. ఇటీవల ఉప్పాడ తీరంలో కోతపై సమీక్షించి నిపుణులతో చర్చించామని అన్నారు. రాష్ట్రంలోని తీరం వెంబడి కోత సమస్య ఎక్కడెక్కడ ఉంది, రక్షణ చర్యల గురించి అధ్యయనం చేయాలని ఆదేశాలిచ్చామని అన్నారు. తీర ప్రాంత నిర్వహణ ప్రణాళికను డిప్యూటీ సీఎం విడుదల చేశారు. నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్ (ఎన్.సి.సి.ఆర్.) నిపుణులతో ప్రణాళిక రూపొందించామని వివరించారు. ఈ ప్రణాళిక తీర ప్రాంతంలో తీర ప్రాంతాల కోత, కెరటాల శక్తి తగ్గింపుతోపాటు కోత, కెరటాల తీవ్రత నుంచి వచ్చే ప్రమాదాలను తగ్గించేందుకూ ఉపయోగపడుతుందని చెప్పారు. కొత్త ఓడ రేవులు, ఫిషింగ్ హార్బర్లు లాంటి వాటి కోసం అనువైన ప్రదేశాలు ఎంచుకోవడానికి ఈ ప్రణాళిక దోహదపడుతుందన్నారు. ఎన్.సీసీఆర్., ఆంధ్ర ప్రదేశ్ కోస్టల్ జోన్ మేనేజ్మెంట్ అథారిటీలు మధ్య పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ఒప్పందం కుదుర్చుకున్నట్లు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు.

# స్టార్స్ పథకం ద్వారా 48 మంది విద్యార్థులు ఉచిత ప్రవేశాలు

**-స్టార్స్ పథకం ద్వారా విఐటి-ఏపి విశ్వవిద్యాలయంలో ఉచిత ప్రవేశాన్ని పొందిన 48 మంది గ్రామీణ నిరుపేద విద్యార్థులు**
**- డా:ఎస్.వి. కోటా రెడ్డి, వైస్ ఛాన్సలర్**



**విజయవాడ, జూలై 12 (ఆంధ్రపత్రిక):** స్టార్స్ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని 26 జిల్లాలకు చెందిన 52 విద్యార్థులలో 48 మంది విద్యార్థులు విఐటి-ఏపి విశ్వవిద్యాలయంలో ఉచిత ప్రవేశాన్ని పొందారు. ఆంధ్రప్రదేశ్‌లోని 26 జిల్లాలలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఇంటర్మీడియట్ పబ్లిక్ ఎగ్జామ్‌లో జిల్లా టాపర్‌లుగా ఉన్న 48 మంది ప్రతిభావంతులైన విద్యార్థుల ను స్టార్స్ పథకం ద్వారా విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యను అభ్యసించేటందుకు అవకాశం కల్పించటం జరిగింది. ఈ పథకం ద్వారా ఎంపికైన విద్యార్థులకు విద్య మరియు హాస్టల్ సౌకర్యాలలో 100% ఫీజు మినహాయింపును అందించి వారి జీవితాలను మెరుగుపరిచే లక్ష్యంతో రూపొందించిన పథకం. మొదట ఈ పథకం తమిళనాడులోని వెల్లూరులోని విఐటి విశ్వవిద్యాలయంలో 2008లో వ్యవస్థాపక ఛాన్సలర్ డా:జి.విశ్వనాథన్ చేతులమీదుగా ప్రారంభమైంది. తదుపరి విఐటి చెన్నై, విఐటి-ఏపి, విఐటి-భోపాల్ క్యాంపస్‌లకు విస్తరించింది. ఈ సందర్భంగా విఐటి-ఏపి విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డా:ఎస్.వి. కోటా రెడ్డి మాట్లాడుతూ పేదరిక నిర్మూలనకు విద్యే సరైన ఆయుధం అని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని అతి సామాన్యమైన కుంటుంబాలనుండి వచ్చిన ప్రతిభావంతమైన విద్యార్థులకు నాణ్యమైన ఉన్నతవిద్యను అందించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచి సమాజానికి అందించే ఆద్భుతమైన పథకమే స్టార్స్ పథకమని తెలియచేసారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా:జగదీష్ చంద్ర మూడుగంటి మాట్లాడుతూ అర్హులైన ప్రతి విద్యార్థికి వారి కలలను సాకారం చేసుకునేందుకు అవకాశం ఉంటుందని, వారి కలలు సాకారం అయ్యేలా విఐటి-ఏపి విశ్వవిద్యాలయం ఎప్పుడు అండగా నిలుస్తుందని తెలియచేసారు.

సామాజిక-ఆర్థిక అసమానతలను రూపు మాపడానికి విద్యే చక్కటి పరిష్కారమని అన్నారు. ఉన్నత విద్య ద్వారా విఐటి-ఏపీ విశ్వవిద్యాలయం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డా:జాన్ ప్రదీప్ (డిప్యూటీ డైరెక్టర్-అడ్మిషన్స్), డా:మనోజ్ కుమార్ మిశ్రా (అసిస్టెంట్ డైరెక్టర్-అడ్మిషన్స్) డా:వెంకంట లక్ష్మి (స్టార్ పథకం కోఆర్డినేటర్), దయానంద్ గుంటి (చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్) విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.



# జర్నలిస్ట్ హెల్త్ స్కీం పొడిగింపు

**జివో విడుదల చేసిన సమాచారశాఖ**

**అమరావతి, జూలై 12 (ఆంధ్రపత్రిక):** జర్నలిస్ట్‌లకు ఏపీ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీం పొడిగించినట్లు సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీం పథకాన్ని 2024-25 ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ జీవో యం.యస్ నెం. 82ను జారీ చేశారు హిమాన్షు శుక్లా. జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ ద్వారా జర్నలిస్టులు, వారిపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులకు ఏదైనా అనుకోని అనారోగ్యం సంభవించిన ప్రతిసారి రూ.2 లక్షల వరకు విలువ చేసే వైద్యసేవలు అందుతాయని వివరించారు. ఇలా సంవత్సర కాలంలో ఎన్నిసార్లైనా పరిమితులు లేకుండా ఈ సదుపాయాన్ని అందిస్తారని ప్రకటనలో వెల్లడించారు. ఈ పథకానికి డా.నందమూరి తారకరామారావు వైద్య సేవ ట్రస్ట్ ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందని వెల్లడించారు. సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తాయని తెలిపారు.

# ఆంధ్రప్రదేశ్ సేద్యానికి అరుద్కెన గుర్తింపు

**ప్రతిష్ఠాత్మక గుల్బెంకియన్ అవార్డు**

**అమరావతి, జూలై 12 (ఆంధ్రపత్రిక):** అంతర్జాతీయ వేదికగా ఆంధ్రప్రదేశ్ సేద్యానికి అరుదైన గుర్తింపు లభించింది. ఈ ఏడాదికి గానూ ప్రతిష్ఠాత్మక 'గుల్బెంకియన్ అవార్డు ఏపీ సమాఖ్య ప్రకృతి వ్యవసాయానికి వరించింది. ఒక శాస్త్రవేత్త, మరో సంస్థతో కలిసి ఏపీసీఎన్ఎఫ్ ఈ పురస్కారాన్ని దక్కించుకుంది. పోర్చుగల్‌లోని లిస్బన్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ టి.విజయ్‌కుమార్, మహిళా రైతు నాగేంద్రమ్మ నెట్టం ఈ పురస్కారాన్ని అందుకున్నారు. 117 దేశాల నుంచి వచ్చిన 181 నామినేషన్లతో పోటీపడి ఏపీసీఎన్ఎఫ్ ఈ అవార్డు దక్కించుకుంది. 2016లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏపీసీఎన్ఎఫ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. దీనికింద సన్నకారు రైతులు రసాయన ఆధారిత వ్యవసాయం నుంచి సహజ పద్ధతుల్లో సేద్యం చేసేలా రైతు సాధికార సంస్థ కృషి చేస్తోంది. సేంద్రియ విధానంలో తయారు చేసిన ఎరువును ఉపయోగించడం, దేశీయ విత్తనాలు తిరిగి ప్రవేశపెట్టడం, పంటల వైవిధ్యీకరణ, నేల సారాన్ని కాపాడుతూ సాగు చేయడం వంటి వాటిని ఇది ప్రోత్సహిస్తోంది.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి



వర్షపు నీటిలో ప్రతిబింబిస్తున్న విజయవాడలోని కలెక్టర్ కార్యాలయం



విజయవాడలో ఫుడ్ ప్రాసెసింగ్ సెక్టార్‌లో అవకాశాలపై సదస్సును ప్రారంభించిన ఐ అండ్ పిఆర్ మంత్రి కె.పార్థసారథి

ఆంధ్రపత్రిక ఫోటోలు: సిహెచ్.విజయభాస్కర్











విజయవాడలో ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జగన్నాథ రథయాత్ర..

Printed and Published by KANCHARLA RAMAIAH on behalf of Nageswara Rao Estates Private Limited,Printed at Jagati Publications Limited, Sakshi Press, SY.No.481, Phase-2, Jawahar Autonagar, Vijayawada-520007 Andhra Pradesh, and Published from D.NO.29-28-34, Dasari vari street, Suryaraopeta,Vijayawada-520002, KRISHNA DISTRICT-ANDHRA PRADESH, Editor : KANCHARLA RAMAIAH. Excutive editor V.VIJAYALAKSHMI. RNI no. 10721/65 Mobile:9849998069, Email:andhrapatrikadaily@gmail.com